RNI No.: TELTEL/2011/47101

# అక్షర వార్త

దినపత్రిక

AKSHARA VAARTHA

సంపుటి: 14 సంచిక : 13 కరీంనగర్ శుక్రవారం, జూన్ 13, 2025 వెల : రూ॥1/- పేజీలు : 8

# అహ్మదాబాద్‌లో ఘోర విమాన ప్రమాదం





అహ్మదాబాద్: గుజరాత్‌లోని అహ్మదాబాద్ విమానాశ్రయానికి సమీపంలోని మేఘనినగర్‌లో గురువారం మధ్యాహ్నం 242 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఎయిర్ ఇండియా విమానం కూలిపోయింది. అహ్మదాబాద్-లండన్ గాట్విక్ కు వెళ్తున్న AI171 విమానం గురువారం మధ్యాహ్నం సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలోని మేఘానీనగర్ ఘెడాసర్ క్యాంప్ ప్రాంతంలో టేకాఫ్ అయిన నిమిషాల్లోనే కూలిన బోయింగ్ 787-8 డ్రీమ్ లైనర్ విమానం.

సంఘటన జరిగిన సమయంలో విమానంలో ఇద్దరు పైలట్లు, 10 మంది క్యాబిన్ సిబ్బంది, ప్రయాణీకులతో సహా 242 మంది ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రయాణికుల్లో అత్యధికులు చనిపోయారని అధికారులు భావిస్తున్నారు. మేఘానీనగర్ లోని బీజే మెడికల్ కాలేజి హాస్టల్ భవనంపై కుప్పకూలడంతో రెండు అంతస్తుల వరకు మంటలు వ్యాపించాయి. ఈ ఘటనలో పలువులు మెడికో విద్యార్థులు చనిపోయినట్లు తెలుస్తోంది.

గాయపడిన వైద్య విద్యార్థులను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. విమానం కూలిన చోట 2 భారీ భవనాలకు అటుకున్న మంటలను అగ్నిమాపక సిబ్బంది అదుపు చేస్తున్నారు. కూలిన విమానంలో 169 మంది భారతీయులు, 53 మంది బ్రిటన్ భారతీయులు, ఏడుగురు పోర్చుగీసు వారు, ఒక కెనడీయన్ తో సహా మొత్తం 242 మంది ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రయాణికుల్లో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నేత విజయ్ రూపానీ కూడా ఉన్నారు. విమాన ప్రయాణికుల సమాచారం కోసం హాట్ లైన్ నంబర్ 1800 5691 444 ఏర్పాటు చేశారు.

అహ్మదాబాద్ విమాన ప్రమాదం... బాధిత కుటుంబాలకు ప్రధాని సానుభూతి

అహ్మదాబాద్ నుండి లండన్ గాట్విక్ కు బయలుదేరిన AI171 విమానం గురువారం మధ్యాహ్నం సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలోని మేఘాని ప్రాంతం సమీపంలో టేకాఫ్ అయిన ఐదు నిమిషాల్లోనే కూలిపోయింది. ఈ విమాన ప్రమాద ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. అహ్మదాబాద్ విమాన ప్రమాదం తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొన్నారు. ఈ దుర్ఘటన మాటలకు అందని మహావిచారమని, బాధిత కుటుంబాలకు ప్రధాని మోదీ సానుభూతి వ్యక్తం చేశారు. బాధితుల సహాయార్థం అధికారులతో పాటు పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడుతో ప్రధాని మోదీ స్వయంగా సంప్రదింపులు జరిపినట్లు పేర్కొన్నారు.

ఈ సంఘటన జరిగిన సమయంలో విమానంలో 169 మంది భారతీయులు, 53 మంది బ్రిటన్ దేశస్థులు. విమానంలో ఏడుగురు పోర్చుగీస్ దేశస్థులు, ఒకరు కెనడియన్ ఉన్నట్లు ప్రాథమిక నివేదికలు సూచిస్తున్నాయి. కూలిన విమానంలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నేత విజయ్ రూపానీ ఉన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. అయితే ప్రయాణీకుల సంఖ్య ప్రాణనష్టంపై అధికారిక ధృవీకరణ ఇంకా వెల్లడించలేదు.

అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై విచారం వ్యక్తం చేసిన బ్రిటన్ ప్రధాని

అహ్మదాబాద్ నుండి లండన్ గాట్విక్ కు బయలుదేరిన AI171 విమానం గురువారం మధ్యాహ్నం సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో టేకాఫ్ అయిన ఐదు నిమిషాల్లోనే కూలిపోయింది. ఈ విమాన ప్రమాదంలో 53 మంది బ్రిటన్ భారతీయులు కూడా ఉన్నారు. ఈ ఘటనపై బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద దృశ్యాలు హృదయ విదారకంగా ఉన్నాయని విచారం వ్యక్తం చేశారు.

పరిస్థితిపై ఎప్పటికప్పుడు భారత్ తో సంప్రదించి వివరాలను తెలుసుకుంటున్నట్లు ఆయన ఒక ప్రకటనను విడుదల చేశారు. విదేశాంగ, కామన్వెల్త్ మరియు అభివృద్ధి వ్యవహారాల కార్యదర్శి డేవిడ్ లామీ మాట్లాడుతూ... భారతదేశంలోని అహ్మదాబాద్‌లో జరిగిన విధ్వంసకర విమాన ప్రమాదం వార్త తీవ్ర విచారం కలిగించిందన్నారు. వాస్తవాలను తక్షణమే నిర్ధారించడానికి, తమ మద్దతు అందించడానికి యూకే భారతదేశంలోని స్థానిక అధికారులతో కలిసి పనిచేస్తోందని పేర్కొన్నారు. భారతదేశంలోని బ్రిటిష్ హైకమిషన్ కూడా స్థానిక అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది.

అహ్మదాబాద్ నుండి లండన్ వెళ్లే విమానం అహ్మదాబాద్ విమానాశ్రయం సమీపంలో కూలిపోయిన విషయం తెలిసిందే. ఈ సంఘటన జరిగిన సమయంలో విమానంలో 169 మంది భారతీయులు, 53 మంది బ్రిటన్ భారతీయులు. విమానంలో ఏడుగురు పోర్చుగీస్ దేశస్థులు, ఒకరు కెనడియన్ ఉన్నట్లు ప్రాథమిక నివేదికలు సూచిస్తున్నాయి. కూలిన విమానంలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నేత విజయ్ రూపానీ ఉన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు.

విమాన ప్రమాదంపై కేసీఆర్, కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి

హైదరాబాద్: గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్ లో జరిగిన ఘోర విమాన ప్రమాదం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నివాసాల మీద విమానం కూలడంతో జరిగిన ఘోర ప్రమాదంలో ప్రయాణికులు, సామాన్యులు, వైద్య విద్యార్థులు మరణించడం పట్ల తీవ్ర విచారాన్ని వ్యక్తం చేస్తూ, సంతాపాన్ని ప్రకటించారు. మరణించిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆర్థికంగా ఆదుకోవాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కేసీఆర్ కోరారు. తమ ఆప్తులను కోల్పోయి శోకతప్త హృదయులైన కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. పవిత్రమైన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

విమాన ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన కేటీఆర్..

హైదరాబాద్: అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్తున్న విమానం జనావాసాలపై కుప్పకూలిన ఘటన తన హృదయాన్ని కలిచివేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. విమాన ప్రమాదంలో ప్రయాణికులు, స్థానికులు, మెడికోలు మరణించడం అత్యంత దురదృష్టకరం అని తెలిపారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ విషాదాన్ని భరించే శక్తి బాధిత కుటుంబాలకు లభించాలని ప్రార్థిస్తున్నానన్నారు. చనిపోయినవారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియచేస్తూ.. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని కోరుకున్నారు. గాయపడ్డవారికి మెరుగైన వైద్యం అందించాలని కేంద్ర ప్రభుత్వం, గుజరాత్ ప్రభుత్వాన్ని కోరుకున్నారు.

విమాన ప్రమాదం.. ఏ దేశంవారు ఎంతమంది ఉన్నారు?

అహ్మదాబాద్ విమానాశ్రయం సమీపంలో ఎయిర్ ఇండియా విమానం కుప్పకూలిన విషయం తెలిసిందే. అయితే కూలిన విమానంలో 230 మంది ప్రయాణికులు, ఇద్దరు పైలెట్లు, 10 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో 217 మంది పెద్దలు, 11 మంది పిల్లలు, ఇద్దరు నవజాత శిశువులు ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో 169 మంది భారతీయులు, 53 మంది బ్రిటన్ పౌరులు, ఏడుగురు పోర్చుగీస్ పౌరులు, ఒక కెనడియన్ పౌరుడు ఉన్నట్లు తెలిపారు. మరోవైపు ప్రమాదంపై దర్యాప్తునకు ఎయిర్ ఇండియా పూర్తిగా సహకరిస్తున్నట్లు ప్రకటించింది. అలాగే ప్రయాణికుల సమాచారం కొరకు 1800 5691 444 నంబరు అందుబాటులోకి తీసుకోచ్చినట్లు ఎయిర్ ఇండియా వెల్లడించింది.

## గజ్వేల్ లో బాలాజీ న్యూరో హాస్పిటల్ ప్రారంభం

గజ్వేల్: గజ్వేల్ పిడిచెడ్ రోడ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన బాలాజీ న్యూరో హాస్పిటల్ బుదవారం ఘనంగా ప్రారంభించారు, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి బాలాజీ న్యూరో హాస్పిటల్ ప్రారంభం కార్యక్రమంలో పాల్గొని యాజమాన్యాలు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బాలాజీ న్యూరో హాస్పిటల్ డాక్టర్లు మాట్లాడుతూ, గజ్వేల్ మరియు పరిసర ప్రాంత ప్రజలకు అందుబాటులో బాలాజీ హాస్పిటల్ ప్రారంభించడం జరిగిందని, అనుభవజ్ఞులైన డాక్టర్లతో నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా ముందుకు సాగడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వంశీకృష్ణ వర్ధన్ రెడ్డి, యాజమాన్యం లింగ కనక ప్రసాద్,యావగారి సంతోష్ రెడ్డి, కర్రే సాయిలు, గుర్రాల కృష్ణమూర్తి, ల్యాబ్ రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## రాజేంద్రనగర్ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తా

### రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

రాజేంద్రనగర్ : నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నామని, ప్రతీ మున్సిపాలిటీలోనూ,డివిజన్ లో అవసరమైన అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు.ఈరోజు ఆయన బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రూ.7 కోట్ల 30 లక్షలతో వార్డ్ 2,3,5,6,7,13 14 వార్డ్ లలోని హిమగిరి నగర్ పెద్దమ్మ టెంపుల్, కపిల్ నగర్, ఎల్ఎన్ఎస్ కాలనీ, పిఎన్టి కాలనీ నర్సారెడ్డి కాలనీ పద్మశ్రీ హిల్స్ లలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు రోడ్డు వైడనింగ్ పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన, అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని అన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ,సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని, సీసీ రోడ్లతో పాటు అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు, కాలనీ వాసులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ మాట... అంగన్వాడి బాట.....!

సిద్దిపేట : అమ్మమాట అంగన్వాడి బాట అని, అంగన్వాడి బడిబాటలో పూర్వ ప్రాథమిక విద్య పై అవగాహన కల్పించడం జరిగిందని అంగన్వాడి టీచర్లు ఆగమ్మ, రేఖ, పద్మ, సంతోష అన్నారు. బుధవారం రాయపోల్ మండల కేంద్రంలో అంగన్వాడి కేంద్రాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలలో చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అందించేందుకు గ్రామంలో తల్లిదండ్రులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించేందుకు అంగన్వాడీ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. చిన్నారులకు పౌష్టికాహారంతో కూడిన భోజనం అందిస్తూ, ఆట పాటలతో కూడిన విద్యాబోధన చేయడం జరుగుతుందన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల మానసిక, శారీరక అభివృద్ధికి తోడ్పాటునందించడం జరుగుతుందన్నారు. మూడు సంవత్సరాలు దాటిన పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడి కేంద్రాలకు పంపాలని అవగాహన కల్పించారు. బాడిబాటలో భాగంగా టీచర్లు రెండున్నర నుంచి ఐదేళ్లలోపు చిన్నారులను గుర్తించి వారిని కేంద్రాలకు పంపించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. చదువుతోనే సమాజంలో గుర్తింపు గౌరవం లభిస్తాయని బాల్య దశ నుంచే పిల్లలకు విద్య, వినయం, క్రమశిక్షణ వంటివి నేర్పించాలని అప్పుడే పిల్లలు జీవితంలో గొప్ప స్థాయికిహొ ఎదుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం మాధవి, ఆశ కార్యకర్తలు యాదమ్మ, భాగ్య లక్ష్మి, రజిత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం

### జూన్ 12 న పాఠశాలలు ప్రారంభం సందర్భంగా పాఠశాలలను సందర్శించిన శంషాబాద్ మండల విద్యా శాఖాధికారి లక్ష్మణ్ నాయక్

**శంషాబాద్,**

జూన్ 12 న పాఠశాలలు ప్రారంభం నూతన విద్యా సంవత్సరంలో విద్యార్దులకు ఆహ్లాదకరమైన వాతావరణం పాఠశాలల్లో ఉండే విధంగా, ఈ ఏడాది మెరుగైన ఫలితాలు, సౌకర్యాలు,నాణ్యమైన విద్యను అందించడమే ధ్యేయంగా నూతన విద్యా సంవత్సరం ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని మండల విద్యా శాఖాధికారి లక్ష్మణ్ నాయక్ తెలిపారు. ఇప్పటికే పాఠశాలల్లో పరిశుభ్రంగా ఉండే విధంగా చక్కని వాతావరణం ఉండేలా, విద్యార్దులకు ఎటువంటి సమస్యలు లేకుండా ఫర్నిచర్, సదుపాయాలు ఉండే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలని చేర్పించేందుకు మే నెల నుండే ప్రతి శుక్రవారం నుండే గ్రామాల్లో ప్రచారం చేపట్టడం జరిగిందన్నారు. ఇప్పటికే ప్రజలు ఉన్న ప్రాంతాల్లోకి వెళ్లి పాఠశాలల్లో చేర్పించాలని కోరడం జరిగిందని, జూన్ 6 తేదీ నుంచి ప్రభుత్వ బడుల్లో పిల్లలని చేర్పించేందుకు ఇంటి ఇంటికి వెళ్లి పాఠశాలల్లో చేర్పించి కార్యాచరణ అనుగుణంగా ఉపాధ్యాయులను సంసిద్ధం చెయ్యడం జరిగిందని అన్నారు. వీటితో పాటు అంగన్వాడీ లో చదివిన పిల్లలు అందరినీ ప్రభుత్వ బడుల్లో చేర్పించే ప్రక్రియ జరుగుతుందన్నారు.ప్రభుత్వం విద్యార్దులకు అందించే సౌకర్యాలు , జరుగుతున్న విద్యా బోధన గురించి వివరించి గత ఏడాది కంటే ఎక్కువ మంది చేరే విధంగా కృషి చేస్తున్నాము అని అన్నారు.అన్ని పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని, ఈ ఏడాది విద్యా ప్రమాణాలు మెరుగుదలతో పాటు,మెరుగైన ఫలితాలు సాధన కోసం విద్యా సంవత్సరం ఆరంభం నుంచే సబ్జెక్ట్ టీచర్ లకు బాధ్యత అప్పగించడం జరిగిందన్నారు. పదో తరగతిలో కూడా గత ఏడాది కంటే మెరుగ్గా ఫలితాలు ఉండే విధంగా కార్యాచరణ ప్రణాళిక అమలు చేయడం జరుగుతుందన్నారు. 2025..2026 నూతన విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలు సాధించడం,నాణ్యమైన విద్యను అందించడమే ధ్యేయం విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే కృషి చేయడం జరుగుతుందన్నారు. అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులను సంసిద్ధం చేయడం జరుగుతుందన్నారు. అన్ని విభాగాల్లో విద్యార్దులను మెరుగ్గా తయారు చేయడం లక్ష్యంగా కృషి చేస్తామని తెలిపారు.ఇప్పటికే అన్ని ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం అందించే ఉచిత పాఠ్య పుస్తకాలు, వర్క్ బుక్కులు , నోటుబుక్కులు, యూనిఫాంలు సంబంధిత పాఠశాలలకు చేరాయని తెలిపారు. శంషాబాద్ మండలం ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్ నూతన విద్యా సంవత్సరం ఆరంభ వేడుకలు నిర్వహించాలని, తల్లి తండ్రుల సమావేశం నిర్వహించాలని, వారి సమక్షంలో ప్రభుత్వం కల్పించే సదుపాయాలను, ఉచిత పాఠ్య పుస్తకాలు, వర్క్ బుక్కులు విద్యార్థులకు అందజేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో శంషాబాద్ మండల ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు.



## డ్రైనేజ్ సమస్య చూసి అధికారులపై ఆగ్రహం

### నేతాజీ నగర్ వెళ్లే రోడ్డు దారిలో డ్రైనేజీ సమస్యను పరిశీలించిన రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి

**రాజేంద్రనగర్, :**రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలాదేవ్ పల్లి పరిధిలోని బుద్వేల్ స్టేషన్ వెనకాల నేతాజీ నగర్ వెళ్లే రోడ్డు దారి పూర్తిగా డ్రైనేజీ నీరు రోడ్డుపై పొంగిపొర్లుతున్న సమాచారం తెలుసుకొని వెంటనే రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ శ్రీనివాస్ రెడ్డి జిహెచ్ఎంసి మరియు హెచ్ఎం డబుల్ఎస్ వాటర్ బోర్డు అధికారులతో కలిసి సమస్యని పర్యవేక్షిస్తూ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సమస్య మీ కంటికి కనబడతలేద అని అధికారులు నిలదీస్తూ పై అధికారుల సూచనలు లేదా మాకు వివరించే బాధ్యత మీకు లేదా అని మురుగు నీటితో పాటు వర్షం పడడంతో రోడ్లపై పారుతూ ఉంది ప్రజలు రాకపోతే పోకలకు ఇబ్బంది కలుగుతూ ప్రజలు రోగాల పాడిన పడితే ఎవరు బాధ్యత వ్యవహరిస్తారని అని అధికారులను నిలదీస్తూ సమస్య చిన్నదిగా ఉన్నప్పుడు సరైన పరిష్కారం చేస్తే ఇంత పెద్ద సమస్యగా మారేది కాదని ఇప్పటికైనా ఈ సమస్యపై చర్యలు తీసుకోవాలని వెంటనే ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా ముందుగా డ్రైనేజ్ శుభ్రపరిచే విధంగా అత్యవసర పనులు ప్రారంభించాలని అనంతరం పూర్తి సమస్య తీరిఅంత వరకు ప్రత్యేక దృష్టి సాధించాలని అధికారులను ఆదేశించడం జరిగింది.మీరు నిర్లక్ష్యం వల్లే ప్రజలు మాపై పెట్టుకున్న నమ్మకాన్ని



కానీ కోల్పోతున్నారని వ్యక్తం చేస్తూ త్వరగా పని ప్రారంభించాలని ఆదేశించడం జరిగింది.ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ పాండు యాదవ్ సీనియర్ నాయకులు వార్డ్ నెంబర్ శ్రీకాంత్ రెడ్డి, జగన్, పురుషోత్తం రెడ్డి,మన్మోహన్ రెడ్డి, శంకర్ రెడ్డి, తలారి చిన్న బాలకృష్ణ, రాంబాబు,రాజు, వెంకటరమణ,సురేష్, పరమేష్, అనంతం అంజి రెడ్డి, శంకర్ రెడ్డి నరసింహమూర్తి వర్క్ ఇన్స్పెక్టర్ రాహుల్ వాటర్ బోర్డ్ అధికారులు ప్రసాద్, వినయ్ వారి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్షర వార్త

శుక్రవారం, జూన్ 13, 2025

# మణిపూర్ లోమళ్లీ మంటలు

ఈశాన్య రాష్ట్రం మణిపూర్ మళ్లీ మండుతోంది. మెయితీ తెగకు చెందిన అరంబాయ్ తెంగోల్ వర్గం కీలక నేత కానన్ సింగ్‌తో పాటుగా మరి కొందరిని శనివారంనాడు అరెస్టు చేయడంతో మరోసారి ఘర్షణలు మొదలయ్యాయి. కానన్ సింగ్‌కు మెయితీలలో గట్టి పట్టు ఉంది. అయితే మణిపూర్ హింసాకాండలో పాత్ర ఉందన్న ఆరోపణలతో ఆయనను అరెస్టు చేశారు. కానన్ సింగ్‌ను అరెస్టు చేసినందుకు నిరసనగా ఆందోళనకారులు ఆదివారం రోడ్లపైకి వచ్చి పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగారు. నిషేధాజ్ఞలను సైతం లెక్కచేయకుండా ఆందోళనలు చేశారు. తమ నాయకుడిని విడుదల చేయాలంటూ కొందరు వంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మాహుతి చేసుకుంటామని బెదిరించారు. దీంతో ముందు జాగ్రత్త చర్యగా ఇంఫాల్ లోయలోని ఐదు జిల్లాల్లో ఇంటర్నెట్ సేవలను రద్దు చేశారు. కొన్ని చోట్ల కర్ఫ్యూను సైతం విధించారు.మరోవైపు మణిపూర్‌లో తాజా హింసాకాండపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఢిల్లీలో రెండు రోజులుగా అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహిస్తున్నారు. కేంద్రం పిలుపు మేరకు మణిపూర్ మాజీ ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ అమిత్‌షాతో చర్చలు జరపడం కోసం సోమవారం ఢిల్లీకి హుటాహుటిన బయలుదేరి వెళ్లారు. అయితే మణిపూర్ అల్లర్లు ఇప్పటికిప్పుడు మొదలైనవి కావు. గత రెండేళ్లుగా అక్కడ కుకీ గిరిజనులు, మైదాన ప్రాంతానికి చెందిన మెజారిటీ మెయితీల మధ్య ఘర్షణలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ అల్లర్లలో 260 మందికి పైగా మరణించారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. వీరిలో చాలా మంది ఇప్పటికీ శరణార్థి శిబిరాల్లోనే తలదాచుకుని ఉన్నారు. కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం సొంతపార్టీ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ ప్రభుత్వాన్ని రద్దు చేసి రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించినా పరిస్థితులు కొలిక్కి రాలేదు.కేంద్ర హోం శాఖ మాజీ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లాను గవర్నర్‌గా నియమించడంతో రాష్ట్రంలో శాంతి నెలకొంటుందని అందరూ భావించారు. గత ఫిబ్రవరిలో రాష్ట్రపతిపాలన అమలులోకి వచ్చాక రాష్ట్రం కాస్త శాంతించినట్లు కనిపించినా ఇప్పుడు మళ్లీ హింసాకాండ మొదలైంది. మైదాన ప్రాంతాలకు చెందిన మెజారిటీ మెయితీ తెగ తమకు కూడా గిరిజన హోదా కల్పించాలని గత కొన్నేళ్లుగా ఆందోళన చేస్తూ వస్తున్నారు. దీన్ని కొండ ప్రాంతాలకు చెందిన కుకీ తెగ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. మెయితీలకు గిరిజన హోదా కల్పించినట్లయితే తమ ప్రాంతాలపై వారి ఆధిపత్యం మొదలవుతుందని, తమ ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందనేది వారి భయం. అయితే మెయితీలకు గిరిజన హోదా కల్పించాలని రాష్ట్రప్రభుత్వానికి సిఫార్సు చేస్తూ 2023 మేలో మణిపూర్ హైకోర్టు తీర్పునివ్వడం అగ్నికి ఆజ్యం పోసినట్లయింది.ఒక్కసారిగా రాష్ట్రం అగ్నిగుండంగా మారింది. మెయితీ తెగకు చెందిన గ్రామాలపై కుకీలు దాడి చేయడం, కుకీలకు చెందిన మహిళలను మెయితీ వర్గం ప్రజలు చెరబట్టడం, పలువురు హత్యకు గురికావడంతో మణిపూర్ అంతటా ఉద్రిక్తత నెలకొంది.కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తమ పార్టీకే చెందిన బీరెన్ సింగ్ ప్రభుత్వంపై ఎలాంటి చర్యలు తీసుకోకపోగా పరోక్షంగా ఆయనకు మద్దతుగా నిలిచింది. విపక్షాలన్నీ బీరెన్ సర్కార్‌ను తప్పించాలని డిమాండ్ చేసినా కేంద్రం పట్టించుకోలేదు. ఇంత జరుగుతున్నా ప్రధాని నరేంద్ర మోడీ ఒక్కసారి కూడా మణిపూర్‌లో పర్యటించి అక్కడి ప్రజలకు భరోసా కల్పించలేదు. పైగా ప్రతిపక్షాలకు చెందిన నేతలు మణిపూర్‌లో పర్యటించడానికి యత్నిస్తే అడ్డుకోవడానికి అన్ని రకాల ప్రయత్నించారు. అయితే రానురాను పరిస్థితి చేయిదాటి పోతోందని భావించిన కేంద్రం చివరికి బీరెన్ సింగ్‌ను పదవినుంచి తప్పించినప్పటికీ రాష్ట్ర అసెంబ్లీని రద్దు చేయకుండా సుప్త చేతనావస్థలోనే ఉంచింది రాష్ట్రంలో మామూలు పరిస్థితులు ఏర్పడితే మళ్లీ బిజెపి ప్రభుత్వాన్ని గద్దెనెక్కించాలన్నది కేంద్రం ఉద్దేశంగా కనిపిస్తోంది. ఇటీవల మణిపూర్‌కు చెందిన పలువురు బిజెపి ఎంఎల్‌ఎలు ఢిల్లీలో అమిత్ షాను కలిసి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పడమే దీనికి నిదర్శనం. మణిపూర్ ఉద్రిక్తతలను కేంద్రం ఇప్పటికీ శాంతిభద్రతల సమస్యగానే చూస్తుండడం విచారకరం. రాష్ట్రంలో రెండు బలమైన తెగల మధ్య కొనసాగుతున్న హింసాకాండకు శాశ్వతంగా ముగింపు పలికే దిశగా చర్యలు చేపట్టకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. కేంద్ర హోంశాఖ కార్యదర్శిగా పని చేసిన భల్లాకు రాష్ట్రంలోని పరిస్థితులపై స్పష్టమైన అవగాహన ఉంది.కూడా రాష్ట్రంలో శాంతిని నెలకొల్పే బాధ్యతను పూర్తిగా ఆయనకు అప్పజెప్పింది. అయితే గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించి నాలుగు నెలలు గడిచినప్పటికీ భల్లా ఇరువర్గాలతో శాంతి చర్చలకు ప్రయత్నం చేయకపోవడం ఆశ్చర్యకరం.మరోవైపు గత రెండేళ్ల కాలంలో దేశంలోని అన్ని రాష్ట్రాల్లో పర్యటించిన ప్రధాని మణిపూర్‌లో ఒక్కసారి కూడా పర్యటించకపోవడంపై రాజకీయ పార్టీలేకాక మేధా వివర్గాలు కూడా విమర్శలు గుప్పిస్తున్నాయి. దేశానికి ప్రధానిగా అన్ని రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడాల్సిన మోడీ సరిహద్దు రాష్ట్రమైన మణిపూర్‌ను మాత్రం ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారనేది ఎవరికీ అంతుబట్టని విషయంగా మారింది. చిన్న రాష్ట్రమైనా సరిహద్దు రాష్ట్రంగా దీనికి ఎంతో ప్రాధాన్యత ఉంది. సుదీర్ఘ కాలం శాంతిభద్రతల సమస్య కారణంగా రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. ప్రజలు సైతం అభద్రతా భావంతోనే రోజులు వెళ్లదీస్తున్నారు. ఈశాన్య రాష్ట్రాలన్నీ కూడా చాలా సున్నితమైనవని అందరికీ తెలిసిందే. ఈ దృష్టానైనా మణిపూర్ జాతుల సమస్యకు వీలైనంత త్వరలో ఓ శాశ్వత పరిష్కారాన్ని కనుగొనడం అత్యవసరం. ప్రపంచ స్థాయి నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న ప్రధాని మోడీకి ఈ సమస్యను పరిష్కరించడం పెద్ద కష్టమేమీ కాదు. అందుకు కావలసింది సంకల్పమే. అది జరగనంత కాలం మణిపూర్ రావణకాష్ఠం లాగా రగులుతూనే ఉంటుంది.

# ప్రమాదంలో స్వేచ్ఛా ప్రజాస్వామ్యం

- టి డబ్ల్యూ జె ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య
- ప్రశ్నార్థకంగా మారిన జర్నలిస్టుల ఐక్యత
- టి డబ్ల్యూ జేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ కృష్ణ
- విజయవంతంగా ముగిసిన జిల్లా మూడవ మహాసభలు

వనపర్తి : దేశంలో, రాష్ట్రంలో జర్నలిస్టుల స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతోందని, అందులోనూ జర్నలిస్టుల ఐక్యత ప్రశ్నార్థకంగా మారుతోందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ కృష్ణ అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని స్థానిక టీఎన్జీవో సమావేశ భవనంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా మూడవ మహాసభలు అక్రిడిటేషన్ కమిటీ మెంబర్ అశోక్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బసవపున్నయ్య, తాటికొండ కృష్ణ మాట్లాడుతూ గత ఏపీడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టుల సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో ఏపీడబ్ల్యూజేఎఫ్ ఏర్పడిందని గుర్తు చేశారు. సంఘం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులు, జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు, సంక్షేమ పథకాల కోసం ఎన్నో పోరాటాలు చేశామని తెలిపారు. గతంలో పనిచేసిన, ప్రస్తుతం కొనసాగుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టుల సమస్యలను పట్టించుకోకపోవడం దుర్మార్గమని, జర్నలిస్టుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎంతోమంది జర్నలిస్టులు పాతిక, 30 సంవత్సరాలకు పైగా పని చేసినా నేటికీ ఇందిరమ్మ ఇండ్లు గాని, ఇండ్ల స్థలాలు గాని కేటాయించక పోవడం అన్యాయమన్నారు. సామాన్యులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూ ప్రభుత్వానికి అనుసంధానంగా పనిచేస్తున్న జర్నలిస్టులకు ప్రత్యేక సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత కొన్నేళ్లుగా జర్నలిస్టులపై అధికార, విపక్ష నాయకులు దాడులకు పాల్పడటం విచారకరమని తెలిపారు. ప్రజల సంక్షేమం కోరే జర్నలిస్టు మిత్రులు వారి కుటుంబాల యోగక్షేమాలను పట్టించుకోవాల్సిన అవసరం కూడా ఉందని గుర్తు చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమాన్ని ముందిండి నడిపించిన జర్నలిస్టులకు గత సీఎం కేసీఆర్ ఏమాత్రం న్యాయం చేయలేకపోయారని ఘాటుగా విమర్శించారు. జర్నలిస్టులంతా పారదర్శకంగా, నీతి నిజాయితీగా ప్రజా సమస్యలపై గలమెత్తుతూ సామాన్యులకు న్యాయం చేసే విధంగా కథనాలను ప్రచురించాలని ఈ సందర్భంగా సూచించారు. జర్నలిస్టులను ఆయా సంస్థలు గుర్తించి వార్త కథనాలు రాయించుకుంటూ ఇచ్చే గుర్తింపు కార్డులను అధికార యంత్రాంగం పరిగణలోకి తీసుకోవాలని తెలిపారు.

అక్రిడేషన్ కార్డుల కాల పరిమితి అయిపోయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం పొడిగించడం దారుణమని, ఇప్పటికైనా కొత్త అక్రిడిటేషన్ కార్డులను, రైల్వే పాసుల రాయితీని వెంటనే జర్నలిస్టులందరికీ ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న ప్రెస్ అకాడమీ జర్నలిస్టులను విచ్ఛిన్నం చేయకుండా, వివక్ష చూపకుండా ప్రతి జర్నలిస్టుకు శిక్షణ, నైపుణ్య తరగతులు నిర్వహించాలని వృత్తిపరమైన ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం వంటి సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని అందుకోసం స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు బాధ్యత తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

ఉమ్మడి జిల్లాలో ఎక్కడా లేని అక్రిడేషన్ కార్డుల కంటే వనపర్తి జిల్లాలో జర్నలిస్టుల సంఖ్య అధికంగా ఉందని, ఈ జర్నలిస్టులంతా ఐక్యమత్యంగా సమస్యలపై పోరాడి సాధించుకోవాలని గుర్తు చేశారు. గత 30 ఏళ్ల క్రితమే వనపర్తి నియోజకవర్గ పరిధిలోని పెబ్బేరు మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ ఏర్పడి ఐక్యంగా ఉండి దాదాపు 50 మంది విలేకరులు ఇండ్ల స్థలాలు, ఇండ్లను సాధించుకున్నారని, ఈ సందర్భంగా వారిని అభినందిస్తున్నామని తెలిపారు. సుదీర్ఘకాలంగా జర్నలిస్టుల సమస్యలు పెండింగ్లో ఉంటున్నాయని వాటిపైన ఐక్యంగా పోరాడేందుకు కనీసం వందమంది కలిసి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులు ఉమ్మడిగా ఉంటూ ఐక్యంగా సమస్యల సాధన కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. ఈడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో ఉమ్మడి కార్యాచరణ రూపొందించుకొని కార్యాచరణ అమలు కోసం కలసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్య వర్గ సభ్యులు రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు మాణిక్ ప్రభు, రాష్ట్ర కమిటీ సభ్యులు పరిపూర్ణం, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు రామచందర్, సీనియర్ జర్నలిస్టులు రమేష్, పూరి సురేష్ శెట్టి, పత్రికల విలేకరులు, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త రికార్డులను రాస్తున్న వైట్ మెటల్



ముంబై : వెండి ధరలు ఇటీవల కాలంలో పెట్టుబడిదారులను ఇన్వెస్టర్లను బాగా ఆకర్షిస్తున్నాయి. రోజురోజుకూ రికార్డులను తిరగరాస్తున్న వెండి ధరలు ఇప్పుడు కొత్త శిఖరాలను చేరుకుంటున్నాయి. నిపుణుల అంచనా ప్రకారం.. ఈ దీపావళి నాటికి వెండి ధరలు కిలోకు రూ. 1.30 లక్షలు దాటే అవకాశం ఉంది. ఈ అంచనా కేవలం ఇన్వెస్టర్లకే కాదు, సామాన్య ప్రజలకు కూడా ఒక పెద్ద సంకేతం. మరి వెండి ధరలు ఎందుకు పెరుగుతున్నాయి? భవిష్యత్తులో ఎలా ఉండబోతున్నాయి? అనేది ఇప్పుడు వివరంగా చూద్దాం.కేడియా అడ్వైజరీ డైరెక్టర్ అజయ్ సురేష్ కేడియా ప్రకారం.. దీపావళి నాటికి వెండి ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది. వెండి ధర కిలోకు రూ. 1.25 లక్షల నుండి రూ. 1.30 లక్షల వరకు వెళ్లవచ్చని ఆయన అంచనా వేశారు. దీనికి అతి పెద్ద కారణం ప్రపంచ మార్కెట్‌లో సాంకేతిక బ్రేకౌట్ అని ఆయన తెలిపారు. ఇటీవల వెండి అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్‌కు 37 డాలర్ల స్థాయిని తాకింది. ఇది ఒక ముఖ్యమైన మైలురాయి. అమెరికా, చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గడం వల్ల పారిశ్రామిక డిమాండ్ పెరిగింది. వెండి దాదాపు 53-56శాతం వరకు పారిశ్రామిక రంగాల్లో ఉపయోగించబడుతుంది. ముఖ్యంగా క్లీన్ ఎనర్జీ, 5ఉ టెక్నాలజీ, ఎలక్ట్రిక్ వాహనాలు వంటి వాటిల్లో దీనికి డిమాండ్ నిరంతరం పెరుగుతోంది.అజయ్ కేడియా చెప్పినట్లుగా.. ప్రస్తుతం గోల్డ్-సిల్వర్ నిష్పత్తి 91 దగ్గర ఉంది. దీని అర్థం ఏంటంటే.. బంగారంతో పోలిస్తే వెండి ఇంకా పెట్టుబడికి ఆకర్షణీయంగా ఉంది. చరిత్రలో ఈ నిష్పత్తి 90 కంటే ఎక్కువ ఉన్నప్పుడు, అది తగ్గినప్పుడు వెండి ధరలు వేగంగా పెరిగేవి. సిల్వర్ ఇన్‌స్టిట్యూట్ తాజా నివేదిక ప్రకారం.. వెండి సరఫరాలో కొరత, డిమాండ్ పెరుగుదల కారణంగా.. ఇది వరుసగా ఐదవ సంవత్సరం కూడా లోటులో ఉంది. ఈ లోటు ధరలను మరింత పెంచుతోంది.వెండిలో పెట్టుబడులను పెంచడంలో ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ పాత్ర చాలా కీలకమైనది. గతంలో ధనతేరస్ లేదా అక్షయ తృతీయ వంటి పండుగలకు మాత్రమే వెండిని కొనేవారు. కానీ ఇప్పుడు ప్రజలు దీనిని ఒక పెట్టుబడి ఎంపికగా చూస్తున్నారు. డిజిటల్ వెండి, ఈటీఎఫ్‌ల ద్వారా చిన్న ఇన్వెస్టర్లు కూడా ఇందులో పాల్గొంటున్నారు. మ్యూచువల్ ఫండ్స్ కూడా మల్టీ-అసెట్ ఫండ్స్‌లో వెండిని చేర్చడం ప్రారంభించాయి. దీనివల్ల దీని ప్రజాదరణ మరింత పెరిగిందికేడియా అంచనా ప్రకారం.. వెండి ధరలు ఈ సంవత్సరం చివరి నాటికి ముఖ్యంగా దీపావళి నాటికి రూ. 1.30 లక్షలకు చేరుకోవచ్చు. గత 60 రోజుల్లో వెండి 24శాతం రాబడిని ఇచ్చింది. ఇది ఇతర పెట్టుబడి ఎంపికల కంటే చాలా ఎక్కువ. పారిశ్రామిక డిమాండ్, సరఫరాలో కొరత, పెట్టుబడిదారుల ఆసక్తి పెరుగుదల కారణంగా వెండి ఈ జోరు కొనసాగించే అవకాశం ఉంది.బంగారంతో పోలిస్తే వెండిని రాబడి కోసం ఒక మంచి ఎంపికగా పరిగణిస్తున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. లాంగ్ టర్మ్ పెట్టుబడికి ఇది ఒక సువర్ణావకాశం. ఈ దీపావళికి మీరు పెట్టుబడి పెట్టాలని ఆలోచిస్తున్నట్లయితే వెండిపై ఒక కన్ను వేసి ఉంచండి. వెండి ధరలు తమ రికార్డులను బద్దలు కొట్టి, కొత్త రికార్డులను సృష్టించవచ్చు.

# అమ్మకానికి బీ కేటగిరి సీట్లు

హైదరాబాద్ : తెలంగాణలో ఇంటర్ పూర్తి చేసి ఇంజినీరింగ్ ప్రవేశాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులకు ఉన్నత విద్యామండలి గుడ్ న్యూస్ చెప్పింది. జులై మొదటి వారంలో ఎప్ సెట్/ఇంజినీరింగ్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు హైయర్ ఎడ్యుకేషన్ చైర్మన్ బాలకిష్టారెడ్డి తెలిపారు. ఏఐసీటీయూ సూచనల మేరకు ఆగస్టు 14 నుంచి ఇంజినీరింగ్ క్లాసులు ప్రారంభం కావాల్సి ఉన్నందున జులైలో కౌన్సిలింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తున్నట్లు ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి చెప్పారు. జేఈఈ కౌన్సిలింగ్ కాకుండా రాష్ట్రంలో ఎప్ సెట్ కౌన్సిలింగ్ ప్రారంభించలేమని తెలిపారు.ఇంజినీరింగ్ చదవాలనుకునే విద్యార్థుల కోసం కౌన్సిలింగ్ పై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఉన్నత విద్య మండలి చెప్పింది. టెలికాల్ సౌకర్యం ఎర్పాటు చేసి విద్యార్థుల అనుమానాలు నివృత్తి చేయనున్నట్లు చైర్మన వెల్లడించారు. అంతేకాకుండా రెండురోజుల పాటు మాక్ కౌన్సిలింగ్ కూడా నిర్వహించి ఎక్కడా విద్యార్థులకు వారి ర్యాంకుల ఆధారంగా సీటు దొరికే అవకాశం ఉందో అవగాహన కల్పిస్తామన్నారు.ఎప్ సెట్ రిజల్ట్స్ వచ్చినప్పటి నుంచే పలువురు విద్యార్థులు ఇంజినీరింగ్ సీట్ల కోసం ప్రైవేటు కాలేజీలకు క్యూ కట్టారు. బీ-కేటగిరి సీట్ల భర్తీ ప్రక్రియ కూడా ప్రారంభం కాలేదని.. ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ ఇచ్చే వరకు కూడా బీ-కేటగిరీ సీట్ల తీసుకొవద్దని పేరెంట్స్, స్టూడెంట్స్ కు హైయర్ ఎడ్యుకేషన్ సూచించింది. కానీ కొంతమంది సీట్లు దొరకవని లక్షలు పోసీ ముందే బుక్ చేసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చినా అథెంటిక్ ఇన్ఫర్మేషన్ కాకపోవడంతో చర్యలు తీసుకోలేని పరిస్థితి ఉందన్నారు. బీ-కేటగిరీ సీట్లపై ప్రభుత్వం నుంచి నిర్ణయం వెలువడాల్సి ఉందని చైర్మన్ బాలకిష్టా రెడ్డి చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఇన్ స్టిట్యూషన్స్ కు నోటీసులు; ఎలాంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా కొన్ని ఇన్ స్టిట్యూట్ లు అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు ఫిర్యాదులు అందాయని ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టా రెడ్డి తెలిపారు. ఫిర్యాదులు వచ్చిన నాలుగు విద్యాసంస్థలకు నోటీసులు జారీ చేసి జూన్ 13 నాటికి వివరణ ఇవ్వాలని కోరినట్లు ఆయన చెప్పారు. ఆ 4 ఇన్స్టిట్యూషన్స్ ల అనుమతులు, తరగతుల నిర్వహణ అర్హతపై వివరణ అడిగారు. డీమ్డ్ వర్సిటీలతో టైఅప్ అయ్యి ఇంజనీరింగ్ కోర్స్ లు అందిస్తామని విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదు అందాయని.. సరైన వివరణ ఇవ్వకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని చైర్మన్ హెచ్చరించారు.

## పాఠశాల పారిశుధ్య సహాయకులకు శిక్షణ తరగతులు

కోరుట్ల :పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో మండల స్థాయి ప్రాథమిక,ప్రాథమికోన్నత, ఉన్నత,మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్,ప్రధానోపాధ్యాయులకు, తోపాటు పాఠశాల పారిశుధ్య సహాయకులకు (స్కావెంజర్) శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి గంగుల నరేశం హాజరై మాట్లాడుతూ ప్రతి పాఠశాల పరిసరాలు,బాల ,బాలికల మూత్రశాలలు,తరగతి గదులు,చెట్లు పరిశుభ్రంగా ఉండాలని చెప్పారు.ఆనంతరం అల్లమయ్య గుట్ట ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్. అనిల్ మాట్లాడుతూ వర్ష కాలం దృష్ట వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, కాబట్టి నీటి నిల్వలు పాఠశాల ఆవరణలో ఉండకుండా చూడాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి మార్గం రాజేంద్రప్రసాద్,కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బి.ఆనందరావు,ఎ.శ్రీనివాస్,నల్ల భూమయ్య,సీ హెచ్.కృష్ణ మోహన్ రావు,ఆర్.పి శ్రావణ్ ,సిఆర్పీలు పి.గంగాధర్,జ్యోతి,ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## కొలిమిగుండ్ల మండల తహసిల్దార్ గా శ్రీనివాసులు

కొలిమిగుండ్ల: కొలిమిగుండ్ల మండల నూతన తహసిల్దార్ గా శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టారు. తహసిల్దార్ కార్యాలయానికి చేరుకున్న శ్రీనివాసులుకు రెవెన్యూ సిబ్బంది పూలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం నూతన తహసిల్దార్ శ్రీనివాసులును ఆర్ఐ వరలక్ష్మి, భాస్కర్ రెడ్డి, నాగరాజు, వీఆర్వోలు ప్రసాద్ రెడ్డి, మోహన్, రామసుబ్బయ్య, ప్రభాకర్ కలిసి బుధవారం నాడు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన తహసిల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉండి రైతులు ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు సిబ్బంది పాల్గొన్నారు.

## ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు : ఆస్పరిలో ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు రవి డిమాండ్ చేశారు వారి ఏర్పాటు చేసుకున్న ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఆస్పరిలో విజేత స్కూల్ నారాయణ ప్రైమ్ స్కూల్ నోబుల్ స్కూల్ విద్యోత స్కూల్ ముందస్తు అడ్మిషన్ చేస్తూ తల్లిదండ్రులు మాయమాటలు చెప్పి వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నారని అటువంటి పాఠశాలలపై వెంటనే ప్రభుత్వాధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.వారి పాఠశాలల యొక్క కరపత్రాలతో ప్రతి గ్రామంలో తిరుగుతూ ముందస్తు అడ్మిషన్ చేయడం సరి కాదన్నారు ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాలకు సిద్ధమవుతామని నాయకులు శ్రీకాంత్ నవీన్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య లభిస్తుంది

చౌటుప్పల్ : సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య లభిస్తున్నదని ఏసీపీ పి.మధుసూధన్‌రెడ్డి అన్నారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో బడుగు రామస్వామి, కమలమ్మ, పాలకూర్ల శివయ్యగౌడ్ స్మారక ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు జ్ఞాన దీప్తి పురస్కారాలను అందజేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలో ఉన్న సౌకర్యాలను అనుకూలంగా మలుచుకుని విద్యార్థులు ఎదుగాలన్నారు.చిన్నతనం నుంచే చదువులపై ఏకాగ్రత సాధించాలన్నారు. తద్వారా భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి చేరుకునే అవకాశం ఉంటుందన్నారు. ఇందుకోసం ప్రతిఒక్కరూ సమున్నత వ్యక్తిత్వం, సౌశీల్యంను పెంపొందించుకోవాలన్నారు. అంతేకాకుండా మొబైల్ ఫోన్ల వాడకం తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీరాములు, పాలకూర్ల మురళీ గౌడ్, దబ్బేటి శేఖర్, అక్షయ, పోలోజు రాజు, వెంకటాచారి పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇళ్లు కు భూమి పూజ కార్యక్రమాల్లో

## పాల్గొన్న జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల : మండలం పైడుమడుగు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కు భూమి పూజ కార్యక్రమాల్లో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు లబ్ధిదారుల ఆహ్వానం మేరకు గ్రామ ఇందిరమ్మ కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు . అనంతరం గ్రామంలో జరిగిన భూభారతి కార్యక్రమంలో పాల్గొని గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వం ధరణి ద్వారా రైతులను ఎలా మోసం చేసింది వివరించి టిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మోసాలకు అడ్డుకట్ట వేయడానికి ప్రజలందరికీ న్యాయం చేయడానికి కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.. అనంతరం గ్రామంలోని ప్రసిద్ధి చెందిన శుక్రవారం అమ్మవారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు..ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి కృష్ణ చైతన్యతో పాటు కోరుట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి ,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మరిపెల్లి జనార్ధన్, మాజీ ఎంపీటీసీ సభ్యులు ఆశిరెడ్డి, రాజేశం,నేమురి భూమయ్య ,దొమ్మటి నరేందర్ గౌడ్, నేమిళ్ల రామ్మోహన్, సత్తిరెడ్డి, దొమ్మటి తిరుపతి గౌడ్, దుంపల అశోక్, మేకల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు

## టీబీ పరీక్షల నిర్ధారణ శిబిరం

మెట్ పల్లి : టీబీ ముక్త్ భారత్ అభియాన్ 100 రోజుల కార్యాచరణ భాగంగా మెట్ పల్లి మండలం లోని ఆత్మకూర్ గ్రామంలోని నిర్వహించిన టీబీ పరీక్షల నిర్ధారణ శిబిరానికి జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ యన్. శ్రీనివాస్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం జగ్గసాగర్ వైద్యాధికారి డాక్టర్ అంజిత్ రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిబీ సూపర్వైజర్ ఆంజనేయులు మాట్లాడుతూ టిబీ అనుమానితులను ఇక్కడే పరీక్షించి, ఎక్సరే లు తీసి ఫలితాలు వెంటనే తెలుపుతామని చెప్పారు. 60 సంవత్సరములు పైబడిన వృద్ధులు పొగ తాగే వారు, ఆల్కహాల్ సేవించేవారు, పొగాకు తినేవారు ,డయాబెటిస్ ఉన్నవారు పూర్వం టీబీ మందులు వాడినవారు, వారి సన్నిహితులకు పరీక్షలు నిర్వహించి రోగనిర్ధారణ అయితే ఉచిత మందులతో పాటు పోషణ బత్యం ఇవ్వబడుతుందని ఆన్నారు..ఈ సందర్భంగా టీబీ అనుమానితుల68 శాంపిల్స్ సేకరించిటీబీ నాట్ పరీక్షల కోసం కోరుట్ల ఏరియా ఆసుపత్రికి పంపించారు. 100 రోజుల కార్యాచరణలో అన్ని సబ్ సెంటర్స్ కవర్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏంఎల్ హెపీ కృష్ణవేణి, సూపర్వైజర్ ప్రభావతి,ల్యాబ్ టెక్నీషియన్ సతీష్ కుమార్, ఆశా కార్యకర్తలు, టి. లావణ్య, పి. లక్ష్మి. హేమ, దేవమని. లావణ్య, పాల్గొన్నారు

## రైతుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

తుగ్గలి:తుగ్గలి మండల వ్యాప్తంగా అన్ని రైతు సేవ కేంద్రాల యందు సబ్సిడీ వేరుశనగ విత్తనాలను గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు అధికారులు సోమవారం రోజున రైతులకు పంపిణీ చేశారు. చెన్నంపల్లి రైతు సేవ కేంద్రం నందు రాష్ట్ర గిరిజన సలహామండలి సభ్యులు వెంకటపతి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బత్తిన వెంకటరాముడు, గ్రామ టిడిపి నాయకులు మా భాష రాజేంద్ర గౌడ్ లక్ష్మీనారాయణ లు వ్యవసాయ అధికారులతో కలిసి రైతులకు సబ్సిడీ వేరుశన విత్తనాలను పంపిణీ చేశారు. అదేవిధంగా రాంపల్లి గ్రామం నందు మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాలను పంపిణీ అదేవిధంగా పెండేకల్ గ్రామం నందు సర్పంచ్ లీలావతి,ఎంపీటీసీ పెద్ద రంగన్న, మాజీ సర్పంచ్ బర్మా వీరేష్ లు రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. అదేవిధంగా రామకొండ రైతు సేవ కేంద్రం నందు మాజీ సర్పంచ్ మసాలా శీను,డాక్టర్ చంద్ర,ఐటిడిపి నాయకులు నాగరాజు తదితరులు రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కొరకే కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని వారు తెలియజేశారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం తప్పకుండా నెరవేరుస్తుందని వారు తెలియజేశారు. రైతుల సంక్షేమం కొరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులు పండించే పంటలకు మద్దతు ధర కల్పించారని వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు,వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అక్షర వార్త



# జేఎన్టీయూ విద్యార్థులకు షాక్..




## ఆ కోర్సు ఎత్తివేస్తూ సంచలన నిర్ణయం!

హైదరాబాద్ : జేఎన్టీయూలో బీబీఏ చదవాలనుకుంటున్న విద్యార్థులకు వర్సిటీ షాక్ ఇచ్చింది. జేఎన్‌టీయూ వర్సిటీ కోర్సుల్లోంచి బీబీఏ కోర్సును రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. విద్యార్థులకు బోధించేందుకు లెక్చరర్లు లేని కారణంగా బ్యాచులర్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ (బీబీఏ) కోర్సును రద్దు చేస్తున్నట్టు వర్సిటీ యాజమాన్యం ప్రకటించింది. 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలను నిలిపివేస్తూ'దోస్త్' పోర్టల్ నుంచి బీబీఏ కోర్సును తీసివేయాలని ఉన్నత విద్యా మండలిని జేఎన్టీయూ కోరింది.దేశంలోనే మొట్టమొదటి టెక్నాలజీ యూనివర్సిటీగా పేరొందింది యూనివర్సిటీ హైదరాబాద్ జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ. అంతటి ప్రతిష్టాత్మక జేఎన్టీయూను సమస్యలు వీడటం లేదు. ముఖ్యంగా ప్రొఫెసర్ల కొరత ఈ వర్సిటీని పట్టిపీడిస్తోంది. మూడేళ్ల, క్రితం కొత్తగా ప్రవేశ పెట్టిన బ్యాచులర్ ఆఫ్ బిజినెస్ మేనేజ్ మెంట్ (బీబీఏ) కోర్సు బోధించేందుకు అధ్యాపకులు అందుబాటులో లేకపోవడంతో ఈ కోర్సును జేఎన్టీయూ రద్దు చేస్తున్నట్టు సంచలన నిర్ణయాన్ని ప్రకటించింది. 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలను నిలిపివేస్తూ 'దోస్త్' పోర్టల్ నుంచి బీబీఏ కోర్సును తొలగించాలని ఉన్నత విద్యా మండలిని కోరింది.మేనేజ్ మెంట్ కోర్సుల్లో భాగంగా మార్కెటింగ్, ఫైనాన్స్, మానవ వనరుల నిర్వహణ, ప్రొడక్షన్, ఆపరేషన్‌లో భాగంగా మూడేళ్ల క్రితం బీబీఏ కోర్సును జేఎన్టీయూ ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా ఒక్కో కోర్సులో 60 మందికి ప్రవేశం కల్పించారు. జేఎన్టీయూలో బీబీఏ కోర్సు పూర్తి చేస్తే క్యాంపస్ ఇంటర్వ్యూలతో పాటు ఎంబీఏ చదివేందుకు అవకాశాలు ఈజీగా లభించే అవకాశాలు ఉండడంతో ఈ కోర్సుకు భారీగా డిమాండ్ పెరిగింది. దీంతో భారీ సంఖ్యలో విద్యార్థులు ఈ కోర్సుల్లో చేరారు. అయితే, తాజాగా ఈ కోర్సు బోధించే లెక్చరర్లు రిటైర్ కావడంతో వర్సిటీలో స్టాఫ్ కొరత ఏర్పడినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో అఖిల భారత సాంకేతిక విద్యామండలి నిబంధనల మేరకు.. వర్సిటీలో బీబీఏ కోర్సును భోదించేందుకు రెగ్యులర్ లెక్చరర్లు లేకపోవడంతో కోర్సును రద్దు చేయాల్సి వచ్చిందని వర్సిటీ అధికారులు చెబుతున్నారు.అయితే యూనివర్సిటీ అధికారుల నిర్ణయంపై విద్యార్థులు, విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్టు తెలుస్తోంది. టీచింగ్ స్టాఫ్ రిక్రూర్‌మెంట్ పై సరైన అవగాహన లేకుండా కోర్సును ప్రవేశపెట్టమే కాకుండా.. ఇప్పుడు అంతే అనాలోచితంగా కోర్సును రద్దు చేస్తున్నారని మండిపడుతున్నారు. నార్త్, సౌత్ ఇండియాలో బీబీఏ కోర్సు ఫుల్ డిమాండ్ ఉందని.. అలాంటి కోర్సును తొలగించడమేంటని ప్రశ్నిస్తున్నారు. బీబీఏ కోర్సులను భోదించే లెక్చరర్లు రిక్రూట్ చేసుకోవాలని.. కోర్సును తొలగించకుండా కొనసాగించాలని విద్యార్థి సంఘ నాయకులు అంటున్నారు.

# ఆపరేషన్ దుర్గం చెరువు ఎప్పుడు?

హైదరాబాద్ : ఎన్ని రకాల విమర్శలు వచ్చినా.. ఎన్ని రకాల ఆరోపణలు వినిపించినా.. ఆక్రమణ తొలగింపు విషయంలో హైడ్రా ఏ మాత్రం వెనకడుగు వేయడం లేదు. పైగా మరింత దూకుడుగా వ్యవహరిస్తోంది.ఇటీవల హైదరాబాదులో హైడ్రా కు ఏకంగా పోలీస్ స్టేషన్ కూడా నిర్మించారు. దానిని తెలంగాణ ముఖ్యమంత్రి ప్రారంభించారు. హైడ్రాకు వాహనాలు కూడా సమకూర్చారు. అధికారులను కూడా నియమించారు. బడ్జెట్ కూడా కేటాయించారు. దీంతో హైడ్రా మరింత వేగంగా అడుగులు వేస్తోంది. అక్రమార్కుల గుండెల్లో నిద్రపోతోంది. ఆక్రమణలను ఎక్కడికక్కడ తొలగిస్తోంది. కోర్టు కేసులు ఎదురు కాకుండా.. న్యాయమూర్తులు ఎదుట తలవంచుకోకుండా.. అన్ని డాక్యుమెంట్స్ పరిశీలించి.. అని ఆధారాలను చూసుకొని ధైర్యంగా అడుగులు వేస్తోంది.. ఆక్రమణలను మొహమాటం లేకుండా తొలగిస్తోంది. ఇక ఇటీవలి కాలంలో హైడ్రా చేపట్టిన పనులు హైదరాబాద్ నగరవాసుల్లో హర్షాన్ని కలిగిస్తున్నాయి. ముఖ్యంగా బడా బాబుల ఆక్రమాలను హైడ్రా బయటపెట్టింది. ఆక్రమణలను తొలగించింది. జూబ్లీహిల్స్ నుంచి మొదలు పెడితే అమీన్పూర్ చెరువు వరకు హైడ్రా చేపట్టిన ప్రతి ఆపరేషన్ ప్రజల మనసులను చూరగొంటున్నది. ఏకంగా హైడ్రా బాస్ రంగనాథ్ సింగం అయిపోయారు. హైదరాబాద్ ప్రజల గుండెల్లో సూపర్ కాప్ గా వెలుగొందుతున్నారు.ఇక తాజాగా హైడ్రా అధిపతి రంగనాథ్ పర్యటించారు. ముఖ్యంగా హైదరాబాదులోని నాలాలలో వరద నీరు ప్రవహించే తీరును పరిశీలించారు.. ప్రధానంగా ఐటీ పరిశ్రమ నెలకొన్న మాదాపూర్ ప్రాంతంలో రంగనాథ్ పర్యటించడం సంచలనగా మారింది.. మాదాపూర్ లోని నెక్టార్ గార్డెన్స్ లో ఆన నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రంగనాథ్ అధికారులకు సూచించారు. ఇటీవల ఈ ప్రాంత ప్రజలు రంగనాథ్ ని కలిసి వర్షాకాలంలో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు.."వర్షం కురిస్తే చాలు నడుము లోతు నీళ్లు మా కాలనీలలో నిల్వ ఉంటున్నాయి. చాలా రోజులపాటు ఆ నీరు కిందికి వెళ్లడం లేదు. ఆ సమయంలో బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నాం. ఆ సమస్యకు మీరే పరిష్కార మార్గం చూపించాలని" ఆయా కాలనీలవాసులు రంగనాథ్ దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లారు.. దీంతో రంగనాథ్ మాదాపూర్ ప్రాంతానికి వెళ్లారు. ముఖ్యంగా దుర్గం చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. వచ్చేనీరు, వెళ్లే నీరు మొత్తాన్ని అధ్యయనం చేశారు.. వరద కాలువలను విస్తరించాలని.. వర్షాకాలంలో వరదను కొంచెం తగ్గిస్తే ముప్పు తగ్గించడానికి ఏమైనా అవకాశం ఉంటుందా అని అధికారులతో చర్చించారు. ఇక దుర్గం చెరువు కింది భాగంలో



ఉన్న ఆక్రమణలను తొలగించాలని ఒక నిర్ణయానికి వచ్చారు. అన్నింటికంటే ముఖ్యంగా వరద కాలువకు ఏర్పడుతున్న ఆటంకాలను ఆయన దగ్గరుండి పరిశీలించారు.. దుర్గం చెరువులో ఇన్ ఆర్బిట్ మాల్ వైపు మట్టి పోయడంపై ఆయన అధికారులతో చర్చించారు. మట్టి అలా ఎలా పోస్తారు అని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది.. ఈ మట్టి పోసిన వ్యక్తులు ఎవరు? అలా ఎందుకు చేశారు? దానివల్ల ఎదురవుతున్న సమస్యలు ఏమిటి? అనే ప్రశ్నలను సంబంధిత అధికారులకు రంగనాథ్ సంధించినట్టు తెలుస్తోంది.గతంలో అధికారంలో ఉన్న పార్టీ నాయకులు దుర్గం చెరువు ప్రాంతంలో అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడ్డారని స్థానికులు ఆరోపిస్తున్నారు. లోతట్టు ప్రాంతాలను ఫ్లాట్లుగా చేసి విక్రయించారని విమర్శిస్తున్నారు. ఇవే విషయాలను ఇటీవల కాలంలో రంగనాథ్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలుస్తోంది. అందువల్లే ఆయన దుర్గం చెరువు ప్రాంతాన్ని సందర్శించినట్టు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో కీలకంగా ఉన్న నాయకులకు దగ్గరగా ఉన్న వ్యక్తులు దుర్గం చెరువును ఆక్రమించారని.. ప్లాట్లు చేసి విక్రయించారని ఆ పరిసర ప్రాంతాల ప్రజలు పకడ్బందీ ఆధారాలతో రంగనాథ్ ను కలిశారని తెలుస్తోంది. అయితే ఆ వివరాలను సరిపోల్చుకోవడానికే రంగనాథ్ క్షేత్రస్థాయిలో పర్యటించారని.. త్వరలోనే చర్యలు తీసుకుంటారని తెలుస్తోంది. ఒకవేళ ఇదే గనుక జరిగితే దుర్గం చెరువు ఆక్రమణలు దాదాపుగా తొలగిపోతాయని స్థానికులు అంటున్నారు. అంతేకాదు వర్షాకాలంలో తమకు వరద సమస్య కూడా తగ్గిపోతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరి రంగనాథ్ దుర్గం చెరువు విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకుంటారనేది చూడాల్సి ఉంది.

# సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

**ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీసులకు తెలియచేయాలి : గోదావరిఖని ఏసిపి రమేష్**

**ప్రభుత్వ ఆసుపత్రి, సింగరేణి ఏరియా హాస్పిటల్ లలో భద్రత చర్యలపై తనిఖీ చేసిన ఏసిపి**



గోదావరిఖని: రామగుండం పోలీస్ కమిషనర్ గారి ఆదేశాల మేరకు గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోదావరిఖని ప్రభుత్వ హాస్పిటల్, సింగరేణి ఏరియా హాస్పిటల్ లో భద్రత చర్యలలో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు, పనితీరు, భద్రత సిబ్బంది పనితీరు మరియు హాస్పిటల్ ల లోని వార్డ్స్, పరిసరాలను గోదావరిఖని ఏ సి పి ఎం. రమేష్ గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి తో కలిసి సందర్శించి, పరిసరాలను పరిశీలించి భద్రతా చర్యలపై పలు సూచనలు సలహాలు ఇవ్వడం,భద్రత, ఇటీవల ఆసుపత్రి సిబ్బందిపై దాడి జరిగిన సంఘటనల గురించి రాష్ట్రంలోని వివిధ ప్రదేశాలలో ఆసుపత్రుల నుండి పిల్లల కిడ్నాప్ ల గురించి మొదలైన విషయాలపై చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా ఏసీపి హాస్పిటల్ అధికారులతో సూపరడెంట్స్ తో మాట్లాడుతూ... ప్రభుత్వ, సింగరేణి ఆసుపత్రికి వివిధ ఆరోగ్య సమస్యలతో ఇతర కారణాలతో చాలామంది వస్తుంటారు. అదేవిదంగా కొంతమంది అనుమానస్పదంగా హాస్పిటల్ ప్రాంతం లలో తిరుగుతుంటారు.గతంలో కొన్ని సందర్భాల్లో పిల్లలను అపహరించడం, చికిత్స జరుగుతున్న సమయంలో ఎవరైనా మరణించిన సందర్భాలలో బంధువులు కుటుంబ సభ్యులు దాడులకు పాల్పడే అవకాశం ఉంటుంది.ముందస్తు భద్రత, రక్షణ లో భాగంగా ఆస్పత్రి తప్పనిసరిగా సిసి ఎంట్రెన్స్ మరియు ఎగ్జిట్ మెయిన్ రోడ్లపై మరియు ఆస్పత్రి ఎంట్రెన్స్ వద్ద అదేవిదంగా ఎమర్జెన్సీ వార్డ్, చిల్డ్రన్ వార్డ్, మెటర్నటీ వార్డ్, క్యాజువల్ వార్డ్ లలో, వార్డ్స్ ఎంట్రెన్స్, ఎగ్జిట్ ప్రాంతాలలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.ప్రస్తుతం ఉన్న సీసీ కెమెరాలు పనితీరు ను ఎప్పటికప్పుడు చూడాలి. పని చేయని వాటిని మెయింటైన్స్ చెక్ చేసి పనిచేసే విధంగా చూడాలని సూచించారు.హాస్పిటల్ లు అని ప్రాంతాలు పూర్తి స్థాయిలో కవర్ అయ్యే విధంగా నిఘా నీడలో ఉండే విధంగా హై రెజల్యూషన్ కలిగిన కొత్త సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, వాటి పనితీరుపై పూర్తి స్థాయి పర్యవేక్షణ ఉండాలని సూచించారు.హాస్పటల్ సెక్యూరిటీ సిబ్బంది ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఎవరైనా అనుమానస్పదంగా కనిపించిన ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు హాస్పటల్ పరిసరాలలో జరిగిన వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో హాస్పిటల్ ల ఆర్ ఎం ఓ లు, సూపరిండెంట్స్, హాస్పిటల్ సిబ్బంది ఉన్నారు.

# రైతుల వ్యవసాయ సమస్యలు తీర్చడానికి రైతు మిత్ర-ఫార్మర్ ఫ్రెండ్ కార్యక్రమం

జగిత్యాల :రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలోనే మొదటిసారిగా జగిత్యాల జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు రైతు మిత్ర" ఫార్మర్ ఫ్రెండ్" అనే వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, రైతులతో కలిసి జిల్లా వ్యవసాయ అధికారి బాస్కర్ రైతు మిత్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మరియు వ్యవసాయ శాఖ అధికారులు, రైతులతో ప్రత్యక్షంగా సమావేశమై ఎలాంటి విత్తనాలు వాడాలి, పంటల్లో చీడపీడలు, ఎరువుల వాడకం, సస్యరక్షణ చర్యలు ఏవిదంగా చేపట్టాలి, రైతుల పంటల సాగు సమస్యలకు సమగ్ర పరిష్కారం రైతు మిత్ర ద్వారా అందిచనున్నారు. రాష్ట్రంలోనే మొదటి సారిగా జగిత్యాల జిల్లాలో జిల్లా అధికారులు రైతు మిత్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి సోమవారం ఉదయం 10:30 గం నుండి మధ్యాహ్నం .1:30 వరకు సహాయ వ్యాసాయ సంచాలకుల (అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ (ఏడీఏ) జగిత్యాల, ధర్మపురి మరియు మెట్ పల్లి కార్యాలయాలలో రైతు మిత్ర కార్యక్రమం కొనసాగుతుంది. ప్రతి సోమవారం 2-3 శాస్త్రవేత్తలు మరియు వ్యవసాయ శాఖాధికారులు రైతులతో ప్రత్యక్షంగా సమావేశమవుతారు. రైతుల సమస్యలకు అప్పటికప్పుడే సమాధానాలు ఇవ్వడంతో రైతుల సమస్యల పరిష్కారాన్ని పేపర్ పై రాసి ఇస్తున్నారు. రైతుల సమస్యల రికార్డు పుస్తకంలో నమోదు చేసి అవసరమైన చర్యలు చేపట్టనున్నారు.ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా వ్యవసాయ అధికారి బాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలో మొదటిసారిగా జగిత్యాల జిల్లాలోని 3 వ్యవసాయ సంచాలకుల కేంద్రాలు అయిన జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి లలో రైతు మిత్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10:30 గం నుండి మధ్యాహ్నం 1:30 వరకు రైతు మిత్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామని రైతులు తప్పకుండా ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. ముఖ్యంగా పంటల సాగులో వచ్చే సమస్యలు, రసాయనాల వినియోగం, విత్తనాల వాడకం, నీటి వనరుల వినియోగం, చీడ పీడలు వంటి అంశాలపై శాస్త్రవేత్తలు వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తారని చెప్పారు.

# క్యాన్సర్ తో బాధపడే నిరుపేదలకు జగ్గారెడ్డి అపన్న హస్తం

## - క్యాన్సర్ పేషంట్‌ను పరామర్శించిన జగ్గారెడ్డి

సంగారెడ్డి : క్యాన్సర్ తో బాధపడే నిరుపేదలకు పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గ రెడ్డి అపన్న హస్తం అందించారు. సంగారెడ్డి పట్టణం లో నీ సోమేశ్వర వాడ కు చెందిన రాణి కిబ్రెస్ట్ క్యాన్సర్ వచ్చింది. విష్యం తెలుసుకున్న జగ్గ రెడ్డి క్యాన్సర్ పేషంట్ ఇంటికి వెల్లలి పరామర్శించారు. వవ సందర్భంగా జగ్గ రెడ్డి మాట్లాడుతూ క్యాన్సర్ ట్రీట్ మెంట్ లక్షల రూపాయల తో కూడుకున్న వ్యవహారం కావడం తో పేద లు ఆర్థికం గా చితికిపోతున్నరు.తన నియోజకవర్గం లో క్యాన్సర్ తో బాధపడే నిరుపేద లకు ట్రీట్ మెంట్ కోసం ఆర్థిక సహకారం అందించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా క్యాన్సర్ పేషంట్ రాణమ్మ కు ట్రీట్ మెంట్ కోసం నాలుగు లక్షలు రూపాయల ఆర్థిక సహాయం జగ్గారెడ్డి అందించారు సంగారెడ్డి పట్టణం లో నీ సోమేశ్వర వాడ కు చెందిన రాణి కిబ్రెస్ట్ క్యాన్సర్ వచ్చింది ట్రీట్ మెంట్ కోసం ఆర్థిక సహాయం నాలుగు లక్షలు అందించాను స్పెసిఫిక్ గా మీడియా ముందుకు రావడానికి కారణం క్యాన్సర్ అనేది ఎవ్వరికీ రావొద్దు క్యాన్సర్ బాధితుల ది టెన్షన్ లతో కూడిన జీవితం క్యాన్సర్ ట్రీట్ మెంట్ లక్షల రూపాయల తో కూడుకున్న వ్యవహారం కావడం తో పేద లు ఆర్థికం గా చితికిపోతున్నరు లక్షల రూపాయల ఖర్చు చేసినా కొన్ని సందర్భాల్లో బతకడం లేదు... ఆ పేషంట్ ట్రీట్ మెంట్ కోసం అప్పులు చేసిన ఆ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు నా నియోజకవర్గానికి చెందిన ఆర్థిక స్థోమత లేని పేద క్యాన్సర్ పేషెంట్ల కు ఆర్థిక సహకారం అందించాలని నిర్ణయించుకున్నాను మొన్న సదాశివపేట లో క్యాన్సర్ పేషంట్ కు 10 లక్షల రూపాయలు, ఈరోజు సంగారెడ్డి పట్టణానికి చెందిన క్యాన్సర్ పేషంట్ కు 4 లక్షల రూపాయలు ఆర్థిక సహకారం అందించాను . నా వద్దకు ఆరోగ్య సమస్య ల ట్రీట్ మెంట్ కోసం సహాయం కావాలని ఎంతోమంది వస్తారు.

వారికి నా ద్వారా సహాయం అందుతుంది. కానీ ఎన్నడూ మీడియా లో రా దు. అది నాకిష్టం ఉండదు ఇలా మీడియా ముందుకు రావడానికి ప్రధాన కారణం రాష్ట్రం లో ఎంతో మంది దాతలు ఉన్నారు. క్యాన్సర్ పేషంట్ లకు వారి ద్వారా సహాయం దొరుకుతుందనే ఉద్దేశ్యం తో మీడియా ముఖంగా అందించడం జరిగింది.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

తిరుపతి : మన పూర్వీకులు అందించిన పురాతనమైన యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయం నుండి రామచంద్ర పుష్కరిణీ వరకు అవగాహన ర్యాలీ ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ భారతదేశం యొక్క పురాతనమైన యోగా ప్రతి ఒక్కరూ అలవరుచుకుని పాటిస్తే ఆరోగ్యంగా జీవిస్తారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నెలరోజుల పాటు ఈ యోగాపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ నెల 21 వ తేదీ ఐదు లక్షల మందితో విశాఖపట్నంలో నిర్వహిస్తున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొంటున్నట్లు ఆయన చెప్పారు. యోగాను జీవితంలో ఒక భాగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కమిషనర్ ఎన్.మౌర్య మాట్లాడుతూ యోగా చేయడం వలన శారీరకంగా, మానసికంగా ఆరోగ్యకర జీవనం గడపవచ్చునని అన్నారు. నగరంలోని ప్రతి వార్డులో ప్రజలకు యోగా పట్ల అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. కార్పొరేషన్ పరిధిలో యోగా పోటీలు కూడా నిర్వహించామని అన్నారు. యోగాలో అందరూ శిక్షణ పొంది ఆరోగ్యంగా జీవించాలని అన్నారు. ఇప్పటి వరకు నగరపాలక సంస్థ పరిధిలో 75 వేల మంది రిజిస్టర్ చేసుకున్నారని, ఈ సంఖ్య లక్షకు పైగా అవుతుందని అన్నారు. ఇప్పటివరకు నిర్వహించిన పోటీల్లో సుమారు 500 మంది పాల్గొన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, ఏపీ అర్బన్ డెవలప్మెంట్ ఫైనాన్స్ అండ్ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ డైరెక్టర్ వూక విజయకుమార్, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ, కార్పొరేటర్లు నరసింహ ఆచారి, అనిత, నారాయణ, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్, ఏసీపీ బాలాజి, మేనేజర్ హాసీమ్, తదితరులు ఉన్నారు.

# ప్రతిభకు పట్టం కట్టేలా షైనింగ్ స్టార్స్ అవార్డ్స్

## - జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్

తిరుపతి : ప్రతిభకు పట్టం కట్టేలా, విద్యార్థులను ప్రోత్సహించేలా షైనింగ్ స్టార్స్ అవార్డ్స్, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు ఇవ్వడం జరిగిందని రెవెన్యు రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖా మంత్రి మరియు జిల్లా ఇన్చార్జి మంత్రి వర్యులు అనగాని సత్య ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక మహతి ఆడిటోరియం నందు జిల్లా విద్యాశాఖ మరియు సమగ్ర శిక్ష ఆధర్వంలో 2024-25 సంవత్సరంలో నిర్వహించిన పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డుల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా.వెంకటేశ్వర్ ఎస్, చంద్రగిరి, తిరుపతి, సత్యవేడు ఎంఎల్ఏ లు పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, కోనేటి ఆదిమూలం, గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, హస్త కళా కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ , యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్ర కోటి సదాశివం, డిప్యూటీ మేయర్ ఆర్.సి. ముని కృష్ణలతో కలసి ముఖ్య అతిథిగా రెవెన్యు రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖా మంత్రి మరియు జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు. జిల్లా ఇన్చార్జి మంత్రి వర్యులు మాట్లాడుతూ.. ప్రతిభకు పట్టం కట్టేలా, విద్యార్థినీ విద్యార్థులను ప్రోత్సహించేలా విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అత్యధిక మార్కులు సాధించిన వారికి షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ ఇవ్వడం జరిగిందని జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్ తెలిపారు. పేదరికం వలన విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశ్యంతో విలువలతో కూడిన విద్య ను తీసుకువచ్చేలా విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రాన్ని నాలెడ్జ్ హబ్ గా మార్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విద్యా శాఖా మంత్రి కృషి చేస్తున్నారని తెలిపారు. కేజీ నుంచి పిజి వరకు విద్యా వ్యవస్థలో ప్రక్షాళన చేసే దిశగా ప్రణాలికా బద్దంగా కృషి చేస్తున్నారని అన్నారు. అలాగే ప్రభుత్వ బడులలో విద్యా శాతం పెంచే దిశగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. విద్యార్థులను ప్రోత్సహించే దిశగా షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ ఇవ్వడం జరుగుతోందని ప్రభుత్వం ఇచ్చే ఈ ప్రోత్సాహకాలను విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులను ప్రోత్సహించే దిశగా షైనింగ్ స్టార్ అవార్డ్ లు ఇచ్చే ఒక మంచి కార్యక్రమానికి ఈరోజు శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఇందులో భాగంగా నేడు 2024-25 విద్యాసంవత్సరంలో జిల్లాలో ఉత్తమ మార్కులు సాధించిన 207 మంది10 వ తరగతి, 40 మంది ఇంటర్ విద్యార్థినీ విద్యార్థుల కు షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ తో పాటు రూ.20 వేల నగదు, మెడల్స్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. బడుల్లో అత్యంత ప్రతిభ కనబరచిన పదవ తరగతి, ఇంటర్మీడియట్ లో మంచి మార్కులు సాధించిన పిల్లలందరికీ ఈరోజు మండలాల వారీగా విద్యా శాఖా వారి ఆద్వర్యం లో షైనింగ్ స్టార్స్ కార్యక్రమాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ బడులలో పిల్లలు చదువుకొని అక్కడున్నటువంటి సదుపాయాలను వాడుకొని మంచి మార్కులు సాధించి అవార్డులు తీసుకోవడం అందరికీ ఆదర్శంగా ఉంటుందని తెలిపారు. తద్వారా రాబోయే విద్యా సంవత్సరాలలో అందరు విద్యార్థులు కూడా వారిని ఆదర్శంగా తీసుకుని అభివృద్ధిలోకి రావాలని తెలిపారు. విద్యార్థులందరూ హార్డ్ వర్క్ నుండి స్మార్ట్ వర్క్ మీద దృష్టి పెట్టాలని అన్నారు. భోదనలో నేర్చుకోవడం నిరంతర ప్రక్రియ అని అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని , చదువు అనేది విద్యార్థులకు భారం కాకూడదని తెలిపారు. తల్లిదండ్రులు విద్యార్థులను ఎటువంటి ఒత్తిడికి గురి చేయకుండా ప్రశాంత వాతావరణంలో చదువుకునేలా ప్రోత్సహించాలని అన్నారు. విద్యార్థుల ఆశయం అనేది దీర్ఘకాలిక లక్ష్యంగా ఉండాలన్నారు. విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో తాము అనుకున్న ఆశయం వైపు అడుగులు వేయాలన్నారు. విద్యార్థులు టెక్నాలజీ అందిపుచ్చుకుని నైపున్యాభివృద్ధిగా దిశగా అడుగులు వేయాలన్నారు. సోషల్ మీడియా వలన చెడుతో పాటు మంచి కూడా ఉంటుందని అవసరానికి అనుగుణంగా సోషల్ మీడియాను మంచికి, విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు వాడుకోవాలని అన్నారు. ప్రస్తుతం సైబర్ నేరాలు ఎక్కువవుతున్న తరుణంలో సోషల్ మీడియా పట్ల జాగ్రత్తగా ఉండాలని అన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు నైపున్యాభివృద్ధిపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉద్యోగ అవకాశాలు రావడానికి సులభం అవుతుందని తెలిపారు. ఏకాగ్రతతో విద్యార్థులు 24 గంటలు చదవడం కంటే రెండు మూడు గంటలు కేటాయించినా తాము అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని తెలిపారు. విద్యార్థులకు చదువుతో పాటు ఆట పాటల పై కూడా దృష్టి పెట్టడం వలన ఏకాగ్రత పెరుగుతుందన్నారు. తిరుపతి, సత్యవేడు శాసనసభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులను ప్రోత్సహించే దిశగా షైనింగ్ అవార్డులను ఇవ్వడం శుభ పరిణామమని తెలిపారు. పేదరికం, అసమానతలు రూపు మాపాలంటే విద్య ద్వారానే సాధ్యమని ఆ దిశగా విద్యా శాఖా మంత్రి విప్లవాత్మక మార్పులు తీసుకుని వస్తున్నారని తెలిపారు. యాదవ కార్పోరేషన్ చైర్మన్ మాట్లాడుతూ.. ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో అనేక మౌలిక వసతులను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. పేద విద్యార్థులకు మంచి ఫలితాలు అందించాలనే లక్ష్యంతో అనేక కార్యక్రమాలను ప్రవేశ పెట్టిందని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపైన కూడా ఆశక్తి చూపించి మంచి భవిష్యత్తు అందిపుచ్చుకోవాలన్నారు. నాయి బ్రాహ్మణ కార్పోరేషన్ చైర్మన్ మాట్లాడుతూ.. పేద విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక విప్లవాత్మక కార్యక్రమాలను తీసుకుని వస్తున్నదని తెలిపారు. పేదరికం వలన చదువు దూరం కాకూడని ఉద్దేశ్యంతో విద్యార్థులకు అవార్డులను అందజేయడం జరిగిందని తెలిపారు.గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ మాట్లాడుతూ.. విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని విద్య లేని వాడు వింత పశువు అనే సామెతను ప్రతి ఒక్కరు గుర్తు పెట్టుకోవాలని అన్నారు. అక్ష రాస్యతను పెంచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుని వస్తుందని ఆదిశగా ఈ రోజు పిల్లలను ఇంకా ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో షైనింగ్ అవార్డులను విద్యార్థులకు అందజేయడం జరిగిందని తెలిపారు.

తల్లి తరువాత రెండవ స్థానం గురువుదని విద్యార్థి లోని ఆశయాలను వెలికి తీసేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమం అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు మాట్లాడుతూ... ప్రతిభ కనబరచిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అవార్డులు అందించడం చాలా సంతోషంగా ఉందని ఇంకా ఉన్నత స్థానాలకు ఎదిగేలా కృషి చేస్తామని తెలిపారు. అనంతరం 2024-25 విద్యాసంవత్సరంలో జిల్లాలో ఉత్తమ మార్కులు సాధించిన 207 మంది 10 వ తరగతి, 40 మంది ఇంటర్ విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ తో పాటు రూ.20 వేల నగదు మెడల్స్ ను ఇన్చార్జి మంత్రి కలెక్టర్, ఎంఎల్ఏ తదితరులతో కలిసి అందచేశారు ఈ కార్యక్రమంలో డి.ఈ.ఓ. కె.వి.ఎన్ కుమార్, సర్వ శిక్ష అభియాన్ సి.ఎం.ఓ. సురేష్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కడప, ప్రొద్దుటూరు ఎంఈఓ లను సస్పెండ్ చేయాలి

## - డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు కు యుటిఎఫ్ వినతి



బద్వేలు : సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ బదిలీలలో ప్రిఫరెన్షియల్ కేటగిరిలో కేటాయించవలసిన స్థానాల కంటే అధికంగా కేటాయించి, బదిలీల చట్టం-2025ను ఉల్లంఘించి ఇష్టారాజ్యంగా వ్యవహరించిన కడప, ప్రొద్దుటూరు మండల విద్యాశాఖాధికారులు గంగిరెడ్డి, సావిత్రమ్మలను సస్పెండ్ చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబులు డిమాండ్ చేశారు. కడపలోని స్కౌట్ హాలు నందు విద్యాశాఖ నిర్వహిస్తున్న బదిలీల్లో ఎంఈఓలు వ్యవహరించిన తీరు వల్ల ఉపాధ్యాయులకు జరిగిన తీవ్ర నష్టాన్ని వివరిస్తూ కలెక్టరేట్లో జిల్లా రెవిన్యూ అధికారి ఎం.విశ్వేశ్వర నాయుడు కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన బదిలీల చట్టం-2025 ప్రకారం ప్రిఫరెన్షియల్ కేటగిరికి ఒక పాఠశాలలో 40 శాతానికి మించి పోస్టులు కేటాయించకూడదనే స్పష్టమైన నిబంధనలు ఉన్నప్పటికీ కడప మరియు ప్రొద్దుటూరు మండల విద్యాశాఖ అధికారులు చట్టాన్ని బేఖాతాలు చేస్తూ ప్రిఫరెన్షియల్ కేటగిరీకి ఇష్టారాజ్యంగా పోస్టులు కేటాయించారన్నారు. మంగళవారం చేపట్టిన మాన్యువల్ కౌన్సిలింగ్ నందు కడప, ప్రొద్దుటూరు మండలాల పరిధిలో నిబంధనల కంటే ఎక్కువ పోస్టులను ప్రిఫరెన్షియల్ కేటగిరీలో చూపించి జనరల్ కేటగిరిలో ఉన్నవారికి తీవ్ర అన్యాయం చేశారన్నా రు. మండల విద్యాశాఖాధికారుల నిర్లక్ష్యం వల్ల దాదాపు పదిమంది జనరల్ కేటగిరి ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

దీంతోపాటు మధ్య రాత్రి 1:30 వరకు కౌన్సిలింగ్ ప్రక్రియ నిలిచిపోయి ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులతో పాటు ఒత్తిడికి గురయ్యారన్నారు. అధికారులు జరిగిన తప్పును గుర్తించి, కౌన్సిలింగ్ ను రద్దుచేసి తిరిగి కౌన్సిలింగ్ నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, తప్పును సరి చేయకుండా అర్థ రాత్రి తర్వాత బదిలీల ప్రక్రియను కొనసాగించడం వల్ల ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించి బదిలీల చట్టాన్ని ఉల్లంఘించిన కడప, ప్రొద్దుటూరు మండల విద్యాశాఖాధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు నష్టపోయిన ఉపాధ్యాయులకు తగు న్యాయం చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు జరిగిన నష్టాన్ని రాష్ట్ర పాఠశాల విద్య కమిషనర్ తోపాటు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుక వెళుతున్నట్లు వారు వివరించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయకపోతే యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఎస్.ఎజాస్ అహ్మద్ లు పాల్గొన్నారు.

# మంథని నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి మారు 'మూల' స్తంభం

## ఆరోగ్యంతో బాధపడుతున్న వారికి 'అభయహస్తం' - శ్రీధర్ అన్న బాటలో "శీనన్న"

మంథని : అన్నకు తోడు కాంగ్రెస్ పార్టీకి చేదోడు... అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో అన్నకు అండగా ఉంటూ తూర్పు మారుమూల మంథని నియోజకవర్గంలో నియోజకవర్గం లో తనదైన శైలిలో యువతతో కలిసి ముమ్మర ప్రచారంలో నిమగ్నమయ్యారు. అలాగే పార్లమెంట్ ఎన్నికల్లో తమ సొంత ఎన్నికల్లాగా నియోజకవర్గంలో కలియ తిరుగుతూ ముమ్మర ప్రచారం చేశారు అతడే శీను బాబు. ఆ ఫలితానికే ఆయనకు కాంగ్రెస్ అధిష్టానం గుర్తింపు ఇచ్చి కీలక పదవి అప్పగించింది. పదవి లేని సమయంలోనే ఎంతో చురుకుగా వ్యవహరించి మంథని నియోజకవర్గం లో శ్రీధర్ బాబుకు 33 వేల మెజార్టీ రాగా అలాగే పార్లమెంట్ ఎన్నికల్లో అప్పటి అభ్యర్థి వంశీకృష్ణకు మంథని నియోజకవర్గంలో 53 వేల మెజార్టీ వచ్చింది. దీంట్లో శ్రీధర్ బాబు తో పాటు శీను బాబు కీలక పాత్ర వహించారు. కాగా అనారోగ్యంతో ఎవరైనా బాధపడితే ఒక్క ఫోన్ కాల్ చాలు అతనికి చేస్తే అక్కడికి వాలిపోయి వారి బాగోగులు చూసుకొని వైద్యులకు అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్యం అందించేలా ఆయన డాక్టర్లకు సూచిస్తారు. ఆయనతోపాటు అతని వద్ద ఉండే చూడుకైనా కార్యకర్తలు సైతం నియోజకవర్గంలోని ప్రజల యోగక్షేమాలు తెలుసుకుంటారు. వారికి అన్ని విధాలా సహాయం సహకారాలు అందిస్తారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో తాను ఒక సైనికుడు. కార్యకర్తలా కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కష్టపడ్డారు. తన కుటుంబం గత 40 సంవత్సరాల నుంచి రాజకీయాలలో ఉంటూ తండ్రి దుద్దిళ్ల శ్రీపాదరావు ఉమ్మడి " ఆంధ్రప్రదేశ్ స్పీకర్ గా పనిచేసిన, ఆయన మరణ అనంతరం అన్న శ్రీధర్ బాబు గత 25 స సంవత్సరాలుగా రాష్ట్ర రాజకీయాల్లో ఉనిస్తూ ప్రభుత్వంలో ముఖ్య పాత్ర పోషిస్తూ రాష్ట్ర మంత్రి గా కొనసాగుతున్న... ఎ లాంటి గర్వం, అహంకారం. లేకుండా ఒక సామాన్య కార్యకర్తల, చిన్న, పెద్ద అనే తేడా లేకుండా అందరినీ కలుపుకొని పోతూ మ హిళలకు అన్నల, తమ్ముడిలా, ఒక కొడుకు లా... సామాన్యుడిలా కాంగ్రెస్ పార్టీ బలో పేతం కోసం పనిచేస్తూ.. మంథని నియోజక వర్గంలో అన్న శ్రీధర్ బాబు గెలుపులో లక్ష్మ ణునిలా.... భాగమై కష్టపడ్డ తమ్ముడే దుద్దిళ్ల శ్రీను బాబు... శ్రీను బాబు సేవలను స్వయంగా గుర్తించిన జాతీయ కాంగ్రెస్ పార్టీ అభిష్టానం తెలంగాలు కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించడం పట్ల అన్నకు తమ్ముడిగా శ్రీను బాబు కు గుర్తింపు అభించింది.

**పదవులు ముఖ్యం కాదు.. ప్రజాసేవలో మా కుటుంబం పనిచేస్తుంది: పీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు**

తమకు పదవులు ముఖ్యం కాదని, ప్రజా సేవలోనే తమ కుటుంబం పనిచేస్తుందని టీ. పీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు అన్నారు. తమకు పదవులు కొత్త కాదని, తమ కుటుం గత 40 సంవత్సరాలుగా ప్రజాసేవలోనే ఉందని, ఇక కూడా ఉంటుం దని, మంథని నియోజక వర్గ ప్రజల ఆర్వాణాలు తమ కుటుంబానికి శ్రీరామరక్ష అని శ్రీనుబాబు అన్నారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడే ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ అధిష్టానం గుర్తింపు ఇస్తుందని, పార్టీలో నిరంతరం కష్ట పడుతున్న వారికి రాబోయే రోజుల్లో మంచి భవిష్యత్తు ఉంటుందని శ్రీనుబాబు తెలి పారు.



మంథని నియోజకవర్గంలో కాకుం డా కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలో కూడా మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తుందని, అధిష్టానం నాపై పెట్టుకున్న సమ్మకం వమ్ము చేయకుండా తన వంతుగా కష్టపడతా సని శ్రీను బాబు తెలిపారు. తన నియమాగా నికి కృషి చేసిన కాంగ్రెస్ అధిష్టానానికి మం థని నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులకు కార్యకర్తలకు తన దైవం అయిన అన్న శ్రీధర్. బాబుకు శ్రీనుబాబు ధన్యవాదాలు తెలిపా రు. శ్రీనంబాబు నియామకంతో మంథనిని యోజకవర్గం లోనే కాకుండా జిల్లాలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబ రాలు తీసుకున్నారు.

కాదా మంథనితోపాటు రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు ఉన్న శీను బాబుకు పిసిసి ప్రధాన కార్యదర్శి రావడంతో మంథని నియోజకవర్గంలో కార్యకర్తలు నాయకులు గత రెండు రోజులుగా పెద్ద ఎత్తున బాణసంచాలు పేల్చి స్వీట్లు పంపిణీ చేయడం జరుగుతుంది. కార్యకర్తలు ఆనందాల మధ్య శీను బాబుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

# ఎర్రచందనం ముద్దాయిపై పీడీ యాక్ట్

## - ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్న టాస్క్ ఫోర్స్

తిరుపతి : ఎర్రచందనం అక్రమ రవాణాకు చెందిన పలు కేసుల్లో ముద్దాయిగా ఉన్న తమిళనాడుకు చెందిన అజిత్ బాబు ఎలియాస్ అజిత్ పై టాస్క్ ఫోర్స్ అధికారులు పీడీ యాక్ట్ అమలు చేశారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధించడమే కాకుండా, నమోదైన కేసులను నిరూపించే విధంగా దర్యాప్తు చేపడుతున్నారు. ఇందులొ భాగంగా గత ఐదేళ్లుగా 10కంటే ఎక్కువ కేసుల్లో ఎర్రచందనం అక్రమ రవాణా వృత్తిగా చేసుకుని, ముఠాగా ఏర్పడి స్మగ్లింగ్ కు పాల్పడుతున్న అజిత్ బాబు ఎలియాస్ అజిత్ (22)పై పీడీ యాక్ట్ అమలుకు టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు సిఫారసు చేశారు. ఈ మేరకు తిరుపతి జిల్లా కలెక్టరు, జిల్లా మెజిస్ట్రేట్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ , అతనిపై పీడీ యాక్ట్ అమలుకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ వ్యక్తి ఎర్రచందనం కొల్లగొట్టడుతూ, వన్య మృగాల చట్టాలను ఉల్లంఘించి నేరాలు చేస్తూ ప్రజాజీవనానికి అటంకం కలిగిస్తున్నట్లు గుర్తించారు. పీడీ యాక్ట్ అమలులో భాగంగా నిందితుడిని కడప సెంట్రల్ జైలుకు తరలించారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధకంలో భాగంగా పీడీ యాక్ట్ అమలు చేయడానికి వెనుకాడబోమని టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ.శ్రీనివాస్ హెచ్చరించారు. ఎర్రచందనం కేసుల్లో ఇప్పటికే అనేక మందికి శిక్షలు పడ్డాయని గుర్తు చేశారు. యువత ఎర్రచందనం అక్రమ రవాణాకు ప్రయత్నించి వారి భవిష్యత్తును పాడు చేసుకోవద్దని చెప్పారు. స్మగ్లర్లకు శిక్ష పడటంతో పాటు వారి ఆస్తులు కూడా జప్తు చేసుకో పడతాయని తెలియజేసారు.

# అక్షరాలు దిద్దించిన దానధర్మ చారిటబుల్ ట్రస్ట్

సిరివెళ్ల : మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో గల శ్రీ వీరభద్ర చెన్నకేశవ శివాలయంలో దానధర్మా చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం అత్యంత ఆధ్యాత్మిక వైభవంగా బుధవారం నాడు నిర్వహించారు.వేద పండితులు అర్చకులు గ్రామ పెద్దలు స్త్రీ శిశు సంక్షేమ శాఖ గ్రామీణ సిబ్బంది మహిళా పోలీసులు తదితరుల ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమానికి చిన్నారులు సుమారు 60 మంది హాజరయ్యారు.అభం శుభం తెలియని అక్షరాలు నేర్పించుకోవాలన్న సదుద్దేశంతో తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు తమ చిన్నారులను సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమానికి తీసుకొని వచ్చి ఆధ్యాత్మిక వైభవంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. హిందూ ధర్మంతగ్గి నైతిక విలువలు అంతరించిపోతూ ఆధ్యాత్మికతను మరిచిపోతున్న నేటి సమాజంలో దానధర్మా చారిటబుల్ ట్రస్ట్ వారు నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలను శిరివెళ్ల మండలం కోటపాడు గ్రామంలో దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ మండల ధర్మ ప్రచారక్ అన్నెం నాగమల్లేశ్వర రెడ్డి నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమానికి విశేష స్పందన లభించింది.తమ చిన్నారులు విద్యాబుద్ధులు నేర్చుకొని ప్రయోజకులు కావాలని దేశం గర్వించదగ్గ పౌరులుగా ఎదగాలని జీవితాంతం మంచి తెలివితేటలతో జ్ఞానోదయంతో ఉత్తమ పౌరులుగా వర్ధిల్లాలని అర్చకులు ప్రసాద శర్మ ఆశీర్వదించారు. సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో దానధర్మా చారిటబుల్ ట్రస్ట్ వారి సహకారంతో అన్నెం నాగమల్లేశ్వరరెడ్డి చిన్నారులకు పలకలు బలపాలు ఇతర విద్యా సామాగ్రి అందించి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన జరూపుతూనప్పటికీ దేశ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు అందించడం అభినందనీయమన్నారు. సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో చదువుల తల్లి సరస్వతీ దేవికి విశేష పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

# నిరంతర యజ్ఞంగా టిటిడి అన్నప్రసాద వితరణ

## - దాత రూ. 44 లక్షలతో రోజంతా అన్నప్రసాద వితరణ

## - రోజుకు 2.5 లక్షల మందికి అన్నప్రసాద వితరణ



తిరుమల : తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు టిటిడి నిరంతర యజ్ఞంగా అన్నప్రసాద వితరణ ఉచితంగా చేస్తోంది. 1985, ఏప్రిల్ 6న శ్రీవేంకటేశ్వర నిత్యాన్నదానం పథకాన్ని అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు చేతులమీదుగా టిటిడి ప్రారంభించింది. తదుపరి 1994, ఏప్రిల్ 1న శ్రీవేంకటేశ్వర నిత్యాన్నదానం ట్రస్టుగా, తర్వాత దీనిని శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుగా నామకరణం చేశారు. మొదటగా తిరుమలలో కల్యాణకట్ట ఎదురుగా గల పాత అన్నదానం కాంప్లెక్స్‌లో అన్నదానం జరిగేది. ఇప్పటి వరకు శ్రీ వైంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్ కు దాతలు దాదాపు రూ. 2,190 కోట్ల విరాళాలను అందించారు. ఎందరో దాతలు ఇచ్చిన నిధులతో నిర్విరామంగా అన్నప్రసాద వితరణ సాగుతోంది. వ్యక్తిగతంగా దాతల పుట్టిన రోజు, దాతల కుటుంబ సభ్యుల పేర్లతో, దాతల ట్రస్ట్ లు, కంపెనీల పేరుతో రూ.44 లక్షలు అందించవచ్చు. శ్రీవారి పుట్టిన రోజు అయిన శ్రవణా నక్షత్రం, శ్రీ పద్మావతీ అమ్మవారి పుట్టిన రోజు అయిన ఉత్తరషాడ నక్షత్రం, పంచమితీర్థం, వైకుంఠ ఏకాదశి, శ్రీవారి, శ్రీపద్మావతీ అమ్మవారి ప్రత్యేక రోజులలో కూడా దాతలు విరాళంగా అందించవచ్చు. రూ. 44 లక్షలు అందించి దాతలు స్వయంగా భక్తులు ప్రత్యేకంగా అన్నప్రసాదాలు వడ్డించే అవకాశాన్ని టిటిడి కల్పించింది. విరాళం అందించే దాతల పేరును తిరుమల వెంగమాంబ అన్నప్రసాద భవనంలోని డిస్ ప్లే బోర్డులో ప్రదర్శిస్తారు. అదేవిధంగా ఒకరోజు అన్నప్రసాదాలను వడ్డిస్తారు. ఒక రోజు పూర్తిగా అన్నప్రసాద వితరణ రూ.44 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. అదేవిధంగా ఉదయం అల్పాహారం కోసం రూ.10 లక్షలు, మధ్యాహ్నం భోజనం కోసం రూ.17 లక్షలు, రాత్రి భోజనం కోసం రూ.17 లక్షలు అందించి దాతలు స్వయంగా భక్తులకు అన్నప్రసాదాలు అందిస్తారు. తిరుమల, తిరుపతి, ఒంటిమిట్టలోని టిటిడి అన్నప్రసాదాలు వితరణ కేంద్రాల నుండి రోజుకు ఉదయం, మధ్యాహ్నం, రాత్రికి సుమారు 2.5 లక్షల మంది భక్తులు అన్నప్రసాదాలను స్వీకరిస్తున్నారు. దాతలు రూ.44 లక్షలు అన్నప్రసాద వితరణకు విరాళం అందిస్తే, ఆ రోజంతా తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం కాంప్లెక్స్, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ -1లోని 20, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ - 2లోని 31 కంపార్ట్‌మెంట్లు, నారాయణగిరిలోని 9 కంపార్ట్ మెంట్లు, ఏటీసీ, ఎంబీసీ, టిబీసీ, పీఏసీ - 2, పీఏసీ - 4 కేంద్రాలు, శిలాతోరణం, కృష్ణతేజ వరకు బయటి క్యూలైన్లు, తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణునివాసం కాంప్లెక్సులు, శ్రీగోవిందరాజ స్వామి ఆలయ అన్నప్రసాదరణ వితరణ కేంద్రం, రుయా ఆస్పత్రి, స్విమ్స్, మెటర్నిటి ఆస్పత్రి, బర్డ్, ఎస్వీ ఆయుర్వేద ఆస్పత్రి, తిరుచానూరులోని అన్నప్రసాద భవనం, ఒంటిమిట్టలో భక్తులకు ఉచితంగా అన్నప్రసాద వితరణ చేస్తారు.ప్రతి రోజూ టిటిడిలో అన్నప్రసాదాల తయారీ, పంపిణీకి సుమారు పలువురు ఉద్యోగులు, సిబ్బంది పనిచేస్తున్నారు. అన్నప్రసాదాలు విభాగంలో పలువురు శ్రీవారి సేవకులు సేవలు అందిస్తున్నారు. తద్వారా భక్తులు నుండి టిటిడి అన్నప్రసాదం విభాగం విశేష ఆదరణ పొందుతోంది.

# రాష్ట్రంలో ఏ పంటకు గిట్టుబాటు ధర లేదు

## పొదిలిలో పొగాకు బోర్డును సందర్శించిన మాజీ ముఖ్యమంత్రి జగన్

ఒంగోలు : రాష్ట్రంలో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నా పట్టించుకునే స్థితిలో కూటమి ప్రభుత్వం లేదని, చంద్రబాబు సీఎం కావడం రైతుల పాలిట శాపమని వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పొదిలి పొగాకు బోర్డును సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఇవాళ రైతులు నానా అవస్థలు పడుతున్నారు. రైతులను పట్టించుకునే పరిస్థితిలో ఈ ప్రభుత్వం లేదు. రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడింది. ప్రకాశం జిల్లాలో (పరుచూరు, కొండెపి) ఇటీవలే ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. రాష్ట్రంలో ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు. మద్దతు ధర కంటే తక్కువవకు అమ్ముకోవాల్సిన పరిస్థితి వుందని అన్నారు. రాష్ట్రంలోని రైతాంగ సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తున్నామని, ఏ రైతు చూసినా తక్కువ ధరలకు తమ పంటలను అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని జగన్ అన్నారు. వరి, మిర్చి, పొగాకు పంటలు చూసినా గిట్టుబాటు ధర లేదన్నారు.మా హయాంలో రైతు రాజ్యం నడిచింది. కానీ, కూటమి ప్రభుత్వంలో రైతు నష్టపోతున్నాడు. మా హయాంలో ఖరీఫ్ సీజన్లోనే పెట్టుబడి సాయం అందించాం. చంద్రబాబు వచ్చాక రైతు భరోసా సాయం లేదు. కేంద్రం ఇచ్చే రూ.6 వేలు కాకుండా మరో రూ.20 వేలు ఇస్తామని చంద్రబాబు అన్నారు. గతేడాది రైతు భరోసా రూ.20 ఎగ్గొట్టారు. మోదీ ఇచ్చారు. చంద్రబాబు ఎగ్గొట్టారని అన్నారు.

# పొదిలిలో మాజీ సీఎం వైఎస్ జగన్‌కు మహిళల నుంచి నిరసన సెగ

ఒంగోలు : వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రకాశం జిల్లా పొదిలి పర్యటనకు వెళ్లారు. పొగాకు వేలం కేంద్రం వద్ద రైతులను పరామర్శించి వారితో మాట్లాడేందుకు అక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జగన్‌కు నిరసన సెగ తగిలింది. సాక్షి టీవీలో అమరావతి మహిళలను కించపరుస్తూ డిబేట్ నిర్వహించడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పొదిలిలో అడుగడుగునా నల్ల బెలూన్లు, ఫ్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. మహిళలకు జగన్ బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు

# ట్రాఫిక్ ఎస్ఐ వెంకటేశ్వరరావు ను అభినందించిన కృష్ణా జిల్లా ఎస్పీ

మచిలీపట్నం: ఎస్పీ కార్యాలయంలో కృష్ణా జిల్లా క్రైమ్ మీటింగ్ సందర్భంగా, జిల్లా ఎస్పీ ఆర్. గంగాధర రావు విధుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులకు నగదు రివార్డులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా, ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడి చలానాలు విధించబడి ఎప్పటి నుండో మరుగునపడి ఉన్న 1927 చలానాలను వసూలు చేయడం ద్వారా సుమారు రూ. 32 లక్షల నగదు ప్రభుత్వ ఖజానాకు జమ చేశారు. విధి నిర్వహణలో ట్రాఫిక్ ఎస్ఐ వెంకటేశ్వరరావు ప్రతిభకు గుర్తింపుగా నగదు రీవార్డు ను ఎస్పీ ఆర్ గంగాధర్ రావు చేతుల మీదగా అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బందరు ట్రాఫిక్ పోలీసులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# తిరుపతి సహాయసంచాలకులుగా వేలాయుధం

తిరుపతి : తిరుపతి సహాయసంచాలకులుగావేలాయుధం పదవి బాధ్యతలు స్వీకరించారు. తిరుపతిలోని స్థానిక కలెక్టరేట్లో ఉన్న సమాచార పౌర సంబంధాల కార్యాలయంలో సహాయ సంచాలకులుగా బాధ్యతలు స్వీకరించారు. గతంలో తిరుపతి, రాజంపేట, అనంతపురం ప్రాంతాలలో సమాచార పౌర సంబంధాల కార్యాలయాలలో డివిజనల్ పిఆర్ఓగా విధులు నిర్వహించారు. అనంతరం అనంతపురం, సమాచార పౌర సంబంధాల కార్యాలయంలో డిఐపిఆర్వో పదవులు నిర్వహించారు. శ్రీ సత్యసాయి జిల్లాలో ఏడీ గా పదవులు నిర్వహిస్తూ,ఇటీవల ప్రభుత్వ బదిలి ఉత్తర్వులు మేరకు సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్ల ఉత్తర్వులు మేరకు ఈరోజు, తిరుపతి, సహాయ సంచాలకులుగా పదవి బాధ్యతలు చేపట్టారు.

# స్కూల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే ఆరణి, కమిషనర్ మౌర్య

తిరుపతి : ఒకటవ డివిజన్ పరిధిలోని పద్మావతినగర్ లో నిర్మించిన ఎంపిపి స్కూల్‌ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ నారపురెడ్డి మౌర్య ప్రారంభించారు. స్కూల్ ఆవరణను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఎన్డీఏ కూటమి వచ్చిన వెంటనే స్కూల్ పనులు ప్రారంభించి ఏడాది లోపే ప్రారంభించుకోవడం విద్యకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. విద్యారంగాన్ని అభివృద్ధిపరిచి నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ లు కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర పథకం కింద ఐదవ తరగతి నుంచి పదవ తరగతి వరకు విద్యాసామాగ్రిని విద్యార్థులకు ఉచితంగా ప్రభుత్వం అందిస్తున్నదని ఆయన తెలిపారు. పేదరికం చదవుకు అడ్డు రాకూడదని తల్లికి వందనం పథకాన్ని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రశేపెట్టిందని ఆయన చెప్పారు. ఈ పథకం నిధులను నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతలకు గురువారం స్కూల్స్ ప్రారంభం సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం జమ చేస్తుందని ఆయన తెలిపారు. అలాగే విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకాన్ని అమలు చేస్తూ డ్రాప్ అవుట్స్ ను పూర్తిగా నియంత్రించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. కాగా కమిషనర్ ఎన్.మౌర్య మాట్లాడుతూ తిమ్మినాయుడుపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డు వేయడంతో స్కూల్ భవనం తొలగించారని అన్నారు. అందుకు ప్రత్యామ్నాయంగా చింతలచేను వద్ద స్కూల్ నిర్మించాలని అన్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా మండల పరిషత్ స్కూల్ భవన నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేసి ప్రారంభించామని అన్నారు. ఒకటి నుండి ఐదవ తరగతి వరకు 60 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. వీరందరి ఒక్కో క్లాస్ కు ప్రత్యేకంగా ఒక్కో గది ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ, కార్పొరేటర్ అన్నా అనిత, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, డి.ఈ.రమణ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

### వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారానికి

# సీజీఆర్ఎఫ్ లోకల్ కోర్టులు

## - నిజామాబాద్ చైర్ పర్సన్ ఎరుకల నారాయణ

మెట్ పల్లి : అపరిష్కృతంగా మిగిలిపోయిన విద్యుత్ సంబంధిత సమస్యలు తక్షణమే పరిష్కరించడానికి లోకల్ కోర్టులు నిర్వహిస్తున్నామని, అందుకు విద్యుత్ అధికారులు,సిబ్బంది మెరుగైన సేవలు అందించాలని సీజీఆర్ఎఫ్-2, నిజామాబాద్ చైర్ పర్సన్ ఎరుకల నారాయణ పిలుపునిచ్చారు. బుధవారం మెట్ పల్లి లో విద్యుత్ వినియోగదారుల సమస్యలకు సంబంధించి ఏర్పాటు చేసిన పరిష్కార వేదిక-లోకల్ కోర్టు ఫోరమ్ చైర్ పర్సన్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అధికారులు వినియోగారుల సమస్యను లోతుగా పరిశీలించి వెనువెంటనే పరిష్కరించి న్యాయం చేయాలని, ఉపేక్షిస్తే, అలసత్వం ప్రదర్శించిన ఉద్యోగులపై కఠినమైన చర్యలుంటాయన్నారు. వినియోగదారుల పట్ల జవాబుదారీ తనంతో ఉండాలని, అన్ని విధ్యుత్ కార్యాలయాల ముందర పౌర సేవా పత్రం అతికించాలని, ఇంజనీర్లు, సిబ్బంది చరవాణి నంబర్లను గోడలపై రాయించాలని ఆదేశించారు. రైతులు, వినియోగారులు విద్యుత్ ఆదా కొరకు తమ వ్యవసాయ పంపుసెట్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని, ప్రమాదాలపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లోకల్ కోర్టు లో ఒక్క ఫిర్యాదు కూడా నమోదు కాలేదని, భవిష్యత్తులో సిజిఆర్ఎఫ్ లోకల్ కోర్టు ల గురించి వినియోగదారుల్లో విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిజిఆర్ఎఫ్ మెంబర్ టెక్నికల్ రామకృష్ణ, మెంబర్ ఫైనాన్స్ కిషన్, జగిత్యాల ఎస్ఈ షాలియా నాయక్, మెటుపల్లి డిఈ గంగారాం, ఏడీఈ లు మనోహర్, రఘుపతి, ఏఈలు రవి, ప్రదీప్, శివకుమార్, శ్రీనివాస్, అజయ్, మెటుపల్లి సబ్ డివిజన్ లోని మూడు సెక్షన్ల వినియోగదారులు, రైతులు హాజరైనారు.

# రైతులకు మేలు చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## సాంకేతికత జోడిస్తే వ్యవసాయ పనులు సులభం- హోం మంత్రి అనిత

యస్ రాయవరం : అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గంలో హోం మంత్రి వంగలపూడి అనిత పర్యటించారు. యస్ రాయవరం మండలం గెడ్డపాలెం గ్రామంలో జరిగిన ఏరువాక కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి, భూమి పూజ చేసి సంప్రదాయంగా కాడెడ్లతో నాగలి పట్టి పొలం దున్నారు. ఈ సందర్భంగా మంత్రి అనిత రైతులకు రాయితీపై విత్తనాలను పంపిణీ చేశారు. వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహిస్తూ 80 శాతం రాయితీపై డ్రోన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆమె, రైతులకు ఆధునిక సాంకేతికత ఆధారంగా పరికరాలు అందించడమే లక్ష్యమన్నారు. డ్రోన్ల సాయంతో ప్రస్తుతం రైతులు వ్యవసాయ పనులను సులభతరం చేసుకుంటున్నారని చెప్పారు. రైతుల సంక్షేమానికి ఎన్డీయే ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. రైతు దేశానికి వెన్నెముకలాంటివారని అభిప్రాయపడ్డారు. పాడిపంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బస్సు దగ్ధం..ప్రయాణికులు క్షేమం

అనకాపల్లి : అనకాపల్లి మండలం బగులవాడు వద్ద బస్సు దగ్ధం అయింది. కార్మికులతో వెళ్తున్న లారస్ పరిశ్రమకు చెందిన బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. షార్ట్ సర్క్యూట్ తో బస్సు దగ్ధం అయింది. కార్మికులు భయంతో బస్సు దిగి పరుగులు పెట్టి ప్రాణాలు దక్కించుకున్నారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక శాఖ శకటంతో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేసారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# సూపర్ సిక్స్ లో మరో ముఖ్యమైన హామీకి సిఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్

అమరావతి : సూపర్ సిక్స్ లో మరో ముఖ్యమైన హామీ తల్లికి వందనం కి సిఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న సందర్భంగా తల్లులకు కానుక గా తల్లికి వందనం ప్రారంభం కానుంది. తల్లికి వందనం నిధులు విడుదలకు కూటమి ప్రభుత్వ నిర్ణయం తీసుకుంది. 67 లక్షల మందికి తల్లికి వందనం పథకం నిధులు ఖాతాల్లో జమ చేయనుంది. ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ తల్లికి వందనం ఇస్తామన్న మేనిఫెస్టో హామీ మేరకు పథకం అమలుకు నిర్ణయం తీసుకునర్నారు. 67,27,164 మంది విద్యార్థులకు పథకం వర్తిస్తుంది. తల్లికి వందనం పథకం కింద రేపు తల్లుల ఖాతాల్లో రూ. 8745 కోట్లు జమ చేయనున్నరారు. 1వ తరగతిలో అడ్మిషన్ పొందే పిల్లలు, ఇంటర్ ఫస్ట్ ఇయర్ లో చేరే విద్యార్థులకు కూడా తల్లికి వందనం అమలు చేస్తారు. అడ్మిషన్లు పూర్తయ్యి డేటా అందుబాటులోకి రాగానే ఆ విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నిధులు జమ అవుతాయి. విధి విధానాలను ఖరారు చేస్తూ బుధవారం దు జీ.వో విడుదల అయింది.

# బాల్య వివాహాలు చేయకూడదు

## - గ్రామ సర్పంచ్ మొగతాల్ అరుణ్ కుమార్

దేవనకొండ : మండలం పరిధిలోని తెర్నేకల్ గ్రామం లో కిషోర వికాసం ప్రోగ్రాం నిర్వహించారు. ఆస్పరి ప్రాజెక్టు తెర్నేకల్ సెక్టార్ తెర్నేకల్ గ్రామం లో అంగన్వాడీ సెంటర్ నందు గ్రామ సర్పంచ్ శ్రీ మొగతాల్ అరుణ్ కుమార్ గారి ఆధ్వర్యంలో లో కిషోర వికాసం గూర్చి అంటే బాల్య వివాహాలు చేయకుండా, 18 సంవత్సరాలు నిండిన తరువాత నే పెళ్లిళ్లు చేసుకోవాలి అని, ఒకే ఇంట్లో ఉన్న కొడుకు కూతురు పట్ల లింగ వివక్షత చూపకూడదు అని, బాలల హక్కులు బాలల చట్టాలు గురించి పిల్లల తల్లిదండ్రులు కు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో అంగన్వాడీ టీచర్లు,హెల్పర్స్ పాల్గున్నారు.

## పిల్లల పరిపూర్ణ మానసిక వికాసానికి

# అంగన్వాడీలో చేర్పించండి

## - జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ : పిల్లల పరిపూర్ణ మానసిక వికాసానికి, శారీరక ఎదుగుదలకు అంగన్వాడీలో చేర్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బుధవారం నుండి అంగన్వాడీ కేంద్రాలు పున: ప్రారంభమైన నేపథ్యంలో నగరంలోని కార్ఖానా గడ్డ అంగన్వాడి కేంద్రంలో ప్రారంభ వేడుకలుపండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. కొత్తగా అంగన్వాడిలో చేరిన పిల్లల తల్లిదండ్రులను కేంద్రాలకు ఆహ్వానించారు. చిన్నారుల సందడిలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ 3 నుండి ఆరేండ్ల లోపు పిల్లందరినీ అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని అన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ కు ధీటుగా అంగన్వాడీ కేంద్రాల్లో ఆట పాటలతో కూడిన విద్య అందిస్తారని తెలిపారు. నూతన సిలబస్ తో సమగ్ర శిక్షణ పొందిన టీచర్లు బోధిస్తున్నారని అన్నారు. ప్రతి రోజూ పోషకాలతో కూడిన ఆహారం అందించడంతో పాటు పిల్లల వయస్సుకు తగిన ఎత్తు, బరువుతో ఉండేలా చూస్తారని, ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహిస్తారని తెలిపారు. ఈ నెల 17 వరకు అమ్మ మాట అంగన్వాడీ బాట కార్యక్రమం ద్వారా అంగన్వాడీ కేంద్రాల్లో ఎక్కువ మంది చేరేలా చూడాలని ఐసిడిఎస్ సిబ్బందికి సూచించారు. అంగన్వాడీ పునః ప్రారంభం సందర్భంగా పిల్లలకు కోడిగుడ్డు బిర్యానీ సిద్ధం చేయగా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ చేతుల మీదుగా పిల్లలకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, సీడీపీఓ సబిత పాల్గొన్నారు.

# శెట్టిబలిజలను బీసీల్లో చేర్చాలి

హైదరాబాద్ : పదేళ్లుగా రిజర్వేషన్లు, ప్రభుత్వ ఉద్యోగలలో రాయితీ లు కోల్పోయి ఇబ్బందులు పడుతున్న శెట్టిబలిజ కులస్తులకు మద్దతు ఇస్తున్నామని అన్నారు శేరిలింగంపల్లి శాసనసభ్యుడు, పి ఎస్ సి చైర్మన్ ఆరేకపూడి గాంధీ. శెట్టిబలిజ కులాన్ని బీసీల్లో చేర్చాలని శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ తులసి వనం దగ్గర నుంచి బీసీ కమిషన్ కు విన్నవించుకోవడానికి ర్యాలీగా వెళుతున్న శెట్టి బలిజ కులస్తులకు ఆయన, కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, రావుల శేషగిరిరావు తో కలిసి ర్యాలీలో పాల్గొని మద్దతునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ 27 కులాలను బీసీ జాబితా నుంచి తొలగించిన సమయం నుంచి అప్పటి ముఖ్యమంత్రికి వినతి పత్రం ఇచ్చినప్పటికీ బీసీ జాబితాలో చేర్చలేదని ఇప్పుటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు బీసీ కమిషన్ వినతిపత్రం తీసుకొని బీసీ జాబితాలో చేర్చుకునే అవకాశం ఉందన్నారు. నియోజకవర్గంలో ఉన్న ప్రజల తరఫున మేము వారికి అండగా ఉండి న్యాయం చేస్తామన్నారు.

# ఏడాదిలో ఐదు వందల రోబోటిక్ సర్జరీలు

హైదరాబాద్ : మెడికవర్ హాస్పిటల్ లో ఒక సంవత్సర కాలంలో ఐదు వందల రోబోటిక్ సర్జరీ లు విజయవంతంగా పూర్తి చేసినట్లు మెడికవర్ డాక్టర్ల బృందం తెలిపింది.. హైదరాబాద్ మాదాపూర్ లోని మెడికవర్ హాస్పిటల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో డాక్టర్స్ మాట్లాడుతూ మెడికవర్ హాస్పిటల్ లో అన్ని విభాగల డాక్టర్ లు తక్కువ సమయం లో ఐదు వందల రోబోటిక్ సర్జరీ లు చేయడం అరుదైన ఘనత అన్నారు.. మెడికవర్ మేనేజ్ మెంట్ సహకారంతోనే ఇది సాధ్యమైందని తెలిపారు.. కష్టమైన, క్లిష్టమైన సర్జరీ లు అన్ని రోబోటిక్ తో సులభంగా చేస్తునమని, దీని వలన పెషేంట్ లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందాన్నారు.. తక్కువ ఖర్చు అవడం, పెషేంట్ లకు పెయిన్ తక్కువగా ఉండడం, సమయం సేవ్ అవుతుండడం వలన పెషేంట్ లు అందరు రోబోటిక్ సర్జరీ ల పట్ల ఆసక్తి చూపుతు న్నారని పేర్కొన్నారు.. రోబోటిక్ సర్జరీల వలన పెషేంట్‌లు త్వరగా కోలుకొని, త్వరగా ఇంటికి వెళ్లి అన్ని పనులు చేసుకోవచ్చని తెలిపారు.. రోబోటిక్ సర్జరీ ల వలన డాక్టర్ల కీ కూడా సమయం ఆదా అవుతుందని, ఇంతకుముందు గంటల తరబడి చేసే సర్జరీ లకు ఇప్పుడు తక్కువ సమయం లోనే సర్జరీ లు పూర్తి చేస్తున్నామన్నారు.

# హైడ్రా చేతుల్లోకి గ్రేటర్..

## మాన్ సూన్ పనులు అప్పగింత

హైదరాబాద్ : జీహెచ్ ఎంసీ నుంచి మరిన్ని అధికారాలు హైడ్రా అధీనంలోకి వెళ్లాయి. లేటెస్ట్‌గా మాన్‌సూన్ ఎమర్జెన్సీ పనులను జీహెచ్ ఎంసీ నుంచి బదిలీ చేసి హైడ్రా పరిధిలోకి తెస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచి వానాకాల విపత్తు నిర్వహణ పనులను కూడా చేపడుతోంది హైడ్రా. ఇటీవల జీహెచ్ ఎంసీ రూ. 11 కోట్లతో మాన్‌సూన్ ఎమర్జెన్సీ, ఇన్‌స్టంట్ రిపేర్స్ టీమ్ టెండర్లలో గోల్‌మాల్ వ్యవహారం పెద్ద దుమారం లేపింది. ఈ ఇష్యూపై ఎమ్మెల్సీ కవిత లేఖ రాయడంతో ఈ అంశంపై ఫోకస్ పెట్టింది ప్రభుత్వం. టెండర్ల అవకతవలకు ఇష్యూకు చెక్ పెట్టేలా నుంచి బదిలీ చేస్తూ హైడ్రాకు మాన్‌సూన్ ఎమర్జెన్సీ పనులను అప్పగించింది రేవంత్ సర్కార్. వర్షాకాలంలో గ్రేటర్ డిస్కం, జీహెచ్ ఎంసీ , పోలీస్, జలమండలి, హైడ్రా శాఖలు అత్యంత కీలకం. అయితే ఇప్పటికే వర్షాలు పడుతుండటంతో మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ సరిగా లేక లోతట్టు ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి. వాస్తవానికి ప్రతి ఏటా మే చివరి వారం నాటికల్లా మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ అమలుకు పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలి. ఏరియాల వారీగా 140 బృందాలు, ప్రత్యేక వాహనాలు, స్టాటిక్ లేబర్స్, మినీ మొబైల్ మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్‌లను ఏర్పాటు చేసి వరద నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం ఇప్పటికే టెండర్లు పిలవాల్సిన అధికారులు ఆలస్యం చేశారు. లేటెస్ట్‌గా మాన్‌సూన్ బాధ్యతలను హైడ్రాకు అప్పగించడం, టెండర్ ద్వారా ఈ పనులు చేపట్టడంతో, తక్కువ సమయంలో ఇతర శాఖల సమన్వయం ఎంతవరకు సాధ్యమవుతు ందో హైడ్రాకు సవాల్‌గా మారిందన్న చర్చ జరుగుతున్నది. జీహెచ్ ఎంసీ లోని ఒక కార్పొరేటర్ వార్డ్ పరిధిలో ఉండే వర్షాకాలం ఎమర్జెన్సీ టీమును వర్క్ ఇన్స్పెక్టర్ నుంచి మొదలు పెడితే జోనల్ కమిషనర్ వరకు ఆరుగురు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తుంటారు. క్షేత్రస్థాయిలో ఉండే వర్క్ ఇన్స్పెక్టర్, ఏఈ, డీఈ, ఈఈ వంటి అధికారులందరూ డిప్యూటీ కమిషనర్, జోనల్ కమిషనర్ పర్యవేక్షణలో పనిచేస్తారు. ఇప్పుడు హైడ్రాకు ఇంతస్థాయిలో వార్డు, సర్కిల్, జోనల్ వారీగా సిబ్బంది లేరు. అక్రమ నిర్మాణాలు, చెరువులు, నాళాల కబ్జాల ఫిర్యాదులను పరిశీలించి వాటిపై చర్యలు తీసుకోవడానికే హైడ్రాకు ఉన్న సిబ్బంది సరిపోవటం లేదు. దీంతో మాన్‌సూన్ టీమ్‌ల నిర్వహణ కోసం బాధ్యత హైడ్రాదే అయినా..వాళ్లు కూడా జీహెచ్ ఎంసీ సపోర్ట్ తీసుకోవాల్సిందే. అయితే హైడ్రా ఆర్డర్స్‌ను జీహెచ్ ఎంసీ సిబ్బంది సరిగ్గా అమలు చేస్తే ఇబ్బంది ఉండదు. కోఆర్డినేషన్ మిస్ అయితే జనాలకు ఇబ్బందులు తప్పవు. మాన్ సూన్ సిబ్బంది హైడ్రా కమిషనర్ చెప్పినట్టు వినాలంటూ ఆదేశాలు వస్తే బల్దియాకు హైడ్రా కమిషనర్ షాడో బాస్‌గా వ్యవహరించే పరిస్థితిలు కనిపిస్తున్నాయి. ఇదే జరిగితే స్వతంత్రంగా వ్యవహరించాల్సిన నెమ్మదిగా హైడ్రా చేతుల్లోకి వెళ్తుందా అన్నా డౌట్స్ వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికే జీహెచ్ ఎంసీ పరిధిలో ఉన్న ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ డీఆర్ ఎఫ్ హైడ్రా చేతుల్లోకి వెళ్లిపో యింది. సిబ్బంది అయితే ఇప్పటికీ జీహెచ్ ఎంసీ నుంచి జీతాలు తీసుకుంటూ హైడ్రాలో పనిచేస్తున్నారు. హైదరాబాద్‌లో వర్షం దంచికొడితే కాలనీలు, బస్తీలు నీటిలో మునిగిపోతున్నాయి. గంటల తరబడి వరద రోడ్లపై పారుతుంది. ఇలాంటి సందర్భాల్లో హైడ్రా, జీహెచ్ ఎంసీ ఏ విధంగా కోఆర్డినేట్ చేసుకుంటా యనేది ప్రశ్నార్థకంగా మారింది. ఎమర్జెన్సీ పరిస్థితుల్లో హైడ్రా కమిషనర్ నేరుగాజీహెచ్ ఎంసీ అధికారులందరికీ బాస్‌గా వ్యవహరిస్తే తప్ప పనుల్లో వేగం పెరగదు. జీహెచ్ ఎంసీ కమిషనర్, జోనల్ కమిషన్, డిప్యూటీ కమిషన్ ఉండగా అదేలా సాధ్య పడుతుందనేదే డిస్కషన్ పాయింట్. ప్రభుత్వం ఆదేశిస్తే బల్దియాకు హైడ్రా కమిషనర్ ఇంకో బాస్‌గా ఉండటం పక్కా. మాన్సూన్ ఎమర్జెన్సీ వాహనాల టెండర్ ప్రక్రియలోజీహెచ్ ఎంసీ అధికారుల కక్కుర్తే హైడ్రా సూపర్ పవర్ గా మారేందుకు కారణమైందనే టాక్ నడుస్తోంది .అయితే బల్దియాకు చెందిన ఒక్కొక్క అంశాన్ని హైడ్రాకు కట్టబెడుతూ..ఓఆర్ఆర్ వరకు ఉన్న లోకల్ బాడీలన్నీ హైడ్రా సూపర్ పవర్ కిందకు తీసుకెళ్తుందా అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

# మస్క్ కు పుతిన్ పిలుపు

మాస్కో : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మధ్య సంబంధాలు గత కొంతకాలంగా ఒడిదొడుకులకు లోనవుతున్నాయి. మే నెలలో రిపబ్లికన్ పార్టీ ప్రవేశపెట్టిన ట్యాక్స్ బిల్లును మస్క్ వ్యతిరేకించడం ఈ వివాదానికి ప్రధాన కారణంగా మారింది. ఇరువురూ ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకున్నారు. ట్రంప్ సన్నిహితుడు, గతంలో శ్వేతసౌధం సలహాదారుడిగా పనిచేసిన స్టీవ్ బెనాన్, మస్క్‌ను 'అక్రమ వలసదారు'గా అభివర్ణించి, అతన్ని దేశం నుంచి బహిష్కరించాలని, అలాగే స్పేస్‌ఎక్స్ సంస్థను సీజ్ చేయాలని అమెరికా ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఘటనలు మస్క్‌పై రాజకీయ ఒత్తిడిని మరింత పెంచాయి. ఈ వివాదం నడుస్తున్న తరుణంలో రష్యా నుంచి మస్క్‌కు ఊహించని ఆఫర్ వచ్చింది. రష్యాకు చెందిన స్టేట్ డూమా ఫెడరేషన్ కమిటీ ఛైర్మన్ దిమిత్రి నోవికోవ్, మస్క్‌కు రాజకీయ శరణార్థిగా ఆశ్రయం కల్పించేందుకు రష్యా సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఎడ్వర్డ్ స్నోడెన్‌కు రష్యా ఆశ్రయం కల్పించిన విధంగానే మస్క్‌కు కూడా అవకాశం ఇవ్వవచ్చని ఆయన సూచించారు. అయితే, మస్క్‌కు రాజకీయ శరణార్థిగా ఉండాల్సిన అవసరం లేదని, అతను తనదైన రాజకీయ వ్యూహంతో ముందుకెళ్తున్నాడని నోవికోవ్ అభిప్రాయపడ్డారు. ఈ ప్రతిపాదన మస్క్ రాజకీయ భవిష్యత్తుపై అంతర్జాతీయ చర్చను రేకెత్తించింది. ట్రంప్‌తో విభేదాల నేపథ్యంలో మస్క్ కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు గురించి ఆలోచిస్తున్నట్లు సూచనలు ఇచ్చారు. ఎక్స్ ప్లాట్‌ఫామ్‌లో తన ఫాలోవర్లను ఉద్దేశించి, 80 శాతం అమెరికన్లకు ప్రాతినిధ్యం వహించే కొత్త రాజకీయ పార్టీ స్థాపనకు ఇది సరైన సమయమా అని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలు అమెరికా రాజకీయ వ్యవస్థలో మస్క్ ప్రభావాన్ని మరింత పెంచే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అదే సమయంలో, డెమోక్రట్లు తిరిగి అధికారంలోకి రావడాన్ని మస్క్ కోరుకోవడం లేదని దిమిత్రి నోవికోవ్ అభిప్రాయపడ్డారు, ఇది మస్క్ రాజకీయ ధోరణిని సూచిస్తుంది.

ట్రంప్ మస్క్ వివాదంపై రష్యా క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ జోక్యం చేసుకోవడానికి నిరాకరించారు. ఈ సమస్యను అమెరికా అంతర్గత వ్యవహారంగా పేర్కొంటూ, దీనిని ట్రంప్ స్వయంగా పరిష్కరించుకుంటారని ఆయన అభిప్రాయపడ్డారు. రష్యా ఈ విషయంలో తటస్థ వైఖరిని కొనసాగిస్తున్నప్పటికీ, మస్క్‌కు రాజకీయ ఆశ్రయం కల్పించే ప్రతిపాదన అంతర్జాతీయ రాజకీయాల్లో ఆసక్తికరమైన చర్చకు దారితీసింది. ఎలాన్ మస్క్‌కు రష్యా రాజకీయ ఆశ్రయం ప్రతిపాదించడం ఒక వైపు ఆశ్చర్యకరమైన పరిణామం కాగా, మరోవైపు ట్రంప్‌తో అతని విభేదాల కారణంగా ఆశ్రయం కల్పించడం రాజకీయ ఒత్తిడి వల్లనే జరిగినట్లు తెలుస్తోంది.

# బీజేపీలో ఉండి బీసీలను మోసం చేయాలని చూస్తున్న ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్ : బీజేపీలో ఉండి ఆర్ కృష్ణయ్య బీసీలను మోసం చేయాలని చూస్తు న్నారని మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ విమర్శించారు. గాంధి భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ 42 శాతం బిసి రిజర్వేషన్ కు సంబంధించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెచ్చిన జిఓ ను కోర్టు కొట్టేస్తే ఆర్ కృష్ణయ్య బిల్లును అమిత్ షా తో మాట్లాడి 9వ షెడ్యూల్ లో పెట్టించగలడా? అని సవాల్ విసిరారు. 40ఏండ్ల నుండి బిసిల రిజర్వేషన్ కోసం పోరాడి ఎందుకు రిజర్వేషన్ సాధించలేదు ప్రశ్నించిన మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్లోకల్ బాడీ ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ కల్పించాలి అని ఆర్ కృష్ణయ్య అంటుండురిజర్వేషన్ మీద ప్రత్యేక ఉా విడుదల చేయాలని అంటుండులేదంటే గాంధీ భవన్ ను ముట్టడి చేస్తాం ధర్నా చేస్తాం అంటుండుఉనీ ను కోర్టు కొట్టేస్తే ఆర్ కృష్ణయ్య బిల్లును 9బిష్ట్ర షెడ్యూల్ లో పెట్టించగలడా?జవాబు చెప్పాలని డిమాండ్ చేసారు. దామాషా ప్రకారం బిసి లకు హక్కులను కల్పించాలని రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చిందురాహుల్ గాంధీ ఒత్తిడి వలనే కేంద్రంలో బీజేపీ కులగణన చేస్తున్నదని ఆర్ కృష్ణయ్య ఒప్పుకోవాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని బిల్లు పెట్టి గవర్నర్ ఆమోదం పొంది రాష్ట్రపతికి పంపిన మన్నారు. ఆర్ కృష్ణయ్య కు చిత్త శుద్ధి ఉంటే బీజేపీ ఎంపీ గా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి బిల్లును 9బిష్ట్ర షెడ్యూల్ లో పెట్టించాలిలేదంటే కాంగ్రెస్ పై విమర్శలు మానుకోవాలి1992 లో ఇంద్ర సహని వర్సెస్ కేంద్ర ప్రభుత్వం కేసులో 50శాతం దాటకుడదని కాప్ విధించారు2006 లో నాగరాజు కేసులో ప్రమోషన్స్ కు కూడా 50శాతం మించకూడదని చెప్పారుఎన్టిఆర్ హాయంలో 32శాతం రిజర్వేషన్ ఉందిసీఎం రేవంత్ రెడ్డి కులగణన చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తుండు అనీ గ్రహించాలన్నారు.

# రాజీవ్ వికాసం.. మరింత ఆలస్యం

మెదక్ : నిరుద్యోగ యువతకు వివిధ రంగాల్లో పెట్టుబడిసాయం అందించే దిశగా ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. వ్యవసాయ రంగంతో పాటు చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుతో యువత ఆర్థిక పురోగతి పొందేలా కార్యాచరణ చేసింది. అర్హులైన యువ కుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. అనంతరం రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో లబ్ధిదారులకు సాయం అందించాల్సి ఉ ండగా పలు ఆరోపణల నేపథ్యంలో కార్యక్రమం వాయిదా పడింది. జిల్లాలోని మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లోని ఆయా మండలాలు, మున్సిపాలిటీల పరిధిలో మొత్తంగా సుమారు 65వేల వరకు దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. మెదక్ జిల్లాలో 20వేలకు పైగా, సంగారెడ్డి జిల్లాలో 25వేల వరకు, సిద్దిపేట జిల్లాలో మరో 20వేల వరకు దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. రాజీవ్ యువ వికాసంలో భాగంగా ఎస్టీ, ఎస్సీ బీసీ, మైనార్టీ సామాజిక వర్గాల నుంచి దరఖాస్తులు ఆహ్వానించగా ఆయా సామాజిక వర్గాల నుంచి దరఖాస్తులు పోటెత్తాయి. ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం యూనిట్ల పంపిణీని వాయిదా వేయడంతో ఆయా కేటగిరీలకు దరఖాస్తులు చేసు కున్న లబ్ధిదారులు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. మొదటగా ప్రభుత్వం దరఖాస్తుదారులకు మండల పరిషత్ కార్యాలయాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించి, అర్హులైన వారికి యూనిట్ విలువ ప్రకారం అయిదు విడతల్లో అక్టోబర్ వరకు మంజూరు పత్రాలు ఇవ్వాలని సర్కారు నిర్ణయించింది. దీనిలో భాగంగా మొదటి విడతలో కేటగిరీ–1లో రూ. 50 వేలు, కేటగిరీ–2 లో రూ. 1లక్ష వరకు ఎంపికైన లబ్ధిదారులకు జూన్ 9 వరకు మంజూరు పత్రాలు పంపిణీ చేసి 15 లోపు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. అలాగే నెలాఖరులోపు రాయితీ విడుదల చేసి గ్రౌండింగ్ పూర్తి చేయాలని తొలుత భావించారు. కానీ ఈ పంపిణీ ప్రక్రియ వాయిదా పడటంతో లబ్ధిదారులు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. అయితే ఈ నెల 5న జరిగిన మంత్రివర్గ సమావేశంలో సైతం స్పష్టమైన సంకేతాలు ప్రభుత్వం ఇవ్వలేక పోయింది. ఈ విషయంపై సంబంధిత అధికారులను అడగగా ప్రభుత్వం నుంచి తదుపరి వచ్చే మార్గదర్శకాల మేరకు నడుచుకుంటామని చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 1, 2 కేటగిరీల్లో వేలాది మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో అర్హులైన వారిని గుర్తించి రాష్ట్ర ఆవిర్భావం రోజున లాంఛనంగా కార్యక్రమాన్ని ప్రారంభించాలని అధికారులు భావించారు. కానీ పెద్ద సంఖ్యలో దరఖాస్తులు రావడం, అర్హుల ఎంపికలో పొరపాట్లు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో పూర్తిస్థాయిలో పరిశీలన తర్వాతే లబ్ధిదారుల జాబితాను ప్రకటించాలన్న డిమాండ్లు వ్యక్తమయ్యాయి. మరింత లోతుగా విచారణ చేసి నిజమైన లబ్ధిదారులకు మాత్రమే సాయం అందించాలన్న వినతులతో జూన్ 2న ప్రారంభం కావాల్సిన కార్యక్రమం వాయిదా పడింది. తిరిగి ఈ ప్రక్రియ ఎప్పుడు ప్రారంభమవుతుందో అనే విషయంపై స్పష్టత లేకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.




# దందా చేస్తూ దొరికిన ఎమ్మెల్యే

వరంగల్ : నేటి కాలంలో ఏ విషయమైనా సరే వెంటనే బయటికి వస్తోంది. ముఖ్యంగా ప్రజాప్రతినిధులకు సంబంధించిన ప్రతి విషయం క్షణంలోనే బయటికి తెలుస్తోంది.. అలాంటి విషయమే ఇది కూడా. కాకపోతే ఇప్పుడు అధికారానికి దూరంగా ఉన్న భారత రాష్ట్ర సమితి అనుకూలంగా పనిచేసే సోషల్ మీడియా హ్యాండిల్ లో ఈ వీడియో కనిపిస్తోంది.. ఇంతకీ ఆ వీడియోలో ఉన్న వ్యక్తి ఎవరు? ఆయన చేసిన వ్యవహారం ఏంటి?అధికారానికి దూరం కావడం.. పార్లమెంటు ఎన్నికల్లో సున్నాకు పరిమితం కావడంతో భారత రాష్ట్ర సమితి.. మళ్లీ తెలంగాణలో అధికారం కోసం ప్రయత్నాలు చేస్తోంది. అన్నింటికంటే ముఖ్యంగా సోషల్ మీడియాలో మరింత బలోపేతం అవ్వడానికి విపరీతంగా కృషి చేస్తోంది. ఇందులో భాగంగానే ట్విట్టర్లో రకరకాల హ్యాండిల్స్ ను ఏర్పాటు చేసుకుంది. అధికార కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన చిన్న లోపాన్ని సైతం భూతద్దంలో పెట్టి చూపిస్తోంది. అంతేకాదు 10 సంవత్సరాల కెసిఆర్ పరిపాలన కాలంలో తెలంగాణ ఇలా ఉండేదా అంటూ సెంటిమెంట్ రగిలించే ప్రయత్నం చేస్తోంది. ఇక ఇదే సమయంలో అధికార కాంగ్రెస్ పార్టీ కూడా గట్టిగానే బదులిస్తోంది. మొత్తంగా అటు కాంగ్రెస్.. ఇటు బీఆర్ఎస్ మధ్య యుద్ధం జోరుగానే సాగుతోంది..ఇక తాజాగా భారత రాష్ట్ర సమితికి అనుకూలంగా పనిచేసే ఒక సోషల్ మీడియా హ్యాండిల్ లో కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన ఒక ఎమ్మెల్యే వీడియో పోస్ట్ అయింది.. ఆ వీడియోలో ఏం ప్రస్తావించారంటే..” కెమెరాకు చిక్కిన కాంగ్రెస్ ఎమ్మెల్యేల వసూళ్ల దందా.. లిక్కర్ సిండికేట్ నిర్వాహకుల నుంచి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ మామూళ్ల వసూలు.. వైన్స్ యజమానులతో ఎమ్మెల్యే డబ్బులు డిమాండ్ చేస్తున్న మందుల సామెల్. ఎన్నికల్లో కోట్లు ఖర్చుపెట్టాను. రికవరీ కావాల్సిందే. మళ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తానో? లేదో? తెలియదు. రోజుకు లక్ష ఖర్చు వస్తుంది. డీజిల్ కు కూడా డబ్బులు లేవు. ప్రభుత్వం ఇచ్చే జీతం కొసరు అవుతలేదు. మీరు ఇచ్చే మామూలు నాకు టీ ఖర్చులకు కూడా సరిపోవు. నా మాట వినని వాని సంగతి చూస్తా” అంటూ సామెల్ ఆ వీడియోలో వ్యాఖ్యానించారని ఆ ట్విట్టర్ హ్యాండిల్ లో ప్రస్తావించారు..ఇక ఈ వీడియో పోస్ట్ చేసిన తర్వాత గులాబీ పార్టీ అనుకూల నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులకు వ్యతిరేకంగా కామెంట్స్ చేస్తుండగా? కాంగ్రెస్ పార్టీ నాయకులు వ్యతిరేకంగా కామెంట్స్ చేస్తున్నారు..” మీరు అధికారంలో ఉన్నప్పుడు మాత్రం ఇలా చేయలేదా.. అడ్డగోలుగా దోచుకోలేదా.. అసలు ఇలాంటి వ్యవహారాలు మొదలైందే మీతోనే కదా.. మీ పరిపాలన కాలంలో వైన్ షాప్ నిర్వాహకులతో అడ్డగోలుగా వ్యవహరించలేదా.. ఇష్టానుసారంగా దండుకోలేదా.. లంచాలు వసూలు చేసి నరకం చూపించలేదా.. ఇవాళ మీరేదో శుద్ధ పూసలు అయినట్టు చెబుతున్నారు అంటూ” కాంగ్రెస్ నాయకులు కౌంటర్ ఇస్తున్నారు.

ఈ వీడియో సోషల్ మీడియాలో పెను దుమారాన్ని రేపుతోంది. కాంగ్రెస్ నాయకులు అడ్డగోలుగా అవినీతి చేస్తున్నారంటూ సోషల్ మీడియా నెటిజన్లు మండిపడుతున్నారు. మరికొందరైతే ఇలాంటి వాళ్లకు అధికారం ఇచ్చి తెలంగాణ ప్రజలు తప్పు చేశారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. అయితే ఎన్నికల్లో పెట్టిన ఖర్చు రికవరీ చేసుకోకపోతే ఎలా అంటూ ఇంకొందరు పేర్కొంటున్నారు.. అయితే దీనిపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎలాంటి చర్యలు తీసుకుంటుంది? తుంగతుర్తి ఎమ్మెల్యే ఎలాంటి సమాధానం చెబుతారు? అనే ప్రశ్నలకు సమాధానం లభించాల్సి ఉంది.

# అన్ని వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

## - ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల : అన్ని వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు.. జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్ గ్రామంలో రూపాయలు 6 లక్షల నిధులతో నిర్మించిన గౌడ యువజన సంక్షేమ సంఘం నూతన భవనాన్ని జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ప్రారంభించారు.....ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. గౌడన్న లకు రక్షణగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీ చేపట్టారని,గౌడన్న గాయపడితే వారి కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతుందని రాష్ట్ర ప్రభుత్వం కిట్ల ను పంపిణీ చేస్తుందని అన్నారు. రక్షణగా ప్రతి గీత కార్మికుడు కిట్లను తప్పనిసరిగా వాడుకోవాలన్నారు. చల్గల్ వ్యవసాయ మార్కెట్ లో 2 కోట్ల తో సీసీ రోడ్,ధాన్యం ఆరబోతకు ఫ్లోర్ పనులు పూర్తయ్యాయిని,18 కోట్ల తో జగిత్యాల తిప్పన్న పెట్ బ్లాక్ స్పాట్ రోడ్డు మంజూరు అయిందని,జగిత్యాల జిల్లా లో జగిత్యాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఆన్నారు. ప్రతి గ్రామానికి 20 నుండి 50 లక్షల వరకు ఈజీఎస్,ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు మంజూరు చేయటం జరిగింది. హస్నాబాద్ గ్రామాన్ని పైలట్ గ్రామం గా ఎంపిక చేసి 45 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ను మంజూరు చేయటం జరిగింది. కొందరికి డబ్బులు కూడా అకౌంట్ లో జమ అయ్యాయి అన్నారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి,సంక్షేమంలో దూసుకుపోతుంది అని అన్నారు. ముఖ్యమంత్రి తో కలసి పనిచేసి మరిన్ని నిధులు తెచ్చి కుల సంఘాల అభివృద్ధికి,జగిత్యాల అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి,డిఈ మిలింద్,ఏఈ విజయ్, కార్యదర్శి ప్రమోద్, మాజీ ఎంపిటిసి దమ్మ మల్లారెడ్డి, గౌడ్ సంఘం అధ్యక్షులు వెంకటరాజం, నాయకులు సుగుణాకర్ రావు, భీమారావు,దూడ వెంకటేష్,వావిలాల నవీన్, ధర్మరాజు,సుదర్శన్,పూర్ణచందర్ రావు,రాజశేఖర్,విగ్నేష్, గౌడ సంఘ సభ్యులు,నాయకులు,తదితరులు పాల్గొన్నారు

# సిద్ధమవుతున్న తల్లికి వందనం పథకం

తిరుపతి : పిల్లలకు ఇచ్చే గొప్ప బహుమతి ఏదైనా ఉందంటే.. అది 'విద్య'. జీవితాలను మార్చేసే ఆయుధం చదువే. అలాంటి చదువు.. పేదరికం కారణంగా ఏ పిల్లవాడికీ దూరం కాకూడదు. ఈ లక్ష్యంతోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకొచ్చిన పథకం 'తల్లికి వందనం' . పేదరికం కారణంగా విద్యను మధ్యలోనే ఆపకుండా విద్యార్థులు తమ చదువును కొనసాగించడానికి ఆర్థిక చేయూత అందించడం ఈ పథకం ఉద్దేశ్యం. ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 'సూపర్ సిక్స్' హామీలలో ఈ పథకం ఒకటి. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'తల్లికి వందనం' పథకం, గత ప్రభుత్వ 'అమ్మ ఒడి' పథకం వివరాలు, వాటి మధ్య తేడాలు, అర్హతలు, దరఖాస్తు ప్రక్రియ తదితర పూర్తి వివరాలు ఇక్కడ తెలుసుకోండి..

తల్లికి వందనం పథకం అంటే ఏమిటి?

పేద పిల్లలు చదువును మధ్యలోనే ఆపకుండా కొనసాగించేందుకు తల్లికి వందనం పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుంది. ఈ పథకం కింద అర్హులైన ప్రతి విద్యార్థికి ఏటా రూ. 15,000 ఆర్థిక సహాయం అందిస్తారు. ప్రైవేట్ పాఠశాలలో చదివే విద్యార్థులకు కూడా ఇది వర్తిస్తుంది. కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మంది పిల్లలకు ఈ సాయం అందిస్తారు. ఈ మొత్తాన్ని తల్లి బ్యాంక్ ఖాతాలో నేరుగా జమ చేస్తారు.

తల్లికి వందనం పథకం అర్హతలు:

దరఖాస్తుదారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నివాసి అయి ఉండాలి.

విద్యార్థి 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలో చదువుతుండాలి.

విద్యార్థికి కనీసం 75% హాజరు తప్పనిసరి.

విద్యార్థి తల్లి పేరు మీద బ్యాంక్ ఖాతా ఉండాలి.

ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన పిల్లలే ఈ పథకానికి అర్హులు (పేదరిక రేఖకు దిగువన ఉండాలి).

ప్రభుత్వ ఉద్యోగులు, ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ తదితర ప్రజా ప్రతినిధుల పిల్లలు ఈ పథకానికి అర్హులు కారు.

తల్లికి వందనం పథకం దరఖాస్తు విధానం:

ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న పేద పిల్లలకు ఈ పథకాన్ని వర్తింపజేస్తారు. ఆయా పాఠశాలల నుంచి డేటాను సేకరించి లబ్ధిదారులకు నేరుగా బ్యాంకు ఖాతాల్లో రూ.15000 జమ చేస్తారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని సంప్రదించి ఈ పథకం కింద పేరు నమోదు చేయించుకోవచ్చు. కుటుంబ వార్షిక ఆదాయం 2 లక్షల కంటే తక్కువ ఉన్న వారికే ఈ పథకం వర్తిస్తుంది.

గత ప్రభుత్వంలో 'అమ్మ ఒడి' పేరుతో ఈ పథకాన్ని అమలు చేశారు. దాదాపుగా అమ్మ ఒడి పథకం కింద లబ్ధి పొందిన విద్యార్థులందరికీ తల్లికి వందనం పథకం కింద లబ్ధి చేకూరుతుంది. మరొక ముఖ్యమైన విషయం ఏమిటంటే.. గతంలో అమ్మ ఒడి పథకం కింద ఇచ్చే 15 వేల రూపాయల్లో పాఠశాల నిర్వహణ ఖర్చుల నిమిత్తం రూ.2000 కట్ చేయగా.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రూ.15000 మొత్తం తల్లుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపింది. ఇక కొత్తగా ఈ పథకం కింద చేరేందుకు ప్రభుత్వం త్వరలో మార్గదర్శకాలను విడుదల చేసే అవకాశం ఉంది.

ఆన్‌లైన్ దరఖాస్తు విధానం:

ప్రస్తుతం తల్లికి వందనం పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్ విధానం అందుబాటులో లేదు. ఈ పథకం కోసం ప్రత్యేకంగా అధికారిక వెబ్‌సైట్, దాని ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సదుపాయాన్ని భవిష్యత్తులో తీసుకొచ్చే అవకాశం ఉంది.

తల్లికి వందనం పథకం ధరఖాస్తుకు అవసరమైన పత్రాలు:

ఆధార్ కార్డు (తల్లి మరియు విద్యార్థి)

తల్లి పేరు మీద ఉన్న బ్యాంక్ ఖాతా వివరాలు

పాఠశాల రికగ్నిషన్ సర్టిఫికెట్ (లేదా విద్యార్థి ప్రస్తుత పాఠశాల నుండి ధృవీకరణ)

ఆదాయ ధృవీకరణ పత్రం

అడ్రస్ ప్రూఫ్

విద్యార్థి హాజరు వివరాలు

పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు (విద్యార్థి మరియు తల్లి)

లింకింగ్ తప్పనిసరి..

తల్లికి వందనం పథకం ద్వారా ప్రయోజనం పొందాలంటే, విద్యార్థి తల్లి బ్యాంక్ ఖాతాను ఆధార్‌తో అనుసంధానించడం (ఔఖఅఎ లింకింగ్) తప్పనిసరి. సంబంధిత బ్యాంకుకు వెళ్లి ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు. లేదా నెట్ బ్యాకింగ్, మొబైల్ యాప్ ద్వారా కూడా ఆధార్‌ను లింక్ చేసుకునే అవకాశం ఉంది. మీ సేవా కేంద్రాల ద్వారానూ ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు. ఎన్‌పీసీఐ లింకింగ్ అయ్యిందో, లేదో కూడా మీ సేవా కేంద్రాల ద్వారా చెక్ చేసుకోవచ్చు. ఔఖఅఎ అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా చెక్ చేసుకోవచ్చు. బ్యాంక్ ఖాతాతో ఆధార్‌ను లింక్ చేయడం వల్ల లబ్ధిదారుల గుర్తింపు తేలిగ్గా ఉంటుంది. అంతేకాకుండా ఈ పథకం నిధులు పక్కదారి పట్టే అవకాశం ఉండదు. పథకం పారదర్శకంగా అమలు చేసేందుకు వెసులుబాటు కలుగుతుందని అధికారులు చెబుతున్నారు. దీంతో పాటు తల్లి, వారి పిల్లల వివరాలను హౌస్ హోల్డ్ డేటా బేస్‌లో నమోదు చేయించుకోవాలి. హౌస్ హోల్డ్‌లో కూడా ఈకేవైసీ చేయాలి. విద్యార్థి తల్లి బ్యాంక్ అకౌంట్‌కు ఈకేవైసీ ప్రక్రియ కూడా పూర్తి చేసి ఉండాలి.

తల్లికి వందనం స్కీమ్ ఎంపిక ప్రక్రియ:

దరఖాస్తుదారులు సమర్పించిన పత్రాలను పరిశీలించి ఆధారంగా అర్హత ప్రమాణాలను గుర్తిస్తారు.

కుటుంబం ఆర్థిక స్థితి, విద్యార్థి హాజరు శాతం లాంటి అంశాల ఆధారంగా ఎంపిక ప్రక్రియ జరుగుతుంది.

అర్హులైన తల్లుల బ్యాంక్ ఖాతాలకు నేరుగా నగదు జమ చేస్తారు. 'తల్లికి వందనం పథకం ఆంధ్రప్రదేశ్‌లో విద్యార్థుల విద్యకు మద్దతుగా కూటమి ప్రభుత్వం తీసుకున్న కీలక చర్య. గతంలో అమలు చేసిన 'అమ్మ ఒడి' పథకంతో పోలిస్తే, 'తల్లికి వందనం'లో రెండు ప్రధాన ప్రయోజనాలు ఉన్నాయి. ఈ పథకం ద్వారా కుటుంబంలో ఎంత మంది పిల్లలున్నా వారందరికీ ఆర్థిక సహాయం అందుతుంది.

అదేవిధంగా ఎలాంటి కటింగ్స్ లేకుండా పూర్తిగా రూ.15,000లను తల్లి ఖాతాలో జమ చేస్తారు. ఈ పథకం రాష్ట్రంలో విద్యాభి వృద్ధికి, పేద విద్యార్థుల ఉన్నత చదువుల కు ఎంతగానో తోడ్పడుతుందని ఆశిస్తున్నారు. దరఖాస్తు ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో విడుదల కానున్నాయి.

# సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వేసవి సెలవుల అనంతరం బడులు ప్రారంభమైన తొలిరోజే విద్యార్థులకు 'సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు' పంపిణీ చేసేందుకు కూటమి సర్కార్ ఏర్పాట్లు చేస్తుంది. జూన్ 12న స్కూళ్లు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు కిట్లు అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జూన్ 20లోపు పంపిణీ పూర్తి చేయాలని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించింది. ఈ కిట్‌లో ఒక్కో విద్యార్థికి పాఠ్య పుస్తకాలు, వర్క్, నోట్‌బుక్‌లు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, 3 జతల యూనీఫాం, బ్యాగ్, బూట్లు, 2 జతల సాక్సులు, బెల్ట్ అందించనున్నారు. ఒకటో తరగతి విద్యార్థులకు పిక్టోరియల్ డిక్షనరీని ఇవ్వనున్నారు. ఇప్పటికే దాదాపు 95 శాతం పాఠ్యపుస్తకాలు మండల కేంద్రాలకు చేరాయి. జూన్ 1వ తేదీ నుంచే ఇంటర్మీడియట్ విద్యార్థులకు కొత్త విద్యా సంవత్సరం ప్రారంభంకావడంతో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఇప్పటికే నోట్‌బుక్‌లు, పాఠ్యపుస్తకాలను విద్యాశాఖ అందించింది. ప్రతి విద్యార్థికి అందించే విద్యార్థి మిత్ర కిట్‌పై ప్రభుత్వం సగటున రూ. 2,279 ఖర్చు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులకు మొదటి సెమిస్టర్‌కు 1,67,81,374 పాఠ్యపుస్తకాలు అవసరం కానున్నాయి. వీటిలో ఇప్పటి వరకు దాదాపు 1,60,11,028 పుస్తకాలు ఆయా జిల్లా కేంద్రాలకు పంపించడం జరిగింది. అక్కడి నుంచి మండలాలకు 1,59,24,360 చేరాయి. అక్కడి నుంచి పాఠశాలలకు అన్ని వస్తువులు కలిపి కిట్‌గా అందించనున్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి 35,94,774 మంది విద్యార్థులకు కిట్లు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి రూ. 953.71 కోట్లు ఖర్చు కానుంది. 1 నుంచి 8 తరగతుల విద్యార్థులకు ఏకరూప దుస్తులకు కుట్టుకూలి కింద రూ. 120 అందిస్తారు. ఇక 9, 10 తరగతుల వారికి రూ. 240 చెల్లించనున్నారు. ఏకరూప దుస్తులను ఈ ఏడాది సరికొత్త రంగులో అందించనున్నారు. ఆలీవ్ గ్రీన్ ప్యాంట్-గౌను, లైట్ ఎల్లో, గ్రీన్ చారల చొక్కా అందించనున్నారు. ఇక ఆరో తరగతి విద్యార్థులకు ఆంగ్లం-ఆంగ్లం-తెలుగు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు అందించనున్నారు.

# రాజీనామాలకు ఆమోదం ఎప్పుడు

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఏర్పాటయి ఏడాది కావస్తుంది. వైసీపీ అధికారం కోల్పోవడంతో అనేక మంది నేతలు పార్టీకి రాజీనామా చేశారు. అధికార పార్టీలోకి చేరిపోయేందుకు సిద్ధమవుతున్నారు. అందులో ప్రధానంగా ఎమ్మెల్సీలు చాలా మంది ఇప్పటికే వైసీపీతో పాటు ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేశారు. అయితే వారు గత కొంత కాలం నుంచి రాజీనామాలు ఆమోదించాలంటూ శాసనమండలి ఛైర్మన్ కు మొరపెట్టుకుంటున్నారు. అయితే ఇంత వరకూ రాజీనామాలు ఆమోదం పొందలేదు. మరొక వైపు రాజీనామా చేసిన ఎమ్మెల్యేలు అధికార పార్టీలో చేరేందుకు కూడా దారి రెడీ కాలేదు. రాజీనామా చేసిన వారిలో కొందరిని ఇంకా పార్టీలో చేర్చుకోలేదు. పోతుల సునీత ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. అయితే ఆమె రాజీనామాను శాసనమండలి ఛైర్మన్ ఆమోదించలేదు. అదే సమయంలో పోతుల సునీతను టీడీపీలో కూడా చేర్చుకోలేదు. పోతుల సునీతను పార్టీలోకి చేర్చుకోవద్దంటూ సొంత పార్టీ నేతల నుంచే అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. నాడు అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు, లోకేశ్ పై విమర్శలు చేసిన పోతుల సునీతను పార్టీలోకి ఎలా చేర్చుకుంటారని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సూటిగానే ప్రశ్నించారు. కేవలం శిరీష మాత్రమే కాదు టీడీపీ నేతలు, కార్యకర్తల నుంచి కూడా పెద్దయెత్తున విమర్శలు సోషల్ మీడియాలో కనపడటంతో ఆమెను పార్టీలోకి తీసుకోలేదు. ఒక కడప జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ, శానమండలి డిప్యూటీ ఛైర్మన్ జకియా ఖానమ్ కూడా పార్టీకి, తన పదవికి రాజీనామా చేశారు. జకియా ఖానమ్ రాజీనామా కూడా ఇంత వరకూ శాసనమండలి ఛైర్మన్ ఆమోదం పొందలేదు. తిరుమలలో టిక్కెట్ల కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొనడంతో జకియా ఖానమ్ ను టీడీపీ దూరం పెట్టింది. జనసేనలో చేరాలనుకున్నప్పటికీ అది కుదరలేదు. చివరకు జకియా ఖానమ్ బీజేపీలో చేరి కూటమి పార్టీలో కుదరుగా ఉండే ప్రయత్నం చేసింది. జకియా ఖానమ్ రాజీనామా ఆమోదం పొందితే అది బీజేపీకి దక్కే అవకాశముంది. ఎందుకంటే తమ పార్టీకి చెందిన నేత రాజీనామాతో ఖాళీ అయిన స్థానాన్ని తమకు ఇవ్వాలని కమలనాధులు పట్టు బట్టే అవకాశముంది. రాజీనామాలు ఆమోదం పొందక... ఇక మరో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ కూడా వైసీపీతో పాటు ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. ఆయన టీడీపీ నేతలతో భేటీ అయ్యారు. అధికారికంగా మాత్రం టీడీపీలో చేరలేదు. కానీ మర్రి రాజశేఖర్ రాజీనామాను కూడా ఆమోదించలేదు. వైసీపీ ఎమ్మెల్సీలుగా ఉన్న కర్రి పద్మశ్రీ, పోతుల సునీత, బల్లి కల్యాణ చక్రవర్తి, జయ మంగళ వెంకట రమణ, మర్రి రాజశేఖర్, జకియా ఖానంలు తమ పదవులకు రాజీనామాలు చేశారు. అయితే వీరిలో ఎవరి రాజీనామాలు ఆమోదం పొందకపోవడంతో వీరు ఏ పార్టీలో ఉన్నారన్నది ఇంకా అర్థం కాకుండా ఉంది. మండలి ఛైర్మన్ వీరిని మరొకసారి విచారించి రాజీనామాలు ఆమోదిస్తారని చెబుతున్నా ఏడాది కాలం పూర్తి అవుతున్నా కొత్త వారికి అవకాశం ఇవ్వాలన్న కూటమి పార్టీలకు కుదరడం లేదు. రాజీనామాలు ఆమోదం పొందితే వీరి స్థానంలో కొత్త వారికి అవకాశాలు వస్తాయి. అందుకోసం చాలా మంది ఎదురు చూస్తున్నారు. కానీ రాజీనామాలు మాత్రం ఆమోదం పొందడం లేదు.

# డిజిటల్ పాలనపై ప్రభుత్వం దృష్టి

నెల్లూరు : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జూన్ 12న ఎన్డీఏ కూటమి పాలన ఏడాది పూర్తి చేసుకుంటున్న సందర్భంగా 'సుపరిపాలన-స్వర్ణాంధ్రప్రదేశ్' వేడుకలను నిర్వహించనుంది. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఐఏఎస్ అధికారులతో ఈ కార్యక్రమం జరగనుంది. ఏడాది పాలనలో ప్రభుత్వం అమరావతి అభివృద్ధికి ప్రాధాన్యమిస్తోంది. మెగా డీఎస్సీపై తొలి సంతకం, ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలు వంటి హామీలను నెరవేర్చింది. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించనుంది. డిజిటల్ పాలనపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 12తో ఏపీలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పాలనకు ఏడాది పూర్తి అవుతుంది. ఈ నేపథ్యంలో వేడుకలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సుపరిపాలన- స్వర్ణాంధ్రప్రదేశ్ పేరుతో వేడుకలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. సుపరిపాలన- స్వర్ణాంధ్రప్రదేశ్ పేరుతో రాష్ట్ర స్థాయి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఐఏఎస్ అధికారులతో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు చేయాల్సిందిగా సీఎస్ ఆదేశించారు. మరోవైపు 2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీలతో కూడిన ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. 175 స్థానాలకు 164 స్థానాలను కూటమి కైవసం చేసుకుంది. 11 సీట్లకు పరిమితమైన వైసీపీ ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేకపోయింది. ఈ ఏడాది పాలనలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అమరావతిని రాజధానిగా కొనసాగిస్తూ.. అమరావతి అభివృద్ధి పనులకు తొలి ప్రాధాన్యం ఇచ్చింది. ఏ ఫర్ అమరావతి, పీ ఫర్ పోలవరం అంటూ తమ ప్రభుత్వం ప్రాధాన్యాలను సీఎం నారా చంద్రబాబు నాయుడు తొలినాళ్లలోనే క్లారిటీ ఇచ్చారు. అలాగే ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసిన సీఎం చంద్రబాబు.. డీఎస్సీ పరీక్షలు కూడా నిర్వహించారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలు చేస్తున్నారు. అలాగే అన్నా క్యాంటీన్ల ఏర్పాటు, ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పెంపు చేపట్టారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశారు. జూన్ నెలలోనే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను ప్రారంభించనున్నారు. అలాగే ఆగస్ట్ 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని కూడా కూటమి ప్రభుత్వం అమలు చేయనుంది. పార్టీల సంగతికి వస్తే మూడు కూటమి పార్టీల మధ్య మంత్రిత్వ పదవుల దగ్గర నుంచి నామినేటెడ్ పదవుల వరకూ.. పరస్పర అవగాహనతో పాలన సాగుతోంది. అలాగే ప్రభుత్వం డిజిటల్ పాలనపై ఎక్కువ దృష్టి పెడుతోంది. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవలను ప్రజలకు చేరువ చేశారు. రాష్ట్రంలో పెట్టుబడుల కోసం పరిశ్రమలకు ప్రోత్సాహకాలు కూడా అందిస్తున్నారు. అయితే సూపర్ సిక్స్ హామీల అమలు వేగంగా జరగట్లేదని కొన్ని చోట్ల అసంతృప్తి వ్యక్తమవుతోంది. విపక్షం వైసీపీ కూడా ఇదే ప్రధాన అస్త్రంగా విమర్శలు చేస్తోంది.

# వైసీపీలో జాయినింగ్స్ కు గ్రీన్ సిగ్నల్

గుంటూరు : వైసీపీలో రాజీనామాలు చేసే వారి సంఖ్య క్రమంగా తగ్గుతున్నట్లు కనిపిస్తుంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి ఏడాది పూర్తయిన నేపథ్యంలో ఇప్పటికే వెళ్లాల్సిన నేతలు వెళ్లిపోయారు. రాజ్యసభ సభ్యులు నలుగురు వెళ్లిపోగా, శాసనమండలి సభ్యులు మాత్రం ఆరుగురు వరకూ వెళ్లిపోయారు. శాసనసభకు ఎన్నికయిన పదకొండు మందిలోనూ, లోక్ సభకు ఎన్నికైన ముగ్గురిలోనూ ఏ ఒక్కరూ పార్టీని వీడలేదు. వీరంతా పార్టీని అంటిపెట్టుకునే ఉన్నారు. ఏదైనా రాజీనామాలు ఉంటే మొదటి ఏడాదిలోనే ఉంటాయి. ఇక ఏడాది సమయం పూర్తి కావడంతో పాటు వైసీపీకి కొంత అనుకూల వాతావరణం ఏర్పడుతుందన్న సంకేతాలు కనిపిస్తుండటంతో ఇక రాజీనామాలు దాదాపు ఆగినట్లే అనుకోవాలి. ఒకరకంగా చూసుకుంటే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టీడీపీ నుంచి రాజీనామాలు లేవు. అయితే తాజాగా రాజంపేట టీడీపీ నేత సుగవాసి సుబ్రహ్మణ్యం రాజీనామా చేయడంతో ఒకింత ఆ పార్టీకి షాక్ తగిలినట్లయింది. అధికార పార్టీకి ఏడాదిలోనే రాజీనామాలు మొదలవ్వడం, వైసీపీకి రాజీనామాలు ఆగిపోవడంతో ఒకింత ఫ్యాన్ పార్టీ అధినేత ఊపిరి పీల్చుకున్నారు. కూటమిలో మూడు పార్టీల నేతల మధ్య సఖ్యత లేకపోవడంతో పాటు నియోజకవర్గాల్లో విభేదాలు తీవ్ర స్థాయిలో ఉండటంతో లోకల్ గా ఉండే వైసీపీ నేతలు కూడా తమ ఆలోచనను మార్చుకున్నారని చెబుతున్నారు. నిన్న మొన్నటి వరకూ అవసరమైతే కూటమిలోని ఏ పార్టీలోనైనా చేరేందుకు సిద్ధమయ్యేందుకు ప్రయత్నించిన వైసీపీ నేతలు ఇప్పుడు పార్టీని వీడే ఆలోచనను మార్చుకున్నారు. వీడిన నేతలు... పైగా గత ఎన్నికలకు సమయంలో టిక్కెట్లు రాని కొందరు పార్టీని వీడి కొందరు వెళ్లిపోయారు. చివరి నిమిషంలో టిక్కెట్ కోసం కాంగ్రెస్ వంటి పార్టీల్లో చేరి పోటీ చేసి చేతులు కాల్చుకున్నారు. ఓటమి పాలయిన తర్వాత తిరిగి వైసీపీలోకి చేరేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని తెలిసింది. ముందుగా జిల్లా పార్టీ అధ్యక్షులతో టచ్ లోకి వెళ్లిన నేతలు జగన్ అనుమతి కోసం ఎదురు చూస్తున్నారని తెలిసింది. వచ్చే ఎన్నికలకు తాము పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని, తమకు ఉన్న ఆర్థిక బలంతో పాటు అనుచరుల బలం, ఓటు బ్యాంకు విషయాన్ని కూడా గుర్తుపెట్టుకోవాలని కొందరు నేతలు జిల్లా స్థాయి నేతలను అప్రోచ్ అవుతున్నట్లు సమాచారం. జగన్ గ్రీన్ సిగ్నల్ కోసం... అయితే వైసీపీ అధినేత వైఎస్ జగన్ నుంచి గ్రీన్ సిగ్నల్ అందకపోవడంతో చేరికలు ఇంకా మొదలు కాలేదని వైసీపీ సీనియర్ నేతలు చెబుతున్నారు. జగన్ అన్ని నివేదికలు చూసిన తర్వాత వారిలో కొందరి చేరికలకు అంగీకరించే అవకాశముందని తెలిసింది. ఇందులో రాయలసీమకు చెందిన నేతలు కొందరున్నారని చెబుతున్నారు. ఇక ఎస్సీ రిజర్వడ్ నియోజకవర్గానికి చెందిన నేతలు కూడా గత ఎన్నికల్లో టిక్కెట్ రాక పార్టీని వీడి వెళ్లిపోయారు. వారిలో కూడా కొందరు తిరిగి వైసీపీ గూటికి చేరుకునే ప్రయత్నం చేస్తుండటం విశేషం. అయితే జగన్ అన్ని రకాలుగా ఆలోచించి, నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులను అధ్యయనం చేసిన తర్వాత చేరికలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తారని తెలిసింది.

# బూతు పురాణం ఆగేదెప్పుడు

విజయవాడ : అదేదో సినిమాలో జూనియర్ ఎన్టీఆర్.. బాబాయ్ బూతు అంటూ చెవులు మూసుకుంటాడు.. తట్టుకోలేక ఇబ్బంది పడుతుంటాడు.. గుర్తొచ్చింది కదా. ఇప్పుడు ఏపీ రాజకీయాలు కూడా అలానే ఉన్నాయి. అత్యంత దారుణంగా ఉన్నాయి. ప్రతిపక్షం, అధికార పక్షం ఏమాత్రం తగ్గకుండా బూతులు వాడటంలో పీహెచ్‌డీ చేశాయి. ఇటీవల ఓ ఛానల్లో అమరావతి గురించి చర్చ జరిగినప్పుడు.. డిబేట్ ప్యానెల్ లో ఉన్న ఓ జర్నలిస్టు నెత్తి మాసిన వ్యాఖ్యలు చేశారు. అడవులుగా మాట్లాడారు. ఆ తర్వాత అది రాజకీయంగా దుమారాన్ని రేపింది. ఒక రకంగా అధికార పార్టీకి అనుకొని ఆయుధాన్ని ఇచ్చింది. ఇంకేముంది ఆంధ్రప్రదేశ్లో మంటలు మండటం మొదలైంది. కొంత కాలంగా సరైన అవకాశం కోసం ఎదురుచూస్తున్న కూటమి ప్రభుత్వం.. ఈ అవకాశాన్ని సక్రమంగా వినియోగించుకున్నది. ప్రతిపక్ష వైసిపి మీద దుమ్మెత్తి పోస్తోంది. ఇక ఈ వ్యవహారంలోకి రాజధానికి భూములు ఇచ్చిన మహిళా రైతులు ప్రవేశించడంతో వివాదం మరింత పెరిగింది. అది ఏకంగా సాక్షిలో పనిచేసే సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టుకు దారితీసింది. ఇక అప్పటినుంచి ఏపీలో రాజకీయ రచ్చ మరింత పెరిగిపోయింది.. ఇది ఎక్కడ దాకా దారితీస్తుందో తెలియదు కానీ.. ఇప్పటికైతే మంటలు బీభత్సంగా మండేస్తున్నాయి. వైసీపీ అనుబంధ ఛానల్ లో వచ్చిన వ్యాఖ్యల నేపథ్యంలో.. కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా పని చేస్తుంది అనే ఓ చానల్లో డిబేట్ పెట్టారు. ఈ డిబేట్ లో రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి మాట్లాడారు.. ఇటీవల జరిగిన పరిణామాలను, ఇతర విషయాలను విషయాలను ఆ డిబేట్ నిర్వహించే జర్నలిస్ట్ ప్రస్తావించగా.. రేణుకా చౌదరి ఆగ్రహంతో ఊగిపోయారు. చాలా కాలం తర్వాత మీడియా ముందుకు వచ్చిన ఆమె తన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.. అసలు జగన్ పుట్టగానే విజయమ్మ గొంతు నులిమి చం×× ఉంటే పీడ పోయేదని వ్యాఖ్యానించారు.. అయితే ఆమె చేసిన వ్యాఖ్యలను డిబేట్ నిర్వహించే జర్నలిస్టు ఖండించినప్పటికీ.. అప్పటికే జరగాల్సిన ప్రచారం జరిగిపోయింది.. దీనిని వైసిపి అనుకూల సోషల్ మీడియా విభాగం తెగ ప్రచారం చేస్తోంది. నాడు కొమ్మినేని శ్రీనివాసరావు డిబేట్ నిర్వహిస్తుంటే ఎవరో చేసిన వ్యాఖ్యలను తమ పార్టీకి ఆపాదించారని.. తమ పార్టీ నాయకుడిని విమర్శిస్తున్నారని.. ఇప్పుడు మరి కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేసే ఛానల్ లో రేణుకా చౌదరి ఈ తీరుగా వ్యాఖ్యలు చేశారు.. ఈ లెక్కన చంద్రబాబుకు కూడా వాటిని ఆపాదించాలా? అంటూ వైసీపీ నాయకులు ప్రశ్నిస్తున్నారు."ప్రజా సమస్యలను ప్రస్తావించినందుకు ఇబ్బంది పెడుతున్నారు. ఇచ్చిన హామీలను అమలు ఎందుకు చేయడం లేదని ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారు.. టీవీలలో చర్చ వేదికలు నిర్వహిస్తుంటే అరెస్టులు చేస్తున్నారు.. ఒకరకంగా హక్కుల హననానికి పాల్పడుతున్నారు. అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. ఏదో ఒక మాట నోరు జారి అన్నందుకు విపరీతంగా ప్రచారం చేస్తున్నారు. మరి ఇప్పుడు మీ అనుకూల చానల్స్ లో ఇలాంటి డిబేట్ నిర్వహిస్తే దాన్ని ఏమనుకోవాలి.. ఏకంగా గొంతు నులిమి.. అని వ్యాఖ్యలు చేస్తే వాటిని ఎలా చూడాలి.. ఇంత దారుణంగా ప్రవర్తిస్తున్న మీ మీద ఎటువంటి చర్యలు తీసుకోవాలి.. అధికారంలో ఉన్న కాబట్టి ఏదైనా చెల్లిపోతుంది అనుకుంటున్నారా.. ఇది ప్రజాస్వామ్యం కాదా.. ఇక్కడ అధికార పార్టీకి మాత్రమే హక్కులు ఉంటాయా.. ప్రతిపక్ష పార్టీకి హక్కులు ఉండవా" అంటూ వైసిపి నాయకులు ప్రశ్నిస్తున్నారు. సోషల్ మీడియాలో కూటమి ప్రభుత్వ తీరును ఎండగడుతున్నారు. అయితే దీనికి పోటీగా కూటమి ప్రభుత్వ నాయకులు కూడా గతంలో ఉన్న వీడియోలను పోస్ట్ చేస్తున్నారు. మొత్తంగా చూస్తే అటు కూటమి.. ఇటు వైసిపి మధ్య ఒక రకమైన ప్రచ్ఛన్న యుద్ధం ఆంధ్రప్రదేశ్లో సాగుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు.

# క్రికెట్ లవర్స్ కు గుడ్ న్యూస్

విశాఖపట్టణం : విశాఖపట్నం వాసులకు గుడ్ న్యూస్.. మరీ ముఖ్యంగా ఉత్తరాంధ్రలోని క్రికెట్ అభిమానులకు ఇది పండగలాంటి వార్తనే చెప్పొచ్చు. ఎందుకంటే ప్రపంచకప్ మ్యాచులను వీక్షించే అవకాశం దక్కనుంది. అది కూడా ఒకటీ రెండు కాదు. ఏకంగా ప్రపంచకప్ మ్యాచ్‌లను ఐదింటిని చూసే అవకాశం దక్కింది. త్వరలోనే మహిళల వన్డే ప్రపంచకప్ 2025 జరగనున్న సంగతి తెలిసిందే. 2025 మహిళల వన్డే ప్రపంచకప్ మ్యాచ్‌ల కోసం ఐసీసీ ఇటీవల వేదికలను ఖరారు చేసింది. అందులో విశాఖపట్నం కూడా ఉంది. ఈ నేపథ్యంలోనే విశాఖపట్నంలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో మహిళల ప్రపంచకప్‌కు సంబంధించి ఐదు మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ విషయాన్ని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేశినేని చిన్ని (కేశినేని శివనాథ్) వెల్లడించారు. ఐదు ప్రపంచకప్ మ్యాచ్‌ల తో పాటుగా ఒక వన్డే మ్యాచ్‌కు విశాఖపట్నం ఆతిథ్యం ఇవ్వనున్నట్లు కేశినేని చిన్ని వివరించారు. ఈ క్రమంలోనే విశాఖపట్నం స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు. మరోవైపు రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో క్రికెట్ గ్రౌండ్లు నిర్మించేందుకు ఏసీఏ ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిపారు. తొలివిడతగా కర్నూలు, నెల్లూరులో క్రికెట్ స్టేడియాల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. అలాగే త్వరలోనే ఆంధ్రా ప్రీమియర్ లీగ్ నిర్వహణ కోసం ఏసీఏ ప్రణాళికలు రచిస్తోందని తెలిపారు. 45 రోజుల్లోనే విశాఖపట్నం స్టేడియాన్ని ఆధునీకరించామని.. ఈ ఏడాదిలో రెండు ఐపీఎల్ మ్యాచ్‌లను కూడా నిర్వహించినట్లు కేశినేని శివనాథ్ గుర్తు చేశారు.

# 10 మంది డేంజర్ లోనే...

విశాఖపట్టణం : ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎమ్మెల్యేలపై చేస్తున్న సర్వేలలో షాకింగ్ విషయాలు బయటపడుతున్నాయట. చాలా మంది ఎమ్మెల్యేలు ప్రజల్లో వ్యతిరేకత ఎదుర్కొంటున్నారని సర్వేల ద్వారా స్పష్టమయిందంటున్నారు. జనసేన నుంచి గత శాసనసభ ఎన్నికల్లో 22 మంది ఎమ్మెల్యేలు గెలిచారు. పోటీ చేసిన అన్ని చోట్ల విజయం సాధించారు. హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేట్ సాధించిన జనసేన వచ్చే ఎన్నికల్లో ఇంకా ఎక్కువ స్థానాల్లో పోటీ చేయాలని భావిస్తుంది. అయితే ఎన్నికయిన ఎమ్మెల్యేల్లో దాదాపు పది నుంచి పదిహేను మంది పై తీవ్ర వ్యతిరేకత ఉందని పవన్ కల్యాణ్ నిర్వహించిన సర్వేలో స్పష్టమయిందని చెబుతున్నారు. ఆ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల పనితీరు సక్రమంగా లేదన్న రిపోర్టులు పవన్ కు చేరాయట. అలాగే సరుకులు ఇవ్వాలంటూ ప్రజాసమస్యలను పరిష్కరించడంలో... కొత్తగా ఎన్నికయిన ఎమ్మెల్యేలు కావడంతో వారు ప్రజాసమస్యలను పరిష్కరించడంలో వెనకబడి ఉండటమే కాకుండా అవినీతి ఆరోపణలు కూడా ఎదుర్కొంటున్నారని తెలిసి పవన్ నివ్వెరపోయారు. పవన్ కల్యాణ్ ఏరి కోరి నిజాయితీని ప్రధాన అంశంగా తీసుకుని గత ఎన్నికల్లో అభ్యర్థులను ఎంపిక చేశారు. కూటమి హవాలో గెలిచి తొలిసారి ఎమ్మెల్యేలు అయిన వారికి అవినీతి చేయడం కూడా పెద్ద చేతకావడం లేదని, నేరుగా వారే చేతులు చాస్తుండటంతో ప్రజల్లో పలుచనగా మారిపోయారన్న కామెంట్స్ వినపడుతున్నాయి. ఇందులో మహిళ ఎమ్మెల్యేలు కూడా ఉన్నారని తెలిసింది. దీంతో పాటు కూటమిలోని పార్టీ నేతలు కూడా సహకరించకపోతుండటంతో మరింత పరిస్థితి అధ్వాన్నంగా తయారైందన్న నివేదికలు అందాయని తెలుస్తోంది. ఉత్తరాంధ్ర జిల్లాకు చెందిన ఒక ఎమ్మెల్యే కు భారీగా ఆస్తులున్నాయి. ఎన్నికలకు ముందే ఆర్థికంగా స్థిరపడిన కుటుంబమే అయినా ప్రతి పనికీ పర్సంటేజీలు దండుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయట. ఆ నియోజకవర్గంలో తొలిసారి జనసేన జెండా ఎగరడాన్ని టీడీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతో ఎమ్మెల్యేపై ఏ చిన్న అవకాశమొచ్చినా టీడీపీ, బీజేపీ నేతలే ఆ ఎమ్మెల్యేలు తమ అనుచరులతో సోషల్ మీడియాలో పోస్టింగ్ లు పెడుతూ బద్నాం చేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలిసి పవన్ ఒకింత ఆశ్చర్యపోయారట. దీంతో పాటు నియోజకవర్గంలో నామినేటెడ్ పదవుల విషయంలోనూ కూటమి పార్టీల నేతల మధ్య తలెత్తిన మనస్పర్థలు మరింత ఎమ్మెల్యే ప్రతిష్టను దిగజార్చేలా చేస్తున్నాయట.. ఇక గోదావరి జిల్లాలకు చెందిన ఒక ఎమ్మెల్యే పై కూడా ఆరోపణలు అధికంగా వచ్చాయి. తొలినాళ్లలో మంచి పేరు తెచ్చుకుని పవన్ దృష్టిలో పడిన ఆ ఎమ్మెల్యే చేతివాటం మామూలుగా లేదంటున్నారు. ప్రతి పనికీ పర్సంటేజీ దండుకుంటున్నారని తెలిసింది. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన యువకుడయిన ఆయన తన అనుచరులతో బెదిరింపులకు దిగుతూ కాంట్రాక్టర్ల నుంచి బెదిరించి మామూళ్లు వసూళ్లు చేస్తున్నారన్న సమాచారం సర్వేలో తేలింది. దీంతో వచ్చే ఎన్నికల్లో ప్రస్తుతం ఉన్న ఇరవై రెండు మంది ఎమ్మెల్యేలలో పది నుంచి పన్నెండు మంది ఎమ్మెల్యేలకు టిక్కెట్ దొరకడం కూడా కష్టమన్న అభిప్రాయం జనసేనలో వ్యక్తమవుతుంది. వారి స్థానంలో కొత్తవారిని ఎంపిక చేసే అవకాశాలున్నాయన్న టాక్ పార్టీలో గట్టిగా వినిపిస్తుంది.

అక్షర వార్త



# సినిమా



## తరుణ్ భాస్కర్ 'ది ఎండ్' స్టోరీ ఏంటి..?

యంగ్ డైరెక్టర్స్ లో తనకంటూ ఒక స్పెషల్ క్రేజ్ తెచ్చుకున్నాడు దర్శకుడు తరుణ్ భాస్కర్. అతను చేసిన పెళ్లిచూపులు సినిమా సెన్సేషన్ కాగా ఆ నెక్స్ట్ వచ్చిన ఈ నగరానికి ఎమైంది అదరగొట్టేసింది. యూత్ ఆడియన్స్ పల్స్ పట్టేసిన తరుణ్ భాస్కర్ డైరెక్టర్ తను తీసే ప్రతి సినిమాతో యూత్ ని ఊగిపోయేలా చేస్తున్నాడు. చివరగా తన డైరెక్షన్ లో వచ్చిన కీడా కోలా సినిమా అంచనాలను అందుకోలేదు కానీ తరుణ్ భాస్కర్ మార్క్ అయితే చూపించింది. ఐతే డైరెక్టర్ గా కాస్త స్లో అయ్యి నటుడిగా బిజీ అయ్యాడు తరుణ్ భాస్కర్. తెర మీద కనిపించడం ఎక్కువయ్యే సరికి తెర వెనక దర్శకుడి పాత్రకు అన్యాయం జరుగుతుంది. అందుకే కాస్త గ్యాప్ ఇచ్చి మళ్లీ డైరెక్షన్ వైపు దృష్టి పెట్టాలని ఫిక్స్ అయ్యాడు. కీడా కోలా సినిమా కూడా తరుణ్ భాస్కర్ డైరెక్షన్ లోనే వచ్చింది. ఆ సినిమాలో తరుణ్ నటించడం విశేషం. ఇక నెక్స్ట్ తరుణ్ భాస్కర్ ఏ సినిమాతో వస్తాడు అన్నది పెద్ద చర్చ నడుస్తుంది. ఐతే ఎప్పటి నుంచో ఈ నగరానికి ఏమైంది పార్ట్ 2 చేయాలని ఫ్యాన్స్ అడుగుతుండగా ఈమధ్య తరుణ్ చేస్తానని చెప్పాడు. లేటెస్ట్ గా తరుణ్ భాస్కర్ తన ఇన్ స్టాగ్రాం లో లాప్టాప్ లో ది ఎండ్ అంటూ ఒక నోట్ రాశాడు. దానికి న్యూ బిగినింగ్ అనే కామెంట్ పెట్టాడు. తరుణ్ భాస్కర్ కథ పూర్తి చేశానన మెసేజ్ ఆడియన్స్ కి పాస్ చేశాడు. ఐతే అది ఏ కథ ఈ నగరానికి ఏమైంది సీక్వెల్ స్టోరీనేనా అని సోషల్ మీడియాలో చర్చలు పెడుతున్నారు. ఈ.ఎన్.ఈ 2 కోసం యూత్ ఆడియన్స్ అంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఐతే తరుణ్ పూర్తి చేసిన కథ అదే అయితే మాత్రం త్వరలోనే ఒక సర్ ప్రైజ్ అప్డేట్ ఉంటుందని చెప్పొచ్చు. ఈ నగరానికి ఎమైంది 2 కాకుండా తరుణ్ భాస్కర్ వేరే కథను సిద్ధం చేసినా అలా అయినా తరుణ్ సినిమా మళ్లీ చూడొచ్చనే జోష్ లో ఉన్నారు ఆడియన్స్. మొత్తానికి తరుణ్ భాస్కర్ ది ఎండ్ స్టోరీ ఏంటో కానీ సోషల్ మీడియాలో మాత్రం తెగ డిస్కషన్స్ జరుగుతున్నాయి.



## అమ్మడు పెద్దితోనే ఆగిపోతుందా..?

శ్రీదేవి తనయురాలు జాన్వి కపూర్ తన మదర్ లానే సౌత్ ఆడియన్స్ లో కూడా క్రేజ్ తెచ్చుకోవాలని చూస్తుంది. ఈ క్రమంలోనే అమ్మడు ఎన్ టీ ఆర్ దేవర పార్ట్ 1 సినిమాలో నటించింది. ఆ సినిమాలో తంగం పాత్రలో నటించిన జాన్వి ఆడియన్స్ ని గ్లామర్ తో మెప్పించింది. దేవర సినిమాలో జాన్వి పాత్ర అంతగా క్లిక్ అవ్వలేదు. కేవలం ఆ గ్లామర్ షో పాటల్లో మాత్రమే ఆమె హైలెట్ అయ్యింది. అయినా కూడా టాలీవుడ్ ఎంట్రీ జాన్వి కపూర్ కి బాగానే జరిగిందని చెప్పొచ్చు. దేవర 1 తర్వాత దేవర 2లో ఆమె రోల్ చాలా బాగుంటుందని అంటున్నారు. ఐతే ఆ సినిమా వచ్చేందుకు టైం పట్టేలా ఉందని తెలిసిందే. ఇక దేవర తర్వాత జాన్వి కపూర్ రామ్ చరణ్ పెద్ది సినిమాలో ఛాన్స్ పట్టేసింది. బుచ్చి బాబు డైరెక్షన్ లో తెరకెక్కుతున్న పెద్ది సినిమాలో జాన్వి నటించడం ఆమెకు చాలా ప్లస్ అని చెప్పొచ్చు. ఉప్పెనతో తొలి సినిమాతోనే బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న బుచ్చి బాబు పెద్దితో చాలా పెద్ద ప్లానింగ్ తోనే వస్తున్నాడని తెలుస్తుంది జాన్వి కపూర్ పెద్ది తర్వాత తెలుగులో సినిమాలు చేసే అవకాశాలు లేవన్నట్టుగా పరిస్థితి కనబడుతుంది. దేవర తో జాన్వి ఏదైనా ఇంపాక్ట్ క్రియేట్ చేస్తుందేమో అనుకోగా అది కాస్త జరగలేదు. పెద్ది లో ఏదైనా సాధ్యం అవుతుందేమో చూడాలి. పెద్ది విషయంలో ప్రతి యాస్పెక్ట్ ఫ్యాన్స్ కి ట్రీట్ ఇస్తుందని డైరెక్టర్ బుచ్చి చెబుతున్నాడు. మెగా ఫ్యాన్స్ ఆకలి తీర్చేలా పెద్ది ఉంటుందని ఇప్పటికే పెద్ది ఫస్ట్ షాట్ తో చూపించాడు. ఇక రాబోతున్న సినిమా తో నెక్స్ట్ లెవెల్ రికార్డులు క్రియేట్ చేస్తుందని అంటున్నారు. ఈ సినిమాతో జాన్వి కూడా బ్లాక్ బస్టర్ కొట్టాలని చూస్తుంది. పెద్ది సక్సెస్ అయితే జాన్వికి మరిన్ని తెలుగు సినిమా ఛాన్స్ లు వస్తాయి. ఐతే ఈమధ్య నాని సినిమాలో జాన్వి నటిస్తుందని వార్తలు వచ్చాయి కానీ వాటిల్లో ఏది నిజం లేదని తెలుస్తుంది. పెద్ది తర్వాత జాన్వి టాలీవుడ్ లో కొనసాగుతుందా లేదా అన్నది చూడాలి. ప్రస్తుతం హిందీలో అమ్మడు ఈ ఇయర్ 3 సినిమాలు చేస్తుంది. పెద్ది మాత్రం నెక్స్ట్ ఇయర్ మార్చి రిలీజ్ అవుతున్న విషయం తెలిసిందే.

## షారుక్- సల్మాన్ కోసం ఎన్టీఆర్, హృతిక్

బాలీవుడ్ క్రేజీ నిర్మాణ సంస్థ యష్ రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్ పేరుతో భారీ యాక్షన్ ఎంటర్ టైనర్లని తెరపైకి తీసుకొస్తూ ఆడియన్స్ని థ్రిల్ చేస్తున్న విషయం తెలిసిందే. సల్మాన్ ఖాన్ నటించిన ఏక్ థా టైగర్తో ఈ స్పై యూనివర్స్ని 2012లో మొదలు పెట్టారు. ఆ తరువాత సల్మాన్తోనే 'టైగర్ జిందాహై'ని నిర్మించారు. ఆ తరువాత హృతిక్ రోషన్, టైగర్ష్రాఫ్ల కాంబినేషన్లో వార్ని నిర్మించారు. ఇక షారుక్ ఖాన్ కంబ్యాక్ మూవీగా తెరకెక్కిన పఠాన్ని కూడా



ఇదే యూనివర్స్లో భాగంగా నిర్మించారు. సిద్ధార్థ్ ఆనంద్ డైరెక్ట్ చేసిన ఈ మూవీ షారుఖ్ కెరీర్లో అత్యధిక వసూళ్లని రాబట్టిన సినిమాగా నిలవడమే కాకుండా ఆయన కెరీర్కి మరింత బూస్ట్ని అందించింది. దీని తరువాత మళ్లీ సల్మాన్ ఖాన్తో టైగర్ 3ని రూపొందించారు. ఇప్పటి వరకు వచ్చిన స్పై యూనివర్స్ మూవీస్ స్థాయిలో ఇది వసూళ్లని రాబట్టలేకపోయినా ఫరవాలేదు అనిపించింది. ఇప్పుడు ఇదే యూనివర్స్లో ఎన్టీఆర్, హృతిక్లతో వార్ 2ని నిర్మించిన విషయం తెలిసిందే. ఆగస్టు 14న భారీ స్థాయిలో రిలీజ్కు రెడీ అవుతున్న నేపథ్యంలో యష్రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్లో ఓ భారీ క్రేజీ మూవీకి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. వార్ 2 తరువాత ఇదే యూనివర్స్లో ఆల్ఫాని తెరకెక్కించనున్న యష్ రాజ్ ఫిల్మ్స్ ఆ తరువాత షారుక్ ఖాన్, సల్మాన్ ఖాన్ల కలయికలో పఠాన్ వర్సెస్ టైగర్ని తెరపైకి తీసుకురాన్నారని బాలీవుడ్ మీడియా కథనం. పఠాన్లో సల్మాన్ ఖాన్ గెస్ట్ రోల్లో కనిపించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే పఠాన్ వర్సెస్ టైగర్లో హృతిక్ రోషన్తో పాటు ఎన్టీఆర్, జాన్ అబ్రహం, అలియాభట్ గెస్ట్ క్యారెక్టర్లలో కనిపిస్తారని వార్తలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా ఈ భారీ మల్టీస్టారర్ యాక్షన్ ఎంటర్ టైనర్ని వార్, పఠాన్ చిత్రాల దర్శకుడు సిద్ధార్ద్ ఆనంద్ తెరకెక్కించనున్నాడట. ఈ వార్తలు సినిమాపై అంచనాల్ని పెంచేశాయి. ఈ నేపథ్యంలోనే ఈ ప్రాజెక్ట్ ఇప్పట్లో కష్టమని, అసలు ఈ ప్రాజెక్టే లేదని ప్రచారం మొదలైంది.

## బన్నీ 22 ముంబైలో లాంచింగ్!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ 22వ చిత్రం అట్లీ దర్శకత్వంలో లాక్ అయిన సంగతి తెలిసిందే. కొన్ని నెలలుగా ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. తాజాగా ఆ పనులన్నీ ఓ కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో సినిమా ప్రారంభోత్సవ ముహూర్తం కూడా ఫిక్స్ అయినట్లు ప్రచారం జరుగుతోంది. గురువారం ఈచిత్రం ముంబైలో ప్రారంభమవుతుందని వార్తలొస్తున్నాయి. ముహూర్తపు సన్నివేశంలో భాగంగా అల్లు అర్జున్- మృణాల్ ఠాకూర్ పై తొలి క్లాప్ పడబోతుంది. అదే రోజున ఇద్దరి మధ్యన కొన్ని కీలక సన్నివేశాలు కూడా చిత్రీకరించనున్నారని వినిపిస్తుంది. మరి ఈ ప్రచారంలో నిజమెంతో తెలియాలి. మేకర్స్ ధృవీకరిస్తే గానీ దీనిపై పూర్తి క్లారిటీ రాదు. ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తుంది. ఈ సినిమా ప్రారంభోత్సవం ఎక్కడ జరుగుతుంది? అన్న దానిపై



తొలి నుంచి సస్పెన్స్ కొనసాగుతుంది. ఇందులో నటించే హీరో బన్నీ తెలుగు నటుడు. టాలీవుడ్ నుంచి పాన్ ఇండియాలో సంచలనమైన నటుడు. దర్శకుడు అట్లీ తమిళీయన్..నిర్మాతలు కూడా అక్కడి వారే. దీంతో లాంచింగ్ హైదరాబాద్ లో ఉంటుందా? చెన్నైలో ఉంటుందా? మరే ప్రదేశంలో ఉంటుందా? అన్న కథనాలు వైరల్ అయ్యాయి. పై ప్రచారమే నిజమైతే ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా ముంబైని ఫిక్స్ చేసినట్లు చెప్పొచ్చు. పైగా తెలుగు నటుడు కాబట్టి సినిమా కూడా తెలుగులోనే చిత్రకరిస్తారు. కాబట్టి హైదరాబాద్ లోనే లాంచ్ చేయాలనే ఒత్తిడి ఉంటుంది. మిగతా వారిద్దరు తమిళీయన్స్ కాబట్టి చెన్నైలో చేద్దామనే ప్రపోజల్ కూడా ఉంటుంది. అప్పుడు బన్నీ తగ్గాల్సి ఉంటుంది. ఈ రెండింటికి ఛాన్స్ ఇవ్వకుండా ముంబై వేదిక అయితే ఎలాంటి ఇబ్బంది ఉండదనే మేకర్స్ ముంబై ఆలోచన చేసి ఉండొచ్చు.

## 2026 లో అమీర్-లోకేష్ ఫిక్సైపోయారు!

బాలీవుడ్ నటుడు అమీర్ ఖాన్ ప్రతిభావంతులైన దర్శకుల్ని వెతికి పట్టుకోవడంలో గొప్ప మేధావి. తన అనుభవాన్ని రంగరించి ఇండస్ట్రీలో ఎవరు పనివంతులో గమనించి వాళ్లతో పచేస్తుంటారు. అమీర్ సొంత నిర్మాణ సంస్థలో బయట హీరోలతో నిర్మించడం గానీ...తానే రంగంలోకి దిగడంగానీ చేస్తుంటారు. ప్రస్తు తం అమీర్ ఖాన్ ...సూపర్ స్టార్



రజనీకాంత్ కథానాయకుడిగా లోకేష్ కనగరాజ్ తెరకెక్కిస్తోన్న కూలీలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కొన్ని రోజులుగా లోకేష్ తో అమీర్ సినిమా చేయబో తున్నా రు? అన్న ప్రచారం కూడా మొదలైంది. కొత్త దర్శకులతో అమీర్ లాంటి పేరున్న నటుడు రంగంలోకి దిగితే ఇలాంటి ప్రచారం సహ జమే. కానీ ఈ ప్రచారం నిజమవుతుంది. లోకేష్ తో సినిమా చేయడానికి అమీర్ ఖాన్ సిద్దంగా ఉన్నారని కాలక్రమంలో అర్దమైంది. అయినా లోకేష్ బిజీ దర్శకుడు. చేతిలో పూర్తి చేయాల్సిన ప్రాజెక్ట్ లు చాలా ఉన్నాయి. అవన్నీ పూర్తయిన తర్వాతే అమీర్ సినిమా గురించి కూల్ గా ఆలోచన చేసే అవకాశం ఉంటుందని అంతా భావిస్తున్నారు. కానీ అమీర్ ఖాన్ అంత సమయం తీసుకోవడం లేదు. ఉన్న పళంగా ఇద్దరు కలిసి పనిచేయడానికి ఆసక్తిగా ఉన్నట్లు కనిపిస్తుంది. ఇదే సందేహాన్ని ఓ బాలీవుడ్ మీడియా జర్నలిస్ట్ అమీర్ ఖాన్ ముందుకు తీసుకెళ్లగా... అమీర్ సంతోషంగా అంగీకరించారు. ఆ ప్రచారాన్ని అమీర్ ఖాన్ ధృవీకరించారు. ఇద్దరు కలిసి సినిమా చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ప్రస్తుతం తాను వేర్వేరు కమిట్ మెంట్లతో ఉన్నానని అవన్నీ ఇదే ఏడాది ముగించుకుని వచ్చే ఏడాది ఆగస్టు లేదా సెప్టెంబర్ కు సిద్దంగా ఉంటా న్నారు. దీంతో ప్రాజెక్ట్ కన్ఫమ్ అయింది. ఈ లోగా లోకేష్ కనగరాజ్ పూర్తి చేయాల్సిన ప్రాజెక్ట్ లున్నాయి. కార్తీ తో ఖైదీ 2 ముగించాలి. ఆ తర్వాత సూర్యతో రోలెక్స్ సినిమా చేసే అవకాశం ఉంటుంది. ఒకవేళ ఈ ప్రాజెక్ట్ కి టైమ్ ఎక్కువ పడుతుందంటే? అమీర్ సినిమా కోసం పనిచేయడం మొదలు పెడతారు.

## త్రివిక్రమ్ ఊరిస్తున్న కథ అదేనా?

అల్లు అర్జున్తో త్రివిక్రమ్ శ్రీనివాస్ చేయాలనుకున్న మెగా మూవీ.. చేతులు మారడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. 'పుష్ప-2' తర్వాత బన్నీ.. త్రివిక్రమ్ దర్శకత్వంలో నటిస్తాడనే అంతా అనుకున్నారు. కానీ అతనేమో అట్లీ సినిమాను మొదలుపెట్టేశాడు. త్రివిక్రమ్ సినిమాకు ప్రి ప్రొడక్షన్ పనుల్లో ఆలస్యం వల్లే బన్నీ మధ్యలో వేరే సినిమా చేస్తున్నాడని అనుకున్నారు. తీరా చూస్తే త్రివిక్రమ్ సైతం విక్టరీ వెంకటేష్తో సినిమాకు రెడీ అవుతుండడంతో ఈ వ్యవహారంలో ఏదో ట్విస్ట్ ఉందని అర్థమైంది. త్రివిక్రమ్తో చేయాలనుకున్న మెగా మైథలాజికల్ మూవీ మీద బన్నీకి గురి కుదరకపోవడం వల్లే ఆ ప్రాజెక్టును వదిలేశాడా.. మొత్తంగా ఆ సినిమా ఆగిపోయిందా అనే చర్చ మొదలైంది. ఇప్పుడేమో ఆ కథ బన్నీ నుంచి తారక్కు వెళ్లిందని.. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ఈ సినిమా సెట్స్ మీదికి వెళ్తుందని జోరుగా వార్తలు వస్తున్నాయి. ఇంతకీ బన్నీ వద్దనుకున్న.. తారక్ ఓకే చేసిన కథ ఏంటి అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇది మైథలాజికల్ మూవీ అని నిర్మాత నాగవంశీ



ఇంతకుముందే క్లారిటీ ఇచ్చాడు. తెలుగు తెరపై ఎన్నో పురాణ గాథలు వచ్చినప్పటికీ.. ఎక్కువగా టచ్ చేయని ఒక క్యారెక్టర్ అంటూ నాగవంశీ ఈ కథ గురించి హిట్ ఇచ్చాడు. విశ్వసనీయ సమాచారం ప్రకారం త్రివిక్రమ్ చేయాలనుకుంటున్నది సుబ్రహ్మణ్యస్వామి కథ అట. తెలుగులో, అలాగే ఇతర భాషల్లో శివుడి మీద, వినాయకుడి మీద చాలా సినిమాలు వచ్చాయి. ఆ పాత్రలను ఎన్నోసార్లు తెరపై చూశాం. కానీ శివుడి చిన్న కుమారుడైన సుబ్రహ్మణ్యస్వామి కథ గురించి సినిమాల్లో చూపించిన సందర్భాలు అరుదు. దేవుళ్లలో ఆయన అంత పాపులర్ కాదని కూడా చెప్పాలి. ఐతే సుబ్రహ్మణ్యస్వామి కథలో ఎన్నో ఆసక్తికర మలుపులు ఉన్నాయని.. పురాణాల మీద గొప్ప పట్టున్న త్రివిక్రమ్ ఆయన కథనే చెప్పబోతున్నారని అంటున్నారు. ఐతే ఈ కథ తనకు సూటవ్వదనే బన్నీ తప్పుకున్నట్లు తెలుస్తోంది. మరి తారక్ ఈ పాత్రలో ఎలా ఇమిడిపోతాడో చూడాలి. కెరీర్ ఆరంభం నుంచి చాలావరకు ఫ్యామిలీ ఎంటర్టైనర్లే తీస్తూ వచ్చిన త్రివిక్రమ్.. మిగతా స్టార్ డైరెక్టర్ల మాదిరి పాన్ ఇండియా ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే ఈవెంట్ ఫిలిమ్స్ ట్రై చేయలేదు. ప్రశాంత్ వర్మ లాంటి యంగ్ డైరెక్టర్లు కూడా పాన్ ఇండియా స్థాయికి ఎదిగిపోతున్న టైంలో త్రివిక్రమ్ రూటు మార్చాలనే అభిప్రాయం ఆయన అభిమానుల్లో వ్యక్తమవుతున్న దశలో ఆయన బన్నీతో ఓ మెగా ప్రాజెక్టు చేయాలనుకున్నారు. అది కాస్తా ఇప్పుడు తారక్ వద్దకు వచ్చింది.



## వర్కౌట్ ఔట్ ఫిట్లో ఇస్మార్ట్ బ్యూటీ

కన్నడ మూవీ వజ్రకాయ సినిమాతో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన నభా నటేష్ ఆ తర్వాత టాలీవుడ్లోనూ ఎంట్రీ ఇచ్చి మంచి గుర్తింపు దక్కించుకుంది. కన్నడ అమ్మాయి కావడంతో అక్కడి ఇండస్ట్రీలో అవకాశాలు బాగానే వచ్చాయి. కానీ అదృష్టం కలిసి రాకపోవడంతో విజయాలు నమోదు కాలేదు. దాంతో ముద్దుగుమ్మ నభా నటేష్కి పెద్దగా సక్సెస్లు దక్కలేదు. తెలుగులో ఈమె చేసిన మొదటి సినిమా నన్ను దోచుకుందువటే సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. అంతే కాకుండా ఆ సినిమాలో ఈమె పోషించిన పాత్రకు మంచి మార్కులు దక్కాయి, నటిగానూ అందరి దృష్టిని ఆకర్షించడంతో పాటు, అన్ని వర్గాల వారికి నచ్చింది. తెలుగులో 2019లో ఈమె చేసిన ఇస్మార్ట్ శంకర్ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో టాలీవుడ్లో బిజీ అయ్యే అవకాశం ఉందని అంతా భావించారు. కానీ కరోనా కారణంగా ఈ అమ్మడికి ఇస్మార్ట్ శంకర్ విజయం ఆఫర్లను తెచ్చి పెట్టలేక పోయింది. కానీ ఇటీవల ఈమె మెల్ల మెల్లగా బిజీ అవుతోంది. గత ఏడాది డార్లింగ్ అనే వెబ్ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ మధ్య కాలంలో సోషల్ మీడియాలో బిజీగా ఉన్న ఈ అమ్మడు అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తూ వచ్చింది. సాధారణంగానే అందంగా కనిపించే ఇస్మార్ట్ బ్యూటీ నభా నటేష్ స్కిన్ షో చేస్తే ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తాజాగా ఈమె జిమ్లో ఉన్న ఫోటోలను షేర్ చేసింది. వర్కౌట్ డ్రెస్లో నార్మల్గానే ముద్దుగుమ్మలు చాలా ముద్దుగా ఉంటారు. పైగా నభా నటేష్ టైట్ షార్ట్ ధరించడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ అందమైన ఇస్మార్ట్ బ్యూటీకి అభిమానులు పెద్ద ఎత్తున ఉన్నారు. అందుకే ఈమె ఇన్స్టాగ్రామ్లో ఫోటోలు షేర్ చేసిన వెంటనే లక్షల మంది లైక్ చేయడం మాత్రమే కాకుండా ఫోటోను షేర్ చేస్తూ, వావ్, సూపర్ అంటూ కామెంట్స్ చేస్తూ ఉంటారు. బ్లాక్ ఔట్ ఫిట్లోనూ మెరిసి పోతున్న ఇస్మార్ట్ బ్యూటీ నభా నటేష్ను ఎంత పొగిడినా తక్కువే అంటూ అభిమానులు సైతం నెట్టింట కామెంట్ చేస్తున్నారు. ఇలాంటి ముద్దుగుమ్మ ఏడాదికి మూడు నాలుగు సినిమాలు చేయాలని అభిమానులు కోరుకుంటున్నారు.



## ఆ జ్ఞాపకాల్లోనే ఇంకా కీర్తి సురేష్

'మహానటి' ఫేం కీర్తి సురేష్ ఈ మధ్య కాలంలో సినిమాల్లో కంటే ఎక్కువగా సోషల్ మీడియాలో కనిపిస్తుంది. గత ఏడాది మూడు సినిమాలతో వచ్చిన ఈ అమ్మడికి కమర్షియల్గా బిగ్ సక్సెస్ దక్కలేదు. ముఖ్యంగా గత ఏడాది ఈమె బాలీవుడ్లో బేబీ జాన్ సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. ఆ సినిమాపై చాలా ఆశలు పెట్టుకున్న కీర్తి సురేష్కి నిరాశ మిగిలింది. తమిళ సూపర్ హిట్ మూవీకి రీమేక్గా బేబీ జాన్ రూపొందిన విషయం తెల్సిందే. సినిమా బాక్సాఫీస్ వద్ద నిరాశ పరచినా కూడా హిందీ ప్రేక్షకుల్లో కీర్తి సురేష్కి మంచి ఇమేజ్ను తెచ్చి పెట్టింది. అందుకే వెంటనే హిందీలో మరో సినిమాను చేసే అవకాశం దక్కించుకుంది. త్వరలోనే కీర్తి సురేష్ హిందీ సినిమా పట్టాలెక్కబోతుంది. సినిమాల్లో మాత్రమే కాకుండా వెబ్ సిరీస్ల్లోనూ ఈ అమ్మడు నటిస్తున్న విషయం తెల్సిందే. త్వరలోనే కీర్తి సురేష్ నటించిన అక్క వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ కాబోతుంది. రాధిక ఆప్టే తో కలిసి ఆ వెబ్ సిరీస్లో కీర్తి సురేష్ స్క్రీన్ షేర్ చేసుకోబోతుంది. సినిమా ఇండస్ట్రీలో ఈ అమ్మడి యొక్క జోరు తగ్గుతుందా అనే అనుమానం వచ్చిన ప్రతిసారి తన అందమైన ఫోటోలను షేర్ చేయడంతో పాటు, పెద్ద హీరోల సినిమాల్లో నటించడం ద్వారా తన స్టార్డంను చాటుకుంటూ ఉంది. తాజాగా మరోసారి కీర్తి సురేష్ తన అందమైన ఫోటోలను షేర్ చేసింది. అయితే ఈ ఫోటోలు రీసెంట్వి కావని, ఇంతకు ముందు మేము మాల్దీవ్స్కి వెళ్లిన సమయంలో తీసుకున్న ఫోటోలు అని ఆమె స్వయంగా చెప్పుకొచ్చింది. కీర్తి సురేష్ పెళ్లి చేసుకున్న తర్వాత భర్తతో కలిసి మాల్దీవ్స్కి వెళ్లింది. అక్కడ హనీమూన్ ను చాలా రోజుల పాటు ఎంజాయ్ చేసిన కీర్తి సురేష్ దంపతులు తిరిగి వచ్చారు. అయినా కూడా అక్కడ నుంచి మనసు మాత్రం రావడం లేదు అంటూ కీర్తి సురేష్ తాజాగా ఈ ఫోటోలను షేర్ చేసింది. మాల్దీవ్స్ లో గడిపిన రోజులను గుర్తు చేసుకుంటూ కీర్తి సురేష్ ఫోటోలను షేర్ చేసింది. భౌతికంగా ఇక్కడ ఉన్నా కూడా మనసు మాత్రం అక్కడే ఉంది అంటూ ఈ ఫోటోలను షేర్ చేయడం ద్వారా అందరి దృష్టిని కీర్తి సురేష్ ఆకర్షించింది. ఆ జ్ఞాపకాలను నెమరు వేసుకుంటున్న కీర్తి సురేష్ మరోసారి తన అందమైన ఫోటోలను అందరితో షేర్ చేసుకోవడంతో వైరల్ అయింది.

అక్షర వార్త

శుక్రవారం, జూన్ 13, 2025

## పది రోజులు ముందుగానే లక్ష్యాన్ని దాటిన యోగాంధ్ర

విజయవాడ : ప్రజల్లో యోగాభ్యాసం పట్ల అవగాహనను పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నెల రోజుల యోగాంధ్ర కార్యక్రమం 10 రోజులు ముందుగానే నిర్దేశించిన లక్ష్యాలను దాటి ముందుకు సాగుతోందని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో మే 31న యోగాంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. జూన్ 21న విశాఖపట్నంలో జరిగే ప్రధాన కార్యక్రమంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా లక్షకు పైగా ఎంపిక చేసిన కేంద్రాంల్లో 2 కోట్ల మంది యోగాభిలాషులు పాల్గొనే దిశగా లక్ష్యాన్ని నిర్దేశించింది. 2 కోట్ల రిజిస్ట్రేషన్ లక్ష్యాన్ని అధిగమించి జూన్ 10 రాత్రి వరకు 2,04,64,831 యోగాభిమానులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. యోగా శిక్షకుల రిజిస్ట్రేషన్ మరియు వారి శిక్షణ, యోగా పోటీల నిర్వహణ, స్థలాల ఎంపికలో కూడా నెల రోజుల యోగాంధ్ర లక్ష్యాన్ని దాటి నమోదైన ప్రగతి. రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 21న యోగా కార్యక్రమాల్ని చేపట్టేందుకు ఇప్పటికే 1,36,175 ప్రాంతాల రిజిస్ట్రేషన్ పూర్తయ్యాయని అన్నారు.

## సైయెంట్ తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం

ఉండవల్లి : ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో సైయెంట్‌ఫౌండేషన్, ఏఐసీటీఈ ప్రతినిధులతో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి విభాగం అధికారులు అవగాహన ఒప్పందం చేసుకున్నారు. ఇది త్రైపాక్షిక ఒప్పందం. ఈ ఒప్పందం ద్వారా ప్రధానంగా నగర ఆధారిత ఇన్నోవేషన్ క్లస్టర్లను ప్రారంభించేం దుకు సైయెంట్ ఫౌండేషన్, ఏఐసీటీఈ సహకారం అందించనున్నాయి. మొదటగా విశాఖ నుంచి ఇవి ప్రారంభం కానున్నాయి

## నర్సింగ్ కు ప్రత్యేక ఎంట్రన్స్ పరీక్ష

విజయవాడ : నర్సింగ్ కు ప్రత్యేక ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికా రెడ్డి వెల్లడించారు. 2800 సీట్లు గత సంవత్సరం నర్సింగ్ లో మిగిలిపోయాయి. నర్సుల కొరత మనకు చాలా ఉంది. ఇక్కడ నర్సింగ్ కోర్సు చేసి చాలామంది మిడిల్ ఈస్ట్ దేశాలకు వెళ్ళిపోతున్నారు. ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో ఇతర దేశాల భాషలు నేర్పిస్తున్నారు. నర్సింగ్ లో ఇతర దేశాలలో అధిక జీతాలకు మన విద్యార్థులు పని చేస్తున్నారు. నర్సింగ్ సెట్ లో 100 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇంగ్లీషు, నర్సింగ్ ఆప్టిట్యూడ్ టెస్ట్, బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్ సబ్జెక్టులుగా ఎంట్రన్స్ పరీక్ష ఉంటుంది. జూలై 6న పరీక్ష జరుగుతుంది. ఇతర రాష్ట్రాల వారు కూడా దరఖాస్తు చేస్తారు కనుక 15 వేల మంది వరకూ పరీక్ష రాస్తారని ఆశిస్తున్నాం. డబ్ల్యూహెచ్వో ప్రమాణాల కంటే 1.99 తక్కువగా నర్సులు ఉన్నారని అన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య....,మెరుగైన సౌకర్యాలు

ధర్మపురి : ధర్మపురి మండలం కమలాపూర్ గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులతో జిల్లా విద్యాధికారి కె రాము గారు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరిస్తూ ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించాలని కోరారు.కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఉపాధ్యాయుడు నూనావత్ రాజేష్ తన ముగ్గురు పిల్లలు అనిరుధ్, అన్విత,అక్షర లను కమలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు.ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి రాము మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో సంపూర్ణ మూర్తిమత్వం అభివృద్ధి జరుగుతుందని మరియు అర్హత కలిగిన, అనుభవజు&జలైన ఉపాధ్యాయులు ఉంటారని ఉచితంగాపాఠ్యపుస్తకాలతోపాటు రెండు జతల యూనిఫామ్స్,నోట్ బుక్స్ ఇవ్వడం జరుగుతుందని ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు.మండల విద్యాధికారి సీతా లక్ష్మీ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### తెలంగాణ ధూప దీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో

## రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

రామగుండం: స్థానిక ప్రశాంత్ నగర్ హనుమాన్ దేవాలయంలో తెలంగాణ ధూప దీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి, ధూప దీప నైవేద్య అర్చకులకు అర్చక వెల్ఫేర్ బోర్డు ద్వారా రావాల్సిన ఫలాలను అందించడం కొరకు ఒక బ్రోచర్ విడుదల చేయడం ఎంతో సంతోషం రేవంత్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రివర్యుల కుండా సురేఖ, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క,శైలజ రామన్, ధూప దీప నైవేద్య అర్చకులకు మేలు చేసే విధంగా వారు తీసుకున్న నిర్ణయాలకు ఆనంద పడుతూ వారికి క్షీరాభిషేకం చేయడం జరిగింది రాష్ట్రంలోని 6500 మంది అర్చకులు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బాగుండాలని వారి గోత్రనామాలతో అర్చనలు అభిషేకాలు చేయడం జరుగుతోంది రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వము బావుండాలని అర్చక లోకం కోరుకుంటుంది ఈ కార్యక్రమంలో తెలంగాణ ధూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షులు. నిట్టూరి సతీష్ శర్మ, ఉపాధ్యక్షులు కాందూరి దామోదరచార్యులు, జిల్లా ఉపాధ్యక్షులు వేటూరి శ్రావణ్ కుమార్, ఆచార్యులు జిల్లా ముఖ్య నాయకులు రుద్రపట్ల సత్యనారాయణ శర్మ,వివిధ మండలాల అధ్యక్షులు అర్చకులు పాల్గొన్నారు.

## ఒక్క విద్యార్థిని పాఠశాలను కాపాడింది

ఖమ్మం : గత ఏడాది ప్రభుత్వ పాఠశాల మూతపడకుండా కాపాడిన నాలుగో తరగతి విద్యార్థిని నేడు అదే పాఠశాలకు ప్రచారకర్తగా మారింది. ఖమ్మం జిల్లా వైరా మండలం నారపునేనిపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో నందిగామ కీర్తన ఒక్కరే నాలుగో తరగతి విద్యను కొనసాగించింది ఒక్కవిద్యార్థి ఉన్నా పాఠశాలను నడిపించాలనే ప్రభుత్వ ఆదేశాలతో ఉపాధ్యాయురాలు ఉమాపావని బాలికకు ఏడాది పాటు బోధించడంతో పాటు మధ్యాహ్న భోజనం సమకూర్చారు. ఈ ఏడాది ఇక్కడ విద్యార్థుల సంఖ్య పెంచాలని కలెక్టర్ ముజమ్మిలాఖాన్, అదనపు కలెక్టర్ శ్రీజ ప్రత్యేక చొరవ తీసుకొని పాఠశాలలో ప్రత్యేకంగా మౌలిక వసతులు ఏర్పాటు చేశారు అందులో భాగంగా పాఠశాల కొనసాగేందుకు కారణమైన కీర్తన చిత్రాన్ని బడి గోడపై ఇటీవల వేయించారు.సుమారు 5లక్షల రూపాయలతో విద్యుత్తు ఫెన్సింగ్తో పాటు మరుగుదొడ్లు, నీటి వసతిని కల్పించి బడిని ఆధునికీకరించారు కలెక్టర్, అదనపు కలెక్టర్ ఆ పనులను పరిశీలించి కీర్తనతో ప్రత్యేకంగా మాట్లాడారు నీకు స్నేహితులు కావాలిగా ఇక్కడ మంచి చదువు చెబుతున్నారని చెప్పి వారిని తీసుకురా వాలి' అని ఆమెకు సూచించారు. విద్యార్థులు పాఠశాలకు వచ్చేందుకు ఆటోను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.మరో ఉపాధ్యాయుడు రాంబాబును ఈ పాఠశాలకు కేటాయిస్తున్నామని పేర్కొన్నారు. ఈ గ్రామంలో 50 మంది విద్యార్థులు ఉండగా వారంతా ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారని,ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమంలో ఇప్పటివరకు 12 మంది స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చేరేందుకు అంగీకరించారని అధికారులు కలెక్టర్కు తెలిపారు.మొత్తం20 మంది విద్యార్థులను పాఠశాలలో చేర్పించేందుకు అధికారులుకృషి చేయాలని అధికారులను ఆదేశించారు.

## ప్రజలకు న్యాయం చేస్తేనే గుర్తింపు

హైదరాబాద్ : తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల సాధనే లక్ష్యంగా తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ నాల్గవ ప్లీనరీ సమావేశంలో ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కెసిఆర్ లక్ష కోట్లను మింగి ప్రజలపై కోట్ల భారం వేశారు. అప్పు మిగిలింది ప్రాజెక్టు కూలింది కేసీఆర్ మాటలు మాట్లాడడం సరికాదు. ప్రభుత్వం అన్యాయం చేసిన వారిపై శిక్షను వేయడం సరైంది. ప్రజలకు న్యాయం చేస్తేనే గుర్తింపు వస్తుంది. అందుకే తెలంగాణ జనసమితి పార్టీని పెట్టడం జరిగిందని అన్నారు. గెలుపుకోసం ప్రజల మనస్సు ఉండాలి. కాంగ్రెస్ పార్టీలో సీఎం.కు చెప్పిన పనులను చేస్తున్నారు.

# ఏపీలో 10 గంటల పని

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రైవేటు పరిశ్రమల పని గంటలను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై ప్రైవేటు రంగంలో పని చేసే ఉద్యోగులు పది గంటలు పని చేయాల్సి ఉంటుంది. ప్రైవేట్ రంగంలో పనిచేసే ఉద్యోగుల కోసం కార్మిక చట్టాల్లో భారీ మార్పులు చేపట్టింది. సవరించిన 'ఆంధ్రప్రదేశ్ ఫ్యాక్టరీల చట్టం' ప్రకారం ఇప్పటి వరకు 9 గంటలు పని చేసిన ఉద్యోగులు రోజుకు 10 గంటలు పని చేయాల్సి ఉంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగులు రోజుకు గరిష్టంగా 8 గంటలు పని చేయడానికి పరిమితి ఉండేది. కొత్త రాష్ట్రం ఏర్పాటు అయిన తర్వాత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. పెట్టుబడులు భారీగా ఆకర్షించేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో పని గంటల పెంపు కూడా ఒకటి. మ్యాన్‌పవర్ అధికంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో పని గంటలు కూడా 10 గంటలు చేస్తే పరిశ్రమలు వచ్చేందుకు మొగ్గు చూపుతాయని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే పదేళ్ల క్రితం 8 గంటలుగా ఉన్న వర్కింగ్ అవర్స్‌ను 9 గంటలకుపెంచారు. ఇప్పుడు సెక్షన్ 54 కింద మార్పులు చేర్పులు చేసి 10 గంటలు చేశారు. దీనితో పాటు సెక్షన్ 55లో కూడా సవరణలు చేశారు. మొదట ఐదు గంటల పని తర్వాత అరగంట విరామం తప్పనిసరిగా ఉండేది, దీనిని ఇప్పుడు ఆరు గంటల పని తర్వాత ఒక గంట విరామంగా మార్చారు.ఓవర్ టైం గరిష్ట పరిమితిలో కూడా మార్పులు చేశారు. మొదట ఇది 75 గంటలు ఉండగా, ఇప్పుడు 144 గంటలకు పెంచారు. రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల మంత్రి కె. పార్థసారథి మాట్లాడుతూ, ఈ మార్పులు ప్రభుత్వ "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" విధానంలో భాగమని అన్నారు. నిబంధనలను కొద్దిగా సడలించడం వల్ల ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువ పెట్టుబడులు వస్తాయని, వ్యాపారం చేయడం సులభం అవుతుందని ఆయన అన్నారు.పని గంటలు పెంచడాన్ని కార్మిక సంఘాలు వ్యతిరేకించాయి. కొత్త నిబంధనల కారణంగా ఫ్యాక్టరీ యజమానులు కార్మికులతో నిర్ణీత సమయం కంటే ఎక్కువ, అంటే రెండు గంటలు అదనంగా పని చేయించుకోవచ్చని వారు అంటున్నారు. దీనివల్ల ఉద్యోగులు రోజుకు 12 గంటలు లేదా అంతకంటే ఎక్కువ పని చేయాల్సి రావొచ్చు, ఇది వారి ఆరోగ్యం, వ్యక్తిగత జీవితంపై పెను ప్రభావం చూపుతుందని అంటున్నారు.భారత్ కార్మిక చట్టాలు, ఫ్యాక్టరీస్ ఆక్ట్-1948, షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్స్ ఆక్ట్-1953 ప్రకారం ఎనిమిది గంటల వర్కింగ్ అవర్స్ మాత్రమే అమలులో ఉంది. కానీ ప్లాంటేషన్స్ శ్రామిక చట్టం, 1951 వంటి కొన్ని ప్రత్యేక చట్టాల ప్రకారం కొన్ని రాష్ట్రాల్లోని ప్రత్యేక వెసులుబాటు పొందుతున్నాయి. 10 గంటల వర్కింగ్ అవర్స్‌ను అమలు చేస్తున్నాయి. అవి అస్సాం (టీ ఎస్టేట్స్), తమిళనాడు (ప్లాంటేషన్స్, టెక్స్టైల్స్), కేరళ (ప్లాంటేషన్స్, కొన్ని ఇండస్ట్రీలు), కర్ణాటక (కాఫీ ఎస్టేట్స్, కొన్ని ఫ్యాక్టరీలు), మహారాష్ట్ర (కొన్ని ఫ్యాక్టరీలు, టెక్స్టైల్స్), పశ్చిమ బెంగాల్ (టీ ఎస్టేట్స్, కొన్ని ఫ్యాక్టరీలు) ఇప్పుడు ఈ జాబితాలోకి ఆంధ్రప్రదేశ్ కూడా చేరిపోయింది

## పోషణ తో కూడిన విద్యను అందించడమే లక్ష్యం

### జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ : అమ్మ మాట - అంగన్ వాడి బాట కార్యక్రమంలో జిల్లా కలెక్టర్

జగిత్యాల : "మహిళా అభివృద్ధి,శిశు సంక్షేమ శాఖ అధ్వర్యంలో అమ్మ మాట - అంగన్ వాడి బాట కార్యక్రమాన ధర్మపురి మండలం దొంతాపూర్ గ్రామంలో నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ హాజరై మాట్లాడుతూ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో పోషణతో కూడిన విద్యను అందించడమే ప్రధాన లక్ష్యమని,ఈ అంగన్వాడి కేంద్రంలో మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లల యొక్క నమోదులు పెంచడం మరియు పిల్లల యొక్క ప్రీస్కూల్ హాజరును పెంచడమే అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. అంగన్వాడీ కేంద్రంలో ప్రైవైట్ బడులకు ధీటుగా పూర్వ ప్రాథమిక విద్య బలోపేతం కోసం ప్రత్యేకమైన సిలబసును రూపొందించి ఆటపాటలతో కూడుకున్న విద్యను పిల్లలకు అందజేసి పిల్లల్లో సృజనాత్మకను ప్రోత్సహించడం జరుగుతుందని అన్నారు.. అంగన్వాడి కేంద్రంలోని పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా యూనిఫాములు, ఆట వస్తువులు,ఫర్నిచర్లు,మ్యాట్లు , ప్రియదర్శిని పుస్తకాలు పిల్లల కోసం అందజేయడం జరుగుతుందని చెప్పారు.అలాగే అంగన్ వాడి కేంద్రాలకు సొంత భవనాలతో పాటు మౌలిక సదుపాయాలు - త్రాగు నీరు,మరుగుదొడ్లు,విద్యుత్ కూడా అందివాడనికి ప్రభుత్వం ప్రత్యక శ్రద్ధ చూపడం జరుగుతుందని పేర్కొన్నారు..ఈ విధంగా పిల్లలకు అమ్మ ఒడి తరువాత ,అంగన్ వాడి బడి తర్వాతి ఒడి గా ఉంటుందని అన్నారు. ఇలాంటి మెరుగైన సేవలను అంగన్వాడీ కేంద్రం ద్వారా అందజేయడం జరుగుతుందని అందుకని ప్రతి ఒక్క తల్లి దండ్రులు తమకు దగ్గరగా ఉన్న అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలను చేర్పించి అంగడి వాడి సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా అందరిని కోరారు. చివరగా అంగన్ వాడి కేంద్రములో ఏర్పరిచిన బడి గంటను జిల్లా కలెక్టర్ ప్రారంభించి గంట కొట్టారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధు సుధన్, జిల్లా సంక్షేమ అధికారి డాక్టర్ బోనగిరి నరేష్, సిడిపిఓ వాణిశ్రీ, సూపర్వైజర్లు పవిత్ర, లత, అంగన్వాడీ టీచర్లు,ఆయాలు, తల్లిదండ్రులు పిల్లలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కొత్త టోల్ విధానం..



### ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్

హైదరాబాద్ : కొత్త విధానం ప్రకారం... అత్యంత ముఖ్యమైన మార్పు ఏమిటంటే, ఇప్పుడు వాహనదారులు తాము ప్రయాణించిన దూరాన్ని బట్టి మాత్రమే టోల్ రుసుము చెల్లించాలి.కేంద్ర ప్రభుత్వం త్వరలో దేశవ్యాప్తంగా కొత్త టోల్ విధానాన్ని అమలు చేయనుంది. దీని ద్వారా జాతీయ రహదారులపై ప్రయాణించే వారికి భారీ ఉపశమనం లభించనుంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ కొత్త టోల్ విధానం వచ్చే వారం లేదా పది రోజుల్లో అమలులోకి రావచ్చు. టోల్ వసూలుకు సంబంధించిన ప్రస్తుత వ్యవస్థను మరింత పారదర్శకంగా, సౌకర్యవంతంగా, సరసమైనదిగా మార్చడమే దీని ప్రధాన లక్ష్యం.కొత్త విధానం ప్రకారం అత్యంత ముఖ్యమైన మార్పు ఏమిటంటే, ఇప్పుడు వాహనదారులు తాము ప్రయాణించిన దూరాన్ని బట్టి మాత్రమే టోల్ రుసుము చెల్లించాలి. అంటే, ఒక వాహనం కేవలం 10 కిలోమీటర్ల దూరం మాత్రమే ఎక్స్‌ప్రెస్‌వే లేదా జాతీయ రహదారిని ఉపయోగించినట్లయితే, దానికి అనుగుణంగానే టోల్ చెల్లించాల్సి ఉంటుంది. దీనివల్ల తక్కువ దూరం ప్రయాణించే వారికి కూడా పూర్తి టోల్ స్లాబ్‌ను చెల్లించాల్సిన పరిస్థితి నుంచి ఉపశమనం లభిస్తుంది. ప్రస్తుతం ఒక టోల్ ప్లాజాను దాటితే, ఎంత దూరం ప్రయాణించినా నిర్దిష్ట రుసుము చెల్లించాల్సి వస్తుంది. కొత్త విధానంతో ఈ సమస్య పరిష్కారమవుతుంది.కొత్త వ్యవస్థలో ప్రతి టోల్ బూత్ వద్ద అత్యాధునిక కెమెరాలను ఏర్పాటు చేస్తారు. ఈ కెమెరాలు వాహనాల నంబర్ ప్లేట్‌లను స్కాన్ చేస్తాయి. అదే సమయంలో, ఫాస్టాగ్ ద్వారా వాహనదారుల బ్యాంకు ఖాతా నుండి టోల్ మొత్తం ఆటోమేటిక్‌గా కట్ అవుతుంది. ఈ సాంకేతికత ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్, ఫాస్టాగ్‌లను కలిపి పనిచేస్తుంది. దీనివల్ల టోల్ ప్లాజాల వద్ద ఏర్పడే పొడవైన క్యూలు, ట్రాఫిక్ జామ్‌ల నుండి విముక్తి లభిస్తుంది. అంతేకాకుండా, టోల్ దొంగతనం, మోసాలపై కూడా అడ్డుకట్ట పడుతుంది. ప్రయాణికులు టోల్ ప్లాజాల వద్ద ఆగి డబ్బులు చెల్లించాల్సిన అవసరం ఉండదు, ఇది సమయాన్ని ఆదా చేస్తుంది.ఈ కొత్త టోల్ విధానం ప్రస్తుత వ్యవస్థతో పోలిస్తే మరింత పారదర్శకంగా, వినియోగదారునికి అనుకూలంగా ఉంటుంది. టోల్ మొత్తం నేరుగా వాహన యజమాని ఖాతా నుండి కట్ అవుతుంది. కాబట్టి నగదు లావాదేవీలు, వివాదాలకు అవకాశం ఉండదు. ప్రయాణికులు పదే పదే ఆగాల్సిన అవసరం ఉండదు.ప్రభుత్వం ఈ కొత్త చొరవ ప్రయాణాన్ని సులభతరం చేయడమే కాకుండా, ట్రాఫిక్ జామ్‌లు, ఇంధన వృధా, సమయం వృధాను కూడా తగ్గిస్తుంది. కొత్త టోల్ విధానం అమలులోకి వచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా రహదారులపై ప్రయాణించడం గతంలో కంటే మరింత చౌకగా, వేగంగా, సౌకర్యవంతంగా ఉంటుందని ఆశిస్తున్నారు. ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా సానుకూల ప్రభావం చూపుతుంది. ఎందుకంటే వస్తువుల రవాణా ఖర్చులు తగ్గే అవకాశం ఉంది.

# అమెరికాలో లూటీ..

లాస్ ఏంజిల్స్ : అగ్రరాజ్యంలోని లాస్ ఏంజెల్స్ ప్రాంతంలో ప్రస్తుతం గొడవలు జరుగుతున్నాయి. అక్కడ పరిస్థితి ఏమాత్రం బాగోలేదు. ప్రజలు వీధుల్లోకి వచ్చి గొడవలు చేస్తున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు.. ఇప్పటి అక్కడ భారీ స్థాయిలో నష్టం చోటుచేసుకుంది. కార్యాలయాలు మూతపడ్డాయి. ప్రభుత్వం అత్యవసర పరిస్థితిని విధించింది. పోలీసులు కర్ఫ్యూ విధిస్తున్నారు. అయినప్పటికీ నిరసనకారులు ఆగడం లేదు. ఇక కొన్నిచోట్ల నిరసనకారులు విధ్వంసాలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా షాపింగ్ మాల్స్ లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. గుంపులుగా వెళ్లి లూటీలు చేస్తున్నారు. ఆ దారుణానికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో విపరీతంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా శ్వేత దేశంలో స్థిరపడిన ఇతర దేశస్తులు ఈ వీడియోలను సోషల్ మీడియాలో ప్రముఖంగా ప్రచారం చేస్తున్నారు. మొత్తంగా చూస్తే అమెరికాలో కూడా అత్యంత అధ్వానమైన పరిస్థితులు ఉన్నాయని తెలుస్తోంది.పిల్లిని ఒక గదిలో బంధిస్తే.. దానిపై దాడికి పాల్పడితే అది ఒక్కసారిగా ప్రతి దాడి చేసినట్టు.. లాస్ ఏంజిల్స్ లో కూడా పరిస్థితి అలానే ఉంది. అక్కడ ప్రజలు నిర్బంధించడంతో వారిలో ఆగ్రహం కట్టలు తెంచుకున్నది. ప్రభుత్వంపై తిరుగుబాటు మొదలైంది. పోలీసులపై దాడులు చేసే స్థాయికి దిగజారింది. అయితే కొంతమంది నిరసనకారులు సహనం కోల్పోయి అడ్డగోలుగా విధ్వంస కార్యక్రమాలు చేపడుతున్నారు. దుకాణాలలో లూటీలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ ఆస్తులకు నష్టం చేకూర్చుతున్నారు. అందువల్లే అక్కడ పోలీసులు కర్ఫ్యూ విధిస్తున్నారు.షాపింగ్ మాల్స్ మూసివేసినప్పటికీ దొడ్డి దారిన వెళ్తున్న నిరసనకారులు వాటిలో ఉన్న సామాగ్రి.. డబ్బులు దొంగిలిస్తున్నారు. అయితే ఈ తరహా దారుణాలు గత రెండు రోజుల వ్యవధిలో పెరిగిపోయాయని గ్లోబల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ప్రపంచానికి నాగరికత నేర్పామని గొప్పలు చెప్పే అమెరికాలో ఇటువంటి దారుణాలు చోటు చేసుకోవడం నిజంగా ఆశ్చర్యకరంగా ఉందని అంతర్జాతీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. అమెరికా కూడా ఒక సాధారణ దేశమేనని.. దానిని ప్రత్యేకంగా చూడాల్సిన అవసరం లేదని వారు ఉటంకిస్తున్నారు. " అమెరికాలో కూడా అంత గొప్పగా పరిస్థితి లేదు. ఇప్పటికే ట్రంప్ ఆధ్వర్యంలో అక్కడ ఏం జరుగుతుందో అర్థం కావడం లేదు.. రోజురోజుకు ప్రజలలో ఆగ్రహం పెరుగుతోంది. ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు ప్రపంచ వ్యాప్తంగా ప్రభావాన్ని చూపిస్తున్నాయి.

## అది సాక్షి కార్యాలయం కాదు.. ఫర్నిచర్ గోడౌన్

ఏలూరు : ఏలూరు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో ఏలూరు డిఎస్పి శ్రావణ్ కుమార్ మీడియా సమావేశం నిర్వహించారు. ఏలూరులో జరిగిన అగ్ని ప్రమాద ఘటనకు సాక్షి మీడియాకు సంబంధం లేదు. ఇది ఒక ఫర్నిచర్ షాప్ గోడౌనని అన్నారు. ఈ ప్రమాద ఘటనలో దగ్ధం అయిన ఫర్నిచర్ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశాం. పోలీసులు మంటలు ఆర్పుతూ ఉన్న సమయం తర్వాత అక్కడికి దెందులూరు మహిళలు నిరసన కార్యక్రమంలో భాగంగా ర్యాలీగా అక్కడికి చేరుకున్నారు- ఘటన సమయంలో ఉన్న వీడియోలలో ఇది స్పష్టంగా రికార్డ్ అయిందని అన్నారు. అసలు జరిగిన ప్రమాద ఘటనకు సాక్షి కి ఎలాంటి సంబంధం లేదు. అలాగే మంటలు ఏర్పడే సమయానికి ర్యాలీ కనీసం 200 మీటర్లు దూరంలోనే ఉంది. ఏలూరులో సాక్షి కార్యాలయంపై దాడి అని, సాక్షి ఫర్నిచర్ దగ్ధం అని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాలు అవాస్తవం - ఎవరైనా అసత్య ప్రచారాలు చేస్తే వాళ్లపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని అన్నారు.

## 21 ట్రాన్స్ ఫారాలు ధ్వంసం: కాపర్ వైర్లు చోరీ

ఖమ్మం : నాగులవంచ సబ్- స్టేషన్ పరిధిలో గత ఏప్రిల్ నుండి ఇప్పటివరకు 21 వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్ ఫారాలు ధ్వంసం చేసి కాపర్ వైర్లు చోరీ చేశారు. ఈ దొంగతనాలపై విద్యుత్ అధికారులు, రైతులు చింతకాని పోలీసు స్టేషనులో వేర్వేరు గా పిర్యాదులు చేశారు. వ్యవసాయ సీజన్ ప్రారంభంలోనే దొంగతనాలు ఇలా ఉంటే మున్ముందు దొంగతనాలు ఎలా ఉంటాయోనన్న రైతులు తమ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అయినా దొంగల్ని పట్టుకోవడంలో పోలీసులు నిమ్మకు నిరేత్తనట్లు వ్యరించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి..

## చింతలపూడి మండలంలో అక్రమ మట్టి తోలకాలు

### పట్టించుకోని అధికారులు

ఏలూరు : చింతలపూడి టౌన్ లో పెద్ద చెరువు నుండి ట్రాక్టర్లతో మట్టిత్వాలకాలు చింతలపూడి మెయిన్ రోడ్ లో నుండి ఫైర్ స్టేషన్ సెంటర్కి మట్టి తోలుతుంటే ఆ వైపు చూడని చింతలపూడి రెవెన్యూ అధికారులు ఎందుకని వాళ్లతో లాలూచీ పొందారా ? ఎందుకని పట్టించుకోవడం లేదు వాళ్ళ దగ్గరి నుంచి ఏమైనా ముడుపులు అందుతున్నాయా? అధికార పార్టీ వాళ్ళు ఎవరైనా మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారా ? ఎందుకని రెవెన్యూ వారు పట్టించుకోవడం లేదు కారణం ఏంటి??? మొన్న పట్టాయిగూడెం గ్రామంలో మట్టి తోలుతుంటే ఇదే మీడియా గ్రూపులో పెడుతుంటే ఆ ఊరు ఒక నాయకుడు ఫోన్ చేసి ఎమ్మార్వో కి చెప్తే మీరు మట్టి తోలుకోండి అని చెప్పిన వైనం.ఇంత నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారు రెవిన్యూ అధికారులు ఎందుకు చర్య తీసుకోవడం లేదో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

## మైలవరం అభివృద్ధి కోసం ప్రణాళిక సిద్ధం

మైలవరం : స్వర్ణాంధ్ర విజన్ -2047 కి సంబంధించి తయారైన మైలవరం నియోజకవర్గ డాక్యుమెంటేషన్ పైగొల్లపూడి సాయిదత్తా కళ్యాణ మండపంలో సమీక్షా సమావేశం జరిగింది. ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన సమీక్షా సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎంపీ కేశినేని శివనాథ్ హ జరయ్యారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం విజన్ -2047 లో భాగంగా రాబోయే కాలంలో మైలవరం నియోజకవర్గ అభివృద్ధికై చేయాల్సిన పనులు ఎన్డీయే కూటమి నాయకులు, ప్రభుత్వ అధికారులతో చర్చించారు. అమరావతి రాజధానికి అతి సమీపంలో వున్న మైలవరం నియోజవర్గం రాజధానికి ముఖ ద్వారం. విజయవాడ, అమరావతికి ముఖ ద్వారంగా వున్న మైలవరం నియోజకవర్గంలో అగ్రికల్చర్, హార్టికల్చర్, టూరిజం, స్పోర్ట్స్, ఇండస్ట్రీ పరంగా అభివృద్దికి అవకాశం. మైలవరం అభివృద్ధి విజయవాడ, అమరావతి రాజధాని అభివృద్ధిపై ఆధారపడి వుంది.

## తెలంగాణ ఉద్యమకారుల నిరసన

హైదరాబాద్ : పదేళ్లు పరిపాలించిన బీఆర్ఎస్ గత ప్రభుత్వంలో తెలంగాణ ఉద్యమకారులకు ఎలాంటి న్యాయం జరగలేదని తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల మహిళా వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు కోతి మాధవిరెడ్డి ధ్వజమెత్తారు. హైదరాబాద్ నాంపల్లి లోని గన్ పార్క్ వద్ద తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసీఆర్ ఇచ్చిన హామీల మేరకు ఉద్యమకారులకు మోసం చేశారని, అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లు గడుస్తున్నా మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రకారం రం ఉద్యమకారులను పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. రాహుల్, సోనియా గాంధీ ఇచ్చిన హామీలు మేరకే రేవంత్ రెడ్డి ఉద్యమకారులకు 250 గజాల స్థలాన్ని, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని చెప్పి మొండి చేయి చూపించారని మండిపడ్డారు. నాటి తెలంగాణ ఉద్యమంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు. ఇప్పటికైనా రేవంత్ ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉద్యమకారులకు 250 గజాల స్థలాన్ని, అలాగే సంక్షేమ సంఘంను ఏర్పాటు చేయాలని కోరారు. లేని పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## బీజేపీ నేతల అరెస్టు

కూకట్ పల్లి : కెపిహెచ్ బి కాలనీలో జరుగుతున్న హౌసింగ్ బోర్డ్ స్థలాల వేలంపాటను అడ్డుకునేందుకు వచ్చిన బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి కె.పి.హెచ్.బి పోలీస్ స్టేషన్ కు తరలించారు. పేద మధ్యతరగతి ప్రజల కోసం ఏర్పడిన హౌసింగ్ బోర్డ్ వ్యాపారం చేయడం ఏమిటని భాజపా కూకట్ పల్లి ఇంచార్జ్ మాధవరం కాంతారావు ప్రశ్నించారు.వేలం పాటను నిలిపివేసి ప్రజా ప్రయోజనం కోసం ఉపయోగించాలని, బీదవారికి అందించాలని డిమాండ్ చేసారు. కూకట్పల్లి కెపిహెచ్ బి కాలనీ కమ్యూనిటీ హాలులో బుధవారం 11 గంటల నుండి తెలంగాణా హౌసింగ్ బోర్డులోని 18 ప్లాట్ల వేలం పాట కొనసాగింది.వేలం పాటను అడ్డుకొనే ప్రయత్నం చేసిన బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేసారు. వేలం సాఫీగా నిర్వహించేందుకు ముందస్తుగా బందోబస్తు ఏర్పాటు చేసారు.

## ఆర్టీసీ క్రాస్ రోడ్ లోని మాంగళ్య షాపింగ్ మాల్ సీజ్

హైదరాబాద్ : చిక్కడపల్లి ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని మాంగళ్య షాపింగ్ మాల్ ను జీహెచ్ఎంసి అధికారులు బుధవారం నాడు సీజ్ చేసారు. బహుళ అంతస్తులు నిర్మించిన భవనానికి ఆక్యుపేన్సి సర్టిఫికెట్ లేకుండా మాంగల్య షాపింగ్ మాల్ను నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. దాంతో జిహెచ్ఎంసి సర్కిల్ 15 టౌన్ ప్లానింగ్ అధికారులు షాపింగ్ మాల్ ను సీజ్ చేసారు.

## ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలి

జగిత్యాల:ప్రతి ఒక్కరూ తమ తమ ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ప్రమోద్ కుమార్ సూచించారు.టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం 100 రోజుల కార్యాచరణలో భాగంగా జగిత్యాల అర్బన్ మండలం నూకపల్లి గ్రామంలో జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే ప్రమోద్ కుమార్,జిల్లా ఉప వైద్యదికారి డాక్టర్ యన్. శ్రీనివాస్, వైద్యాధికారి డాక్టర్ సౌజన్య ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కల్లెడ ఆధ్వర్యంలో సమీకృత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ టి బీ అనుమానితులను ఇక్కడే పరీక్షించి ఎక్సరెలు కూడా నిర్వహించి ఫలితాలు వెంటనే తెలుపుతున్నామని చెప్పారు.. వీరిలో ఎక్కువగా 60 సంవత్సరములు పైబడిన వృద్ధులు పొగ తాగే వారు ఆల్కహాల్ సేవించేవారు పొగాకు తినేవారు డయాబెటిస్ ఉన్నవారు పూర్వం టీ బీ మందులు వాడినవారు,వారి సన్నిహితులకు పరీక్షలు నిర్వహించి రోగనిర్ధారణ అయితే ఉచిత మందులతో పాటు పోషణ బత్యం ఇవ్వబడుతుంది తెలిపారు.

ఆనంతరం జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎన్. శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ శిబిరంలో 201 మందినీ పరీక్షించి 69 రక్త నమూనాలను శాంపిల్స్ సేకరించి టీ- హబుకు పంపించారు.అలాగే 52 మందికి హెచ్ఐవి పరీక్షలు చేశారు.

Printed,Published and owned by **T. SRINIVAS,** H.No.2-9-37, Flat No. 205, SSA Residency Mukarampura, Karimnagar-505001, Telangana, Published at H.No.2-9-37, Flat No. 205, SSA Residency Mukarampura, Karimnagar-505001, Telangana, Printed at **Ramani Web offset Printers,**, H.No. 8-82/11/1,Auto Nagar, Bommakal,Mdl&Dist. Karimnagar-505001. Telangana Editor:**T. SRINIVAS**.RNI.No. TELTEL/2011/47101